తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

30.03.2026 సోమవారం | సంపుటి : 12 సంచిక : 250 | పేజీలు : 12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







# మైనింగ్ లొల్లి

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

- మంత్రి శ్రీధర్ బాబు తీర్మానంతో రెండురోజులు వేటువేసిన స్పీకర్
- కౌశిక్ రెడ్డిపై చర్యకు ఎథిక్స్ కమిటీకి సిఫారసు
- సభలో గందరగోళం సృష్టిస్తే సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్
- అతని తీరు అత్యంత అసభ్యకరంగా ఉంది : సీఎం రేవంత్

**హైదరాబాద్ మార్చి, 29 (జనంసాక్షి) :**

తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని.. వారిని సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, మహిపాల్ రెడ్డి, మాణిక్ రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్రెడ్డి, మర్రి రాజశేఖర్రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.పి. వివేకానంద్, అనిలాజాదవ్, కోవ లక్ష్మి సస్పెండ్ అయినవారిలో ఉన్నారు. కడియం శ్రీహరి విషయంలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తనను ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేయాలని సభలో తీర్మానించారు.

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు అత్యంత అసభ్యకరంగా ఉందని, ప్రజాస్వామ్య దేవాలయంలో ఇలాంటి ప్రవర్తన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిని గౌరవించకుండా, దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ను అవమానించేలా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సభా మిగిలిన 2లో

## మైనింగ్‌లో అక్రమాలు జరిగివుంటే చర్యలు తప్పవు

- సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి చెప్పి కాళేశ్వరంపై విచారణ జరిపించలేరా..?
- ధరణి పోర్టల్‌లో అక్రమాలపై హౌస్ కమిటీకి మేం సిద్ధం : సీఎం



**హైదరాబాద్ (జనంసాక్షి) :**
మైనింగ్ విభాగంలో అక్రమాలు జరిగివుంటే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో సూచనలు ఇచ్చి పారిపోవడం భాజపా సభ్యులకు అలవాటుగా మారిపోయిందని విమర్శించారు. కాళేశ్వరం వ్యవహారంపై మిగిలిన 2లో

## మేనకా గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

- వీధి కుక్కల నిర్వహణ, గోసంరక్షణపై చర్చ
- ఎన్‌కేపల్లిలో అత్యాధునిక గోశాల నిర్మాణం
- జంతు సంరక్షణలో తెలంగాణ ప్రభుత్వ చర్యలు ప్రశంస

2





# ముదిరిన పశ్చిమాసియా యుద్ధమేఘాలు

## పాకిస్తాన్‌లో ఉన్నతస్థాయి సమావేశం

- సౌదీ అరేబియా, తుర్కియే, ఈజిప్ట్ దేశాల మంత్రులు చర్చలు
- ఇరాన్ అధ్యక్షుడితో విస్తృత స్థాయిలో చర్చించా
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడి

**ఇస్లామాబాద్ (జనంసాక్షి) :**
మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ఇటు ఇరాన్.. అటు అమెరికా, ఇజ్రాయేల్ ఎవరికీ వారు తగ్గేది లేదంటూ రెచ్చిపోతున్నాయి. దీంతో ఏ క్షణంలో ఏమవుతుందో అనే భయంతో ప్రపంచ దేశాలు బిక్కు, బిక్కు మంటున్నాయి. యుద్ధాన్ని ఆపగలిగే ఏ అవకాశమైనా ఉంటుందా? అనే వెతుకులాటలో పడ్డాయి. కానీ, రెండు పక్షాల మధ్య రాజీకోసం ఎవరు ప్రయత్నిస్తారు అనే పెద్ద ప్రశ్న. దానికి సమాధానం అన్నట్టు కొన్నిరోజులుగా పాకిస్తాన్ తాను యుద్ధంలో రాజీకి ప్రయత్నిస్తున్నాను అంటూ చెబుతుండటం ఆసక్తి కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో గల్ఫ్ ఉద్రిక్తతలను చల్లార్చే దిశగా పాక్ వేదికగా ఆదివారం సౌదీ అరేబియా, తుర్కియే, ఈజిప్ట్ దేశాల మంత్రులు చర్చలు ప్రారంభించారు. ఈజిప్ట్ విదేశాంగ శాఖ మంత్రి బదర్ అబ్దెలాటీ పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్‌తో ఆదివారం ఇస్లామాబాద్‌లో సమావేశమయ్యారు. త్వరలో ఆయన తుర్కియే విదేశాంగ శాఖ మంత్రి హకాన్ ఫిడాన్, సౌదీ విదేశాంగ శాఖ మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌తో కూడా సమావేశమయ్యారు. ఈ చర్చల పురోగతిపై ఆయన పాక్ మిగిలిన 2లో

## ఇజ్రాయెల్ ఏజెంట్‌గా ట్రంప్

- పర్షియన్ గల్ఫ్‌లో గ్రౌండ్ అసాల్ట్‌కు ఇరాన్ స్టార్క్ హెచ్చరిక
- ఖతం అల్-అన్బియా స్పోక్స్‌పర్సన్ ఎబ్రాహిం జోల్‌ఫఖారి హెచ్చరిక

9

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బిసి పూర్తి

## రెండేళ్లలో డిండి ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం

- బి.ఆర్.ఎస్ పాలనలో నీటిపారుదల రంగంపై కోటి 81 లక్షలు ఖర్చు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కొత్తగా ఎకరాకు నీళ్లు అందించలేక పోయారు
- అంతర్జాతీయ పరిణామాలతో వాణిజ్య, ఆటో గ్యాస్ కొరత
- ప్రభుత్వం తీసుకున్న చర్యలతో 20 శాతానికి పడిపోయిన వాణిజ్య ,ఆటో గ్యాస్ 40 శాతానికి పెరుగుదల
- కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని వాణిజ్య గ్యాస్‌ను స్థిరికరిస్తాం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

# బీజేపీ గెలిస్తే చేపలు, గుడ్లు తినలేరు



## ఎన్నికల వేళ మమత సంచలన వ్యాఖ్యలు

- ఇతర మతాల మీద వారికి నమ్మకం లేదు
- అల్లర్లు చేయడం, అమాయకుల్ని చంపడం ద్వారా అధికారంలోకి రావాలని చూస్తోంది
- ఎన్నికల ప్రచారం మమతా బెనర్జీ ఘాటు విమర్శలు

**కోల్‌కతా, మార్చి, 29 (జనంసాక్షి) :**
"బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు చేపలు తినడం లేదు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, మాంసం, గుడ్లు తినలేరు" అంటూ టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరందరూ మీ మతాల్ని అనుసరిస్తారు. కానీ, బీజేపీ వాళ్లంతా ఒకేవైపు ఉంటారు. ఇతర మతాల మీద వారికి నమ్మకం లేదు. ధర్మం అంటే మానవత్వం అని శ్రీకృష్ణుడు చెప్పాడు. పని చేయడం ధర్మం. మంచి కోసం పని చేయడమే ధర్మం. కానీ, అల్లర్లు చేయడం, అమాయకుల్ని చంపడం ద్వారా బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోంది అని మమత వ్యాఖ్యానించారు. "అందులోనూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళలపైనే అధిక దాడులు జరుగుతున్నాయి. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలోనే దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. పని కోసం వేరే ప్రాంతాలకు వెళ్లి బెంగాలీ మాట్లాడేవారిపై ఇతర రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. కానీ, మేం ఎవరినీ అణచివేయం. టీఎంసీ అంటే శాంతి, మానవత్వం, మిగిలిన 2లో

# మెట్రో టేకోవర్..



## 22 వేల కోట్ల ఆస్తిని కొట్టేసే కుట్ర

- సిగ్గులేకుండా సీఎం రేవంత్ తప్పుడు లెక్కలు
- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసనలో కేటీఆర్ ధ్వజం



2

# యుద్ధంలో అమెరికాకు భారీ నష్టం

అవాక్ విమానం కూల్చేసిన ఇరాన్

## ఈ-3 సెంట్రీ ఏడబ్ల్యూఏసీఎస్ విమానం ధ్వంసం

- సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై దాడి
- గగనతల నిఘా వ్యవస్థకు తీవ్ర గాయం
- యుద్ధ రంగంలో అమెరికా సామర్థ్యం ప్రభావితం

*ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంలో అమెరికాకు తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. గగనతలంలో దళాలకు కళ్లు, చెవుల మాదిరిగా పనిచేసే అత్యాధునిక నిఘా విమానం ఈ-3 సెంట్రీ ఏడబ్ల్యూఏసీఎస్‌పై ఇరాన్ దాడి చేసి ధ్వంసం చేసింది.*



2



# రష్యా చమురు ఎగుమతులను ధ్వంసం చేసిన ఉక్రెయిన్ డ్రోన్లు

- కీలకమైన ఉస్త్-లుగా నౌకాశ్రయం మరోసారి దాడికి గురి
- బాల్టిక్ సముద్ర ప్రాంత ఎగుమతుల్లో 45% దెబ్బతినే అవకాశం
- రష్యా చమురు ఆదాయానికి తీవ్ర గండి - ధరలు మరింత పెరిగే సూచన
- ఉక్రెయిన్ ఇంధన సంస్థలపై దాడులు తీవ్రం చేస్తోంది

# ఖర్గే ప్రకటించిన 5 గ్యారెంటీలు

- మహిళలకు నెలవారీ నగదు, వ్యాపారానికి రూ.50 వేలు
- అందరికీ రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్
- గిరిజనులకు భూమి పట్టాలు, సీనియర్లకు రూ.1,250 పెన్షన్

2

# దద్దరిల్లిన సుక్మా అడవులు... ఓ మావోయిస్టు మృతి

- పోలంపల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఆపరేషన్ కగార్‌లో మరో ఎన్‌కౌంటర్



2




జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
30 మార్చి 2026

# యుద్ధంలో అమెరికాకు భారీ నష్టం

**న్యూఢిల్లీ, మార్చి 29 (జనంసాక్షి) :** ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంలో అమెరికాకు తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. గగనతలంలో దళాలకు కళ్లు, చెవుల మాదిరిగా పనిచేసే అత్యాధునిక నిఘా విమానం ఈ-3 సెంట్రీ ఏడబ్ల్యూఏసీఎస్‌పై ఇరాన్ దాడి చేసి ధ్వంసం చేసింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్లో ఈ ఘటన జరిగిందని అమెరికా పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇరాన్ ఫిరంగులు, డ్రోన్ల దాడిలో ఈ విమానం భారీగా దెబ్బతిన్నట్లు నివేదికలు వచ్చాయి. ఈ-3 సెంట్రీ సాధారణ విమానం కాదు. బోయింగ్-707 మోడల్‌ను మార్చి గగనతలంలో ఒక కమాండ్ సెంటర్‌గా రూపొందించారు. ఇది 250 మైళ్ల పరిధిలో శత్రు డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలు, ట్యాంకర్ విమానాల కదలికలను పసిగట్టి రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తుంది. యుద్ధ రంగంలో అమెరికా దళాలకు ఇది అత్యంత కీలకమైన ఆస్తి. అమెరికా ఎయిర్ ఫోర్స్ కర్నల్ జాన్ వెనబల్ మీడియాతో మాట్లాడుతూ, "ఈ ఘటన యుద్ధ రంగంలో మా సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతంపై నిఘా ఉంచడం, పరిస్థితిపై అవగాహన పొందడంలో మా దళాలు సమస్యలు ఎదుర్కొనవచ్చు" అని పేర్కొన్నారు.

ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ అమెరికా గగనతల ఆపరేషన్లకు అత్యంత కీలకమైన కేంద్రం. ఇరాన్ వైపు వెళ్లే విమానాలకు ఇంధనం నింపడం, ఇంటెలిజెన్స్ సేకరణ, దాడుల సమన్వయం వంటి కార్యకలాపాలు ఇక్కడి నుంచే జరుగుతాయి. ఈ-3 విమానం ఈ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇరాన్ దాడులను తీవ్రం చేసిన నేపథ్యంలో అమెరికా 3,500 మంది మెరైన్లను పశ్చిమాసియా వైపు తరలించింది. యూఎస్ఎస్ ట్రిపోలీ ఇటీవల సెంట్రల్ కమాండ్ పరిధిలో చేరింది. ఇక్కడి నుంచి భూతల ఆపరేషన్ ఎలా మొదలవుతుందనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకు 303 మంది అమెరికా సైనికులు గాయపడ్డారని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. వీరిలో 273 మంది కోలుకుని తిరిగి విధుల్లో చేరినట్లు తెలిపింది. ఈ ఘటన ఇరాన్-అమెరికా యుద్ధంలో కొత్త మలుపును సూచిస్తోంది. అమెరికా గగనతల నిఘా సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# రష్యా చమురు ఎగుమతులకు భారీ ఎదురుదెబ్బ



**మాస్కో/కీవ్, మార్చి 29 (జనంసాక్షి) :** ఉక్రెయిన్ డ్రోన్లు రష్యా చమురు ఎగుమతులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలించాయి. రష్యా చమురు ఎగుమతుల్లో అత్యంత కీలకమైన ఉస్ట్-లుగా నౌకాశ్రయంపై ఆదివారం మరోసారి తీవ్ర డ్రోన్ దాడి జరిగింది. లెనిన్‌గ్రాడ్ (లెనిన్‌రాడ్) ప్రాంత గవర్నర్ ఈ దాడిని ధ్రువీకరించారు. వారం క్రితం జరిగిన దాడిలోనే ఈ పోర్టు కొంత మేరకు ధ్వంసమై ఎగుమతులు నిలిపివేయబడ్డాయి. తాజా దాడిలో ఉక్రెయిన్ 31 డ్రోన్లను కూల్చినట్లు రష్యా వెల్లడించింది.

**ఉస్ట్-లుగా పోర్టు ఎంత కీలకం?**

బాల్టిక్ సముద్ర ప్రాంతంలో రష్యా చమురు ఎగుమతులకు ఈ పోర్టు అత్యంత ముఖ్యమైనది. రష్యా సముద్ర మార్గం ద్వారా చేసే చమురు ఎగుమతుల్లో దాదాపు 45 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. రోజుకు సుమారు 1.72 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతుంది. భారత్‌తో సహా అనేక దేశాలకు రష్యా ఇంధనం సరఫరా చేసే కీలక పోర్టుల్లో ఇది ఒకటి. ఇటీవల ప్రిమోర్స్క్ పోర్టు కూడా ఉక్రెయిన్ దాడుల్లో బాగా దెబ్బతిన్నట్లు నివేదికలు వచ్చాయి.

**ప్రపంచ చమురు మార్కెట్‌పై ప్రభావం.**

ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో రష్యా ఎగుమతుల్లో అంతరాయం వచ్చడం ధరలను మరింత పెంచే అవకాశం ఉంది. రష్యా తన లోటు బడ్జెట్‌ను పూరించుకోవడానికి చమురు ఎగుమతులపై ఆధారపడి ఉండగా, ఈ దాడులు ఆదాయానికి భారీ గండి పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్ ఇటీవల రష్యా ఇంధన పరిశ్రమపై దృష్టి సారించి, ఈ నెలలోనే 10కి పైగా భారీ దాడులు చేసింది. గత వారం సర్టోవ్ ప్రాంతంలోని భారీ చమురు శుద్ధి కర్మాగారంపై కూడా డ్రోన్ దాడి జరిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇటీవల సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో "మా సుదీర్ఘ శ్రేణి డ్రోన్లు రష్యా ఇంధన సంస్థలపై తీవ్ర స్థాయి దాడులు చేస్తున్నాయి" అని వెల్లడించారు. ఈ దాడులు రష్యా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రపంచ చమురు ధరలు మరింత ఎగసిపోయే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# దద్దరిల్లిన సుక్మా అడవులు... ఓ మావోయిస్టు మృతి

**ఛత్తీస్‌గఢ్, మార్చి 29 (జనంసాక్షి) :** సుక్మా జిల్లా అడవులు మరోసారి తుపాకుల మోతతో దద్దరిల్లాయి. పోలంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు సమాచారం. పోలంపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం అందడంతో ఆపరేషన్ కగార్ భాగంగా భద్రతా దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్రంగా కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వం దేశం నుంచి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించి 'ఆపరేషన్ కగార్'ను తీవ్రంగా కొనసాగిస్తోంది. 2026 మార్చి నెలాఖరు నాటికి మావోలు లేకుండా చేయాలనే లక్ష్యంతో భద్రతా దళాలు వరుస ఎన్‌కౌంటర్లు చేపట్టాయి. ఇప్పటివరకు వందల మంది మావోయిస్టులు హతమయ్యారు. వేల మంది తుపాకులు వదిలి సాధారణ జీవితంలోకి వచ్చారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు, అగ్ర నేతలు కూడా ఉన్నారు.

మార్చి 30న లోక్‌సభలో చరిత్రాత్మక చర్చ

మరోవైపు, నక్సలిజం నిర్మూలనపై మార్చి 30న లోక్‌సభలో చరిత్రాత్మక చర్చ జరగనుంది. రూల్ 193 కింద స్వల్పకాలిక చర్చను శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ప్రారంభించనున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భద్రతా చర్యలు, ప్రస్తుత పరిస్థితులు వంటి అంశాలపై సభ దృష్టి సారించనుంది. ఈ ఎన్‌కౌంటర్ సుక్మా అడవుల్లో మావోయిస్టు నిర్మూలన కార్యక్రమం ఇంకా తీవ్రంగా కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది.

## బీజేపీ గెలిస్తే చేపలు, గుడ్లు తినలేరు

అందరినీ గౌరవించడం. ప్రజలతో కలిసి పని చేయడం" అని వ్యాఖ్యానించారు.

బెంగాల్‌ను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే బీజేపీ కేంద్రంలో అధికారం కోల్పోతుందని ఆమె అంతకుముందు అన్నారు. బెంగాల్‌లో నాలుగోసారి వరుసగా అధికారం చేపడితే, అన్ని పార్టీలతో కలిసి ఢిల్లీని ఆక్రమిస్తామని మమత హెచ్చరించారు. బీజేపీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే వాళ్లు ఇక్కడ బుల్డోజర్లు వాడుతారని విమర్శించారు.

## మైనింగ్ లొల్లి



మర్యాదలను ఉల్లంఘిస్తున్న కౌశిక్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ప్రవర్తనపై సమగ్ర విచారణ జరిపేందుకు ఎథిక్స్ కమిటీకి సిఫార్సు చేయాలని ముఖ్యమంత్రి స్పీకర్‌ను కోరారు. సభలో గందరగోళం సృష్టిస్తూ, చర్చకు అడ్డుపడుతున్న తీరును ఎండగట్టిన సీఎం, ఇదే ధోరణి కొనసాగితే బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సదరు సభ్యులను సస్పెండ్ చేయక తప్పదని గట్టిగా హెచ్చరించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సభను రాజకీయ స్వార్థం కోసం వాడుకుంటున్నారని, నిబంధనల ప్రకారం కౌశిక్ రెడ్డిపై తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

# ఖర్గే ప్రకటించిన 5 గ్యారెంటీలు



**గువాహటి, మార్చి 29 (జనంసాక్షి) :** అస్సాంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు నెలవారీ నగదు బదిలీతో పాటు వ్యాపారం చేసుకునేందుకు, వ్యాపార విస్తరణకు అదనంగా రూ.50,000 సాయం చేస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. మహిళలకు నగదు బదిలీతో సహా మొత్తం 5 హామీలను ఆయన వివరించారు.

లఖింపూర్ జిల్లా నౌబోయిచాలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఖర్గే మాట్లాడుతూ మహిళా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని కుటుంబాలకు రూ.25 లక్షల క్యాష్‌లెస్ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని, 10 లక్షల మంది మూలవాసులకు శాశ్వత భూమి పట్టాలు ఇస్తామని, రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.1,250 చొప్పున పెన్షన్ ఇస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే జుబీన్ గార్గ్ మృతి కేసులో న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. డబుల్ ఇంజన్ పేరుతో అస్సాంను లూటీ చేసి తమ నాయకులు, కుటుంబాల ఖజానాలు నింపుతోందని ఆరోపించారు. హిమంత్ బిశ్వా శర్మను 'నకిలీ సీఎం'గా అభివర్ణించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సర్బానంద్ సోనోవాల్ నాయకత్వంలో బీజేపీ పోటీ చేసినా, గిరిజనుడైన సోనోవాల్‌ను తొలగించి శర్మ సీఎం పదవి చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. అస్సాంలోని 126 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 60 సీట్లు గెలుచుకుని భాగస్వామ్య పార్టీల మద్దతుతో అధికారం చేపట్టింది.

# మేనకా గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్, మార్చి 29 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం కేంద్ర మంత్రి మేనకా గాంధీ నేతృత్వంలోని బృందంతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో వీధి కుక్కల నిర్వహణ మరియు గోసంరక్షణ చర్యలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్ రామకృష్ణారావు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అధికారులు రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల స్టెరిలైజేషన్ కార్యక్రమాల వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మేనకా గాంధీకి వివరించారు. గోసంరక్షణ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే విస్తృత ప్రణాళికలు రూపొందించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

**గోశాలల నిర్మాణం**

ఎన్‌కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాలమైన గోశాల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసినట్లు సీఎం వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీపంలో కూడా గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మేనకా గాంధీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జంతు సంరక్షణ చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణలో వీధి కుక్కల నిర్వహణ మరియు గోసంరక్షణలో ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనకా గాంధీ మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో జంతు సంరక్షణను మరింత బలోపేతం చేసేందుకు రెండు వర్గాలు కలిసి పని చేయాలని అంగీకరించారు.

## మైనింగ్‌లో అక్రమాలు జరిగివుంటే చర్యలు తప్పవు

విచారణను సీబీఐకు అప్పగించామని.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుపై కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఎందుకు చర్య లు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. శాసనస భలో రేవంత్ మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డు పెట్టుకుని హరీశ్ బంధువులు చేసిన భూ దోపిడీ, అక్రమాలపై హౌస్ కమిటీ వేయడానికి మేం సిద్ధంగా ఉన్నామన్నారు. "బీఆర్ఎస్ కు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని భాజపా నేతలు ఆరోపించారు. సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో విచారణ చేస్తారని చెప్పారు. దీంతో ఈ వ్యవహారాన్ని సీబీఐకి ఇచ్చాం. అయినా చర్యలు లేవు. కేంద్రం చర్యలు తీసుకునేలా సభలో వెంకటరమణారెడ్డి సలహా ఇవ్వాలి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి చెప్పి కాళేశ్వరంపై విచారణ జరిపించలేరా? ఆయనకు చెప్పే ధైర్యం వెంకట రమణారెడ్డికి లేదా? "అని సీఎం ప్రశ్నించారు. మరోవైపు సభలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన కు దిగారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలి పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని ఈ సందర్భంగా నినాదాలు చేశారు.

**వృద్ధ తల్లిదండ్రులకు సర్కార్ అండ**

'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపిం ది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడు తూ... పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తార ని, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రుల్ని పట్టించుకోవ ట్లేదని చెప్పారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చినట్లు సభలో వెల్లడించారు. వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ.10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదు. సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారు. ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావడం బాధాకరం. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలి. తల్లిదండ్రులను చూసుకోలేనివాడు సమాజంలో బతకడానికి వీల్లేదు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. ప్రజా ప్రతినిధులకు కూడా చట్టం వర్తిస్తుంది." అని రేవంత్ అన్నారు.

# జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బిసి పూర్తి

**హైదరాబాద్ మార్చి 29 (జనంసాక్షి) :** ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టును 2028 జూన్ మాసంతానికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సుస్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధం గా ప్రభుత్వం ముందుకు పోతుందని ఆయన తెలిపారు. ఆదివారం రోజున రాష్ట్ర శాసనసభలో జరిగిన నీటిపారుదల శాఖా పై కాంగ్రెస్ కు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,యం.ఐ. యం సభ్యులు బల్లాల తదితరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం ఇస్తూ ఎస్.ఎల్.బి.సి తెలంగాణా ప్రజల చిరకాల స్వప్నమని ఇది పూర్తి అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సమృద్ధిగా సాగునీటి సరఫరాతో పాటు ఫ్లోరోసిస్ రహిత సురక్షితమైన త్రాగు నీటిని అందించవచ్చని ఆయన వివరించారు. అయితే 2025,ఫిబ్రవరిలో దురదృష్టవశాత్తు జరిగిన ఘటనలో కార్మికులు దుర్మరణం పాలు కావడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన అనంతరం ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు గాను అత్యధునాతన సాంకేతిక పద్ధతులతో అంతర్జాతీయ ప్రమాణాల కనుగుణంగా పునరుద్ధరణ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అంతకు ముందు జరిగిన ఘటన పునరావృతం కాకుండా శాస్త్రీయ పద్ధతిలో పర్యవేక్షణతో పాటు భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు పరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

గడిచిన బి.ఆర్.ఎస్ పాలనలో నీటిపారుదల రంగంమీద 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఫలితం సాధించ లేక పోయారని ఆయన విమర్శించారు. అందులో పెద్దఎత్తున నిధులు వెచ్చించి కాళేస్వరం ప్రాజెక్టును నిర్మించినా అది కూలిపోయిన విషయం సభకు విదితమే నన్నారు. వారి పాలన లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసినా కొత్తగా ఎకరాకు సాగు నీరు అందించలేక పోయారని ఆయన ఎద్దేవా చేశారు. నాటి బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ప్రత్యేకించి కొత్తగా రెండు కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి అధిక వడ్డీతో 97,000 వేల కోట్లు స్వల్పకాలిక ఋణాలు తీసుకున్నారని ఆయన చెప్పారు. దీని వల్ల ప్రస్తుత ప్రభుత్వం మీద 54 వేల కోట్ల మూలధనం,27 వేల కోట్ల వడ్డీతో కలుపుకొని 82,000 వేల కోట్ల భారం పడిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 41,000 కోట్ల మూలధనంతో పాటు 16,000 వేల కోట్ల వడ్డీ మొత్తాలను చెల్లించి నట్లు ఆయన సభకు వివరించారు. అంతే గాకుండా బి.ఆర్.ఎస్ పాలనలో చేసిన స్వల్ప కాలిక రుణాలను దీర్ఘకాలిక ఋణలుగా మార్చి ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

**గత పాలకుల నిర్లక్ష్యంతోనే పెండింగ్ ప్రాజెక్టులు**

పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరగడానికి గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోటే అని తెలంగాణ ప్రజలు ఈ గణాంకాలను గుర్తించాలని ఆయన కోరారు. కృష్ణా బేసిన్ మీద ఉన్న ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్ లో ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని అందుకు అవసరమైన భూసేకరణకోసం ప్రభుత్వం 5,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజిని మంజూరు చేసిందని ఆయన సభకు వివరించారు.జూన్,2026 నాటికి ఈ నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. గడిచిన ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకంపై 5000 కోట్లు ఖర్చు చేసి కుడా ప్రయోజనం లేకుండా పోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18,000 కొట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను ప్రారంభించిందని ఆయన తెలిపారు. డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని,దీనిని పూర్ట్ చేసి పాత నల్గొండ జిల్లాలోని మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు రోజుకు 0.5 టి.యం.సి ల చొప్పున 60 రోజులకు 30 టి.యం.సి ల నీరు అందించ నున్నట్లు ఆయన వివరించారు.

**గ్యాస్ విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ**

అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో గ్యాస్ మీద పడిన ప్రభావంపై ఆయన స్పందిస్తూ గృహ వినియోగదారులకు గ్యాస్ కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు. అయితే వాణిజ్యపరంగా గ్యాస్ కొరత ఉందని అయితే రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి తీసుకున్న చర్యలతో 20 శాతానికి పడిపోయిన వాణిజ్య గ్యాస్ 40 శాతానికి చేరుకుందన్నారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరణకు అటు కేంద్ర ప్రభుత్వం ఇటు ఆయిల్ కంపెనీలు వ్రాత పూర్వకంగా హామీ ఇచ్చారని ఆయన సభకు తెలిపారు. గ్యాస్ సరఫరా విషయంలో తాను స్వయంగా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభకు వివరించారు.

# రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

- "సీఎం తమ్ముడు, బావమరిదిపై అవినీతి ఆరోపణలు
- సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణకు సిద్ధమా?"
- "పొంగులేటి కంపెనీ అవినీతికి సీఎం బాధ్యుడు" : హరీశ్ రావు
- "నా బావమరిది, తమ్ముడిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధం.. సీఎం సిద్ధమా?"




**హైదరాబాద్, మార్చి 29 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తీవ్ర సవాల్ విసిరారు."నా బావమరిది, తమ్ముడిపై సీఎం ఆరోపణలు చేశారు. సీఎం తమ్ముడు, బావమరిదిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నా బావమరిది, తమ్ముడిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు నేను సిద్ధం. సీఎం తమ్ముడు, బావమరిదిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు.హరీశ్ రావు మరింత మాట్లాడుతూ, "హౌసింగ్ కమిటీ కాదు.. సీబీసీఐడీ కాదు.. సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ చేయిద్దాం. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు నేను సిద్ధం. సీఎం సిద్ధమా?" అని సవాల్ విసిరారు.

పొంగులేటి అవినీతిపై తీవ్ర ఆరోపణలు

పొంగులేటిని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి వంద అబద్ధాలు ఆడి దొరికిపోయారని హరీశ్ రావు ఆరోపించారు. "ఏ పని కోసం నేనెప్పుడూ పొంగులేటికి ఫోన్ చేయలేదు. పొంగులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని అందరికీ అర్థమైంది. తప్పు జరిగిందని సీఎం, మంత్రి అసెంబ్లీలోనే ఒప్పుకొన్నారు" అని తెలిపారు "సీఎం, పొంగులేటి మధ్య లావాదేవీలు ఉంటాయి. వాళ్లు భూములను చెరిసగం పంచుకుంటారు. సభా సంఘం వేస్తే అన్నీ బయటకు వస్తాయని భయపడుతున్నారు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చి బేరం కుదిరితే తొలగిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇంకా ఈ సవాల్‌కు స్పందించలేదు.

# మెట్రో టేకోవర్..

**హైదరాబాద్ మార్చి 29 (జనంసాక్షి) :** మెట్రో టేకోవర్‌పై అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి సిగ్గులేకుండా తప్పుడు లెక్కలు చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. ఎల్అండ్‌టీ అనే ప్రైవేటు కంపెనీకి ఉన్న రూ.15 వేల కోట్ల అప్పును తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని అన్నారు. మంత్రి అక్రమ మైనింగ్ కంపెనీపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన తెలిపారు. ఈ నిరసనలో కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 280 ఎకరాల ప్రభుత్వ భూమిని గత వైఎస్ఆర్ ప్రభుత్వం మెట్రోకు కేవలం లీజుకు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఎల్అండ్‌టీ వద్ద ఉన్న భూములు కొన్నామని రేవంత్ చెబుతున్నారని పేర్కొన్నారు. అవి ఎల్అండ్‌టీకి లీజుకు ఇచ్చిన భూములే.. తప్ప వారికి అమ్మలేదని తెలిపారు. ఆ భూములు ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. లీజుకు ఇచ్చిన భూములు కొనేశామని రేవంత్ గప్పాలు చెబుతున్నారని మండిపడ్డారు. 280 ఎకరాలు కాజేయాలని దండుపాళ్యం బ్యాచ్ చూస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. మెట్రో ఎల్అండ్‌టీ వద్ద ఉంటే కేంద్రం ఎందుకు అభ్యంతరం చెబుతుందని ప్రశ్నించారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం ఫండింగ్ ఎందుకు ఇచ్చిందని అడిగారు. దీనిపై ముఖ్యమంత్రి కాకమ్మ కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. మెట్రో ప్రాజెక్టుపై ప్రకటన కాంగ్రెస్ సర్కార్ తప్పుడు నిర్ణయమని కేటీఆర్ అన్నారు.

# ముదిరిన పశ్చిమాసియా యుద్ధమేఘాలు




**ఇస్లామాబాద్ మార్చి 29 (జనంసాక్షి) :**

మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. ఇటు ఇరాన్.. అటు అమెరికా, ఇజ్రాయేల్ ఎవరికీ వారు తగ్గేది లేదంటూ రెచ్చిపోతున్నాయి. దీంతో ఏ క్షణంలో ఏమవుతుందో అనే భయంతో ప్రపంచ దేశాలు బిక్కు, బిక్కు మంటున్నాయి. యుద్ధాన్ని ఆపగలిగే ఏ అవకాశమైనా ఉంటుందా? అనే వెతుకులాటలో పడ్డాయి. కానీ, రెండు పక్షాల మధ్య రాజీకోసం ఎవరు ప్రయత్నిస్తారు అనే పెద్ద ప్రశ్న. దానికి సమాధానం అన్నట్టు కొన్నిరోజులుగా పాకిస్తాన్ తాను యుద్ధంలో రాజీకి ప్రయత్నిస్తున్నా ను అంటూ చెబుతుండటం ఆసక్తి కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో గల్ఫ్ ఉద్రిక్తతలను చల్లార్చే దిశగా పాక్ వేదికగా ఆదివారం సౌదీ అరేబియా, తుర్కియే, ఈజిప్ట్ దేశాల మంత్రులు చర్చలు ప్రారంభించారు. ఈజిప్ట్ విదేశాంగ శాఖ మంత్రి బదర్ అబ్దెలాటీ పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్‌తో ఆదివారం ఇస్లామాబాద్‌లో సమావేశమయ్యారు. త్వరలో ఆయన తుర్కియే విదేశాంగ శాఖ మంత్రి హకాన్ ఫిడాన్, సౌదీ విదేశాంగ శాఖ మంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్‌తో కూడా సమావేశమయ్యారు. ఈ చర్చల పురోగతిపై ఆయన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో కూడా చర్చించారు.

గల్ఫ్ ఉద్రిక్తతలకు తెరదించే దిశగా తాను మధ్యవర్తిత్వం నెరపుతానని పాక్ పేర్కొన్న విషయం తెలిసిందే. తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడితో తాను విస్తృత స్థాయిలో చర్చించానని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవలే విలేకరులకు తెలిపారు. మరోవైపు, అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి. తాజాగా ఇరాన్ మద్దతుదారులైన హౌతీలు (యెమన్) కూడా రంగంలోకి దిగడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారింది. బాబ్-ఎల్-మండేబ్ జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలను హౌతీలు టార్గెట్ చేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మరింత దిగజారుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇక గల్ఫ్‌కు 3,500 మంది అమెరికన్ సైనికులను తరలించామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్న విషయం తెలిసిందే. హోర్ముజ్ జలసంధి మీదుగా సరకు రవాణా నౌకల రాకపోకలను ఇరాన్ అడ్డుకోవడంతో ఇప్పటికే చమురు ధరలు పెరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒడిదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్య యుద్ధానికి దౌత్యపరమైన పరిష్కారం కనుగొనేందుకు పాకిస్థాన్ ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది.

ముదిరిన పశ్చిమాసియా యుద్ధమేఘాలు
ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో కూడా చర్చించారు.

గల్ఫ్ ఉద్రిక్తతలకు తెరదించే దిశగా తాను మధ్యవర్తిత్వం నెరపుతానని పాక్ పేర్కొన్న విషయం తెలిసిందే. తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడితో తాను విస్తృత స్థాయిలో చర్చించానని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవలే విలేకరులకు తెలిపారు. మరోవైపు, అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి. తాజాగా ఇరాన్ మద్దతుదారులైన హౌతీలు (యెమన్) కూడా రంగంలోకి దిగడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారింది.

బాబ్-ఎల్-మండేబ్ జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలను హౌతీలు టార్గెట్ చేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి మరింత దిగజారుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇక గల్ఫ్‌కు 3,500 మంది అమెరికన్ సైనికులను తరలించామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్న విషయం తెలిసిందే. హోర్ముజ్ జలసంధి మీదుగా సరకు రవాణా నౌకల రాకపోకలను ఇరాన్ అడ్డుకోవడంతో ఇప్పటికే చమురు ధరలు పెరిగి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒడిదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో మధ్యప్రాచ్య యుద్ధానికి దౌత్యపరమైన పరిష్కారం కనుగొనేందుకు పాకిస్థాన్ ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది.

# మంత్రి వివేక్ రాజీనామా చేయాలి



- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**రామకృష్ణాపూర్, మార్చి29 (జనంసాక్షి) :** చెన్నూరు నియోజకవర్గంలో గురుకుల విద్యా సంస్థలను పట్టించుకోని మంత్రి వివేక్ రాజీనామా చేయాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మెన్ ఎన్నిక నేపథ్యంలో జరిగిన సంఘటనలపై అరెస్ట్ అయ్యి షరతులతో కూడిన బెయిల్ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆదివారం హాజరైన బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. చెన్నూరు గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న శ్రీహిందూ ఆత్మహత్యపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయని వివేక్ మంత్రి పదవికి అనర్హుడని మండిపడ్డారు. క్యాతనపల్లిలో ఛైర్మెన్ ఎన్నిక జరగకుండా చేసిన మంత్రి, కోర్టు ఉత్తర్వుల ప్రకారం వెంటనే ఎన్నిక సజావుగా జరిగేలా చూసే బాధ్యత మంత్రిదేనని అన్నారు. ఇప్పటికైన చెన్నూరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. అంతకు ముందు రామాలయంలో సీతారాములను దర్శించుకున్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచి ఎన్నో అభివృద్ధి పనులు చేయాలని ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సుమన్ ను ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నాయకులు మూల రాజిరెడ్డి, కంబగోని సుదర్శన్ గౌడ్, రామిడి కుమార్, మాజీ కౌన్సిలర్లు, యువ నాయకులు ఉన్నారు.

# కేటీఆర్, రేవంత్ రెడ్డి మధ్య డీల్ కుదిరింది

## అందుకే కేటీఆర్ అవినీతి కేసుల జోలికే పోవడం లేదు

- కవితతో కేటీఆర్ సంధికి ప్రయత్నిస్తున్నారు
- హరీష్ ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. అందుకే కేటీఆర్ పైనున్న అవినీతి కేసుల జోలికి పోవడం లేదని చెప్పారు. కల్వకుంట్ల కవిత, కేటీఆర్ సయోధ్య కుదుర్చేందుకు రేవంత్ రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నరని తెలిపారు. కేవలం హరీష్ రావును మాత్రమే టార్గెట్ చేస్తూ కాళేశ్వరంలోని కొంత భాగం అవినీతిపై మాత్రమే మాట్లాడు తున్నారని చెప్పారు. కాళేశ్వరంలో జరిగిన రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరిపితే మొత్తం బండారం బయపటప డుతుందనే భయంతోనే అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ అవినీతిపైనే విచారణకు పరిమితం అయ్యారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయా నికి విచ్చసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కాళేశ్వరం అంశంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. 'కేసీఆర్ పై ఉన్న కోపం కూడా రేవంత్ కు పోయింది. ఇద్దరి మధ్య డీల్ కుదిరింది. అందుకే హరీష్ ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారే తప్ప కేటీఆర్ గురించి మాట్లాడటం లేదు. అందుకే హరీష్ రావు ఆలోచించుకోవాలి. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటా? కాదా? తేల్చుకోవాలి. కాళేశ్వరంపై మాత్రమే సీబీఐ విచారణ జరపాలని రేవంత్ రెడ్డి కోరుతున్నారు. మరి మిగితా అవినీతి కేసుల పరిస్థితి ఏంది? పోనీ కాళేశ్వరంపై విచారణ జరపాలని భావిస్తే... లక్ష కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగిందని రేవంత్ రెడ్డే చెప్పారు కదా? మరి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డకు సంబంధించి రూ.9 వేల కోట్ల అవినీతిపైనే సీబీఐ విచారణ జరపాలని ఎందుకు పట్టుపడుతున్నట్లు? అందులోనే హరీష్ పాత్ర ఉన్నట్లు రేవంత్ రెడ్డి భావిస్తున్నడు. అందుకే వాటికే పరిమితం చేస్తున్నారే తప్ప లక్ష కోట్ల అవినీతిపై విచారణ చేయిస్తే కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని భావించే నోరు మెదపడం లేదు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ నామ్ కే వాస్తే సీఎం. పాలన అంతా కేటీఆర్ దే కదా? ఆనాడు రేవంత్ రెడ్డిని జైలుకు పంపించిన సంగతి మర్చిపోయిండు. ఆ పౌరుషం, రోషం కూడా పోయింది. ఎందుకంటే ఇద్దరి మధ్య డీల్ కుదిరింది. ఇకపై కేసీఆర్, కేటీఆర్ ల అవినీతిపై విచారణ జరిపే అవకాశమే లేదు.' అన్నారు.

# లక్ష్మయ్యది ఆదర్శప్రాయమైన వృత్తి జీవితం

- తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్
- పదవీ విరమణ చేస్తున్న కాచీగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.లక్ష్మయ్యకు సత్కారం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** లక్ష్మయ్యది ఆదర్శప్రాయమైన వృత్తి జీవితమని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్ అన్నారు. వృత్తిపరమైన స్నేహభావానికి, గౌరవానికి ప్రతీకగా, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బొమ్మరబోయిన లక్ష్మయ్య పదవీ విరమణ సందర్భంగా తన కుటుంబంవారు నిర్వయించిన సత్కార కార్యక్రమంలో టీజీఓఏ హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.బి. కృష్ణ యాదవ్, లక్ష్మయ్య ఆదర్శప్రాయమైన వృత్తి జీవితాన్ని, రాష్ట్రంలోని శారీరక విద్యా రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దశాబ్దాల పాటు శ్రీ లక్ష్మయ్య చేసిన సేవకు సంఘం ప్రశంసకు చిహ్నంగా ఆయనకు ఒక సాంప్రదాయ శాలువా, జ్ఞాపికను బహూకరించారు. తన ముఖ్య ప్రసంగంలో ఎం.బి. యువతను తీర్చిదిద్దడంలో ఫిజికల్ డైరెక్టర్లు పోషించే కీలక పాత్రను కృష్ణ యాదవ్ ప్రముఖంగా ప్రస్తావించారు. 'లక్ష్మయ్య అంకితభావంతో పనిచేసిన సభ్యుడు. కాచీగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల పట్ల ఆయనకున్న నిబద్ధత, టీజీఓఏలో ఆయన పోషించిన చురుకైన పాత్ర ప్రశంసనీయం. క్రమశిక్షణ గురించి, క్రీడాస్ఫూర్తి, నిజాయితీ వైపు విద్యార్థులను ప్రేరేపించగల ఆయన సామర్థ్యం గురించి, క్రీడా విభాగం అనేక మంది ప్రముఖ క్రీడాకారులను తయారుచేసి కొత్త శిఖరాలను చేరుకుందని ఆయన ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన పదవీ విరమణ జీవితాన్ని గడపాలని మేము ఆకాంక్షిస్తున్నాం' అని యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శివకుమార్, టీజీవో హైద్రాబాద్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, జాయింట్ సెక్రటరీ డాక్టర్ క్రొత్త విద్యాసాగర్, శ్రీనివాస్, నర్సింహ, అధ్యాపక అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత చెల్లితో సంబంధం

- బావమరిదిని హత్య చేసిన బావ

**బెంగళూరు (జనంసాక్షి) :** భార్య సోదరుడైన బావమరిది పెళ్లైన తన చెల్లితో సంబంధం పెట్టుకోవడంపై బావ ఆగ్రహించాడు. ఈ నేపథ్యంలో అతడ్ని హత్య చేశాడు. ఆ తర్వాత కారులో మృతదేహాన్ని ఉంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి లొంగిపోయాడు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బైరప్పనహళ్లి ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల శ్రీనివాస్, డాగ్ కెన్నెల్ నిర్వహిస్తున్నాడు. భార్య తమ్ముడైన 24 ఏళ్ల రంజిత్, పెళ్లైన తన చెల్లితో వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్లు శ్రీనివాస్ తెలుసుకున్నాడు. ఈ నేపథ్యంలో వారి కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. మార్చి 26న ఈ వివాదంపై మాట్లాడేందుకు బావమరిది రంజిత్‌ను బావ శ్రీనివాస్ పిలిచాడు. బన్నెరఘట్ట సమీపంలోని ఒక ప్రాంతానికి కారులో తీసుకెళ్లాడు. మాటల సందర్భంగా ఆగ్రహించిన శ్రీనివాస్ ఐరాన్ రాడ్‌తో రంజిత్ తలపై కొట్టి హత్య చేశాడు. మరోవైపు శ్రీనివాస్ ఆ తర్వాత బావమరిది రంజిత్ మృతదేహాన్ని కారులో ఉంచాడు. నేరుగా బన్నెరఘట్ట పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి లొంగిపోయాడు. దీంతో పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# జాతరలు బీసీల సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకలు



**తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్**

- ఏప్రిల్ 19న బీసీ జన జాగరణ జాతర పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలకు సమాంతరంగా సాంస్కృతిక ఉద్యమాలు కూడా పెద్ద ఎత్తున జరగవలసి ఉందని బహుజన ఉద్యమ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. బీసీల సాంస్కృతిక సామాజిక ఉద్యమమే ధ్యేయంగా నిర్వహించే బీసీ జన జాగరణ జాతర బీసీల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తాయని చెప్పారు. ఏప్రిల్ 19న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించనున్న బీసీ జన జాగరణ జాగృతి పోస్టర్ ను ఆదివారం నాడు మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు తో కలిసి జూలూరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలలో ఐక్యతను సాధించటానికి, కుల చైతన్యాన్ని బిసి సామాజిక ఉద్యమ చైతన్యంగా మార్చడానికి బీసీ జాతరలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. జాతరలన్నీ ఉత్పత్తి కులాల ప్రతీకలేనని చెప్పారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కావాలని ఉద్యమాలు ఎగుస్తున్న ఈ తరుణంలో జరిగే బీసీల అలా య్ - బలాయ్ సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేస్తాయని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా ఇలాంటి జాతరలు జరగడం ఆహ్వానించదగిం దన్నారు. ఆటోవాలా నుంచి ఐఏఎస్ దాకా, బిఆర్ఎస్ నుంచి బిజెపి దాకా, కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల దాకా, లెఫ్టిస్టు రైటిస్టులతో పాటుగా అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక ధార్మిక సంఘాలలోనున్న బీసీలంతా ఒక్కచోట జమ కావడం బీసీల ఐకమత్యానికి ప్రతీక గా నిలుస్తుంది అన్నారు. గంగా జమున తహజీబ్ సంస్కృతిని మరింతగా ప్రతిష్టించడానికి ఈ బీసీ జాతరలు ఎంతో దోహదం చేస్తాయని గౌరీ శంకర్ తెలిపారు. మన ఆలోచన సాధన సమితి( మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు మాట్లాడుతూ బీసీ జన జాగరణ జాతరను విజయవంతం చేసేందుకు అన్ని రంగాల్లోని బీసీలందరినీ కుటుంబాలతో సహా కదలి రావాలని కోరారు. మనిషిని మనిషి ప్రేమించే తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బిసి జన జాగరణ జాతరను నిలబెడతా మన్నారు. సబ్బండ కులాల ఐక్యతకు నిదర్శనంగా రాజకీయాలకు అతీతంగా వేలాదిమంది బీసీలు ఈ జాతరలో కలుస్తారని చెప్పారు. లక్షమంది బీసీలకు సోషల్ మీడియా ద్వారా బీసీ జాతరకు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్బండ కులాల బీసీల జన జాతరకు రాజకీయాల కతీతంగా కదలి రావాలని కటకం ఆత్మీయంగా కోరారు. ఈ కార్యక్రమంలో మన ఆలోచన సాధన సమితి ఉపాధ్యక్షులు నేరెళ్ల దేవేందర్, ప్రచార కార్యదర్శి పెదపుర బ్రహ్మయ్య రజక ,పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# యుద్ధం వద్దు.. శాంతి ముద్దు

- చార్మినార్ నుంచి భారీ ర్యాలీ
- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను ఖండించిన పౌరహక్కుల నేతలు, వివిధ పార్టీలు





**హైదరాబాద్, మార్చి 29 (జనంసాక్షి) :** అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల పౌరుల మరణాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, అయితే ఇరాన్ ప్రతిస్పందనపై మాత్రమే స్పందించడం ద్వంద్వ వైఖరిని సూచిస్తుందని పౌరహక్కుల నేతలు, వివిధ పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం చార్మినార్ వద్ద జరిగిన ఆల్-పార్టీ నిరసన కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ నిరసన ర్యాలీ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు కొనసాగింది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక దాడులను ఖండిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రతిస్పందనను విమర్శించారు. ర్యాలీ పాతబస్తీ ముఖ్య ప్రాంతాల గుండా సాగి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రజా సమావేశంతో ముగిసింది. అక్కడ ప్రసంగించిన నాయకులు కొనసాగుతున్న సంఘర్షణ, దాని ప్రభావాలపై మాట్లాడారు. అమెరికా మరియు ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ దాడుల వల్ల భారీగా పౌరులు మరణించారని, అందులో 100 మందికి పైగా పాఠశాల పిల్లలు కూడా ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. ఇది శక్తివంతమైన దేశాలు పాల్గొంటున్న ప్రమాదకర ఉద్రిక్తతగా ఆయన పేర్కొని, ప్రపంచ శాంతి మరియు స్థిరత్వంపై దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. 'విశ్వ గురు' కావాలని ఆశించే దేశం అంతర్జాతీయ విషయాల్లో న్యాయపరమైన, స్వతంత్ర దృక్పథాన్ని అవలంబించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హింస, అన్యాయాలపై మౌనం పాటించడం కాకుండా భారత్ గళం ఎత్తాలని ఆయన పేర్కొన్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల సమస్యలను ప్రస్తావిస్తూ, గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక కోటి మందికి పైగా భారతీయులు ఈ పరిస్థితుల వల్ల ప్రభావితమయ్యే అవకాశముందని తెలిపారు. వారు ప్రతి సంవత్సరం సుమారు 4 బిలియన్ అమెరికన్ డాలర్లు భారత్‌కు పంపుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా దోహదం చేస్తున్నారని, వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## వీరశైవ లింగాయత్ సమాజం సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**సంగారెడ్డి (జనంసాక్షి) :** వీరశైవ లింగాయత్ సమాజం సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లిలో ఆదివారం నిర్వహించిన వీరశైవ లింగాయత్ సమాజ సమావేశానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ సమాజ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా బసవ భవనం నిర్మాణానికి సంబంధించి మరో ఎంపీ సురేష్ షెట్కార్‌తో కలిసి సహకారం అందిస్తానని తెలిపారు. సమాజ ఐక్యతే అభివృద్ధికి మూలమని పేర్కొంటూ, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శైవ సంప్రదాయాలకు ప్రతీక అయిన బసవేశ్వరుడు చూపిన మార్గంలో నడవాలని సూచించారు.

# టీజీఎస్ ఆర్టీసీ పర్యవేక్షక పోస్టుల రాత పరీక్షలు ప్రశాంతం

- టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఖాళీగా ఉన్న 198 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీకి సంబంధించి ఆదివారం నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టిఎస్ఎల్ పిఆర్‌బి) చైర్మన్ వీవీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరం మరియు పరిసర ప్రాంతాల్లోని మొత్తం 32 కేంద్రాల్లో ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 25న వెలువడిన నోటిఫికేషన్ మేరకు ఈ రాత పరీక్షలు జరిగాయని, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా అభ్యర్థుల వేలిముద్రలు, డిజిటల్ ఫోటోలతో కూడిన బయోమెట్రిక్ హాజరును సేకరించినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షల హాజరు వివరాలను వెల్లడిస్తూ, ఉదయం సెషన్‌లో 25 కేంద్రాల్లో జరిగిన ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ పరీక్షకు 20,128 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా, వారిలో 15,796 (78.48 శాతం) మంది హాజరయ్యారని శ్రీనివాస రావు తెలిపారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 7 కేంద్రాల్లో జరిగిన మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పరీక్షకు 5,865 మందికి గాను 4,817 (82.13 శాతం) మంది అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ రెండు పేపర్లకు సంబంధించిన ప్రాథమిక కీలను మరికొద్ది రోజుల్లోనే అధికారిక వెబ్‌సైట్ www.tgprb.inలో అందుబాటులో ఉంచుతా మని ఆయన తెలియజేశారు. వెబ్‌సైట్‌లోని అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్ ఏరియాలో కల్పించే వెబ్ టెంప్లేట్ ద్వారా, ప్రాథమిక కీలోని ఒక్కో ప్రశ్నపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో అభ్యర్థులు వ్యక్తిగతంగా సమర్పించవచ్చని సూచించారు. వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను ప్రాథమిక కీ విడుదల సమయంలో అభ్యర్థులకు తెలియజేస్తామని వివరించారు.

# రాజస్తాన్‌తో సింగరేణి విద్యుత్ ఒప్పందంపై 'శ్వేతపత్రం' విడుదల చేయాలి

- రూ. 27 లక్షల టర్నోవర్ ఉన్న అల్ట్ మిన్ సంస్థలో రూ.2,250 కోట్ల పెట్టుబడులా?
- ఈ రెండు ఒప్పందాలతో సింగరేణి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారు.
- వెంటనే ఈ ఒప్పందాల వివరాలు వెల్లడించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- సింగరేణి జాగృతి నాయకుడు సిద్ధంశెట్టి సాజన్




**పెద్దపల్లి (జనంసాక్షి) :** రాజస్థాన్ తో విద్యుత్ ఒప్పందం, అల్ట్ మిన్ సంస్థలో పెట్టుబడుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల శ్రమను దోచుకుంటుందని సింగరేణి జాగృతి నాయకుడు సిద్ధంశెట్టి సాజన్ పలు ఆందోళక వ్యక్తం చేశారు. హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి ఆదివారం రామగుండం హెచ్ఎంఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాజస్థాన్ తో సింగరేణి సంస్థ రూ.16 వేల కోట్లతో కుదుర్చుకున్న ఒప్పందంలో చాలా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఒప్పందంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నష్టాల్లో ఉన్నరాజస్థాన్ జెన్ కో, ట్రాన్స్ కో లకే విద్యుత్ సరఫరా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. రాజస్థాన్ జెన్ కో, ట్రాన్స్ కో లు అప్పులు చెల్లించలేని స్థితిలో ఉంటే ఏంటీ పరిస్థితి అని ప్రశ్నించారు. రూ.16 వేల కోట్ల ఒప్పందంలో రాజస్థాన్ ప్రభుత్వం వాటా, సింగరేణి వాటా ఎంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఒప్పందంలో భాగంగా రాజస్థాన్ జెన్ కో, ట్రాన్స్ కో సంస్థలు సక్రమంగా చెల్లింపులు జరుపుతాయని గ్యారంటీ ఏంటనీ ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే లక్ష 15 వేల కోట్ల నష్టాల్లో ఉన్న ఆ సంస్థలు ఒక వేళ డబ్బులు చెల్లించకపోతే ఎలా అని అడిగారు. సింగరేణికి రావాల్సిన నిధుల భద్రత కోసం ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేశారా? అని నిలదీశారు. విద్యుత్‌ను సరఫరా చేసే క్రమంలో అయ్యే వీలింగ్ చార్జీల భారం ఎవరు భరిస్తారు? సుదూర ప్రాంతాలకు విద్యుత్ చేరవేసేటప్పుడు జరిగే ట్రాన్స్‌మిషన్ నష్టాలు ఎవరు భరిస్తారో చెప్పాలన్నారు. ఒకవేళ రాజస్థాన్ ట్రాన్స్‌కో (ఆర్వీపీఎన్ఎల్), జెన్‌కో సంస్థలు బకాయిలు చెల్లించకపోతే, సింగరేణి కార్మికుల ప్రయోజనాలకు భంగం కలగదా? అని ప్రశ్నించారు. ఈ మొత్తం ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

### 27 లక్షల అల్ట్ మిన్ సంస్థలో ?2,250 కోట్ల పెట్టుబడా?

27 లక్షల అల్ట్ మిన్ అనే సంస్థలో 2,250 కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇంత చిన్న సంస్థలో ఇన్ని వేల కోట్లు ఎలా పెట్టుబడులు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని దీని వెనుక ఉన్న వారి పేర్లను బయట పెట్టాలని కోరారు. లిథియం బ్యాటరీల టెక్నాలజీ కనుమరుగు అవుతున్న ఈ దశలో లిథియం బ్యాటరీల తయారీ పేరుతో ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులు ఎందుకు పెడుతున్నారో చెప్పాలన్నారు. సింగరేణి లో 15 వేల మంది కొత్త ఉద్యోగులను తీసుకుంటే భారీగా భారం పడిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని...కానీ ఇలా ఊరు, పేరు లేని కంపెనీల్లో వేల కోట్లు పెట్టుబడులు పెట్టటం సంస్థ ప్రయోజనాలను పెద్ద తీయటం కాదా అని సాజన్ ప్రశ్నించారు.

### పెద్ద ఎత్తున ఉద్యమం

ఈ రెండు ఒప్పందాలకు సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వం బయట పెట్టాలని సాజన్ కోరారు. లేదంటే ఈ అంశంపై జాగృతి, హెచ్ఎంఎస్ కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ప్రతి సింగరేణి కార్మికుడికి ఈ ఒప్పందాలతో జరిగే నష్టాన్ని వివరిస్తామని ఆయన చెప్పారు. సింగరేణి కార్మికుల చెమట, కష్టాన్ని ఇలా అక్రమాలకు వాడుకుంటమంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. మీడియా సమావేశంలో హెచ్ఎంఎస్ నాయకులు పార్వతీ రాజిరెడ్డి, భువన చంద్ర, నవీన్, కార్తీక్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రవణ్ పాల్గొన్నారు.

## వంట గ్యాస్ కష్టాలకు తోడు

# సైబర్ మోసాలు

సాధారణంగా ప్రజలు ఏదైనా వస్తువు కొరతతో ఇబ్బంది పడుతున్నప్పుడు, ఆ అవసరాన్ని ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకోవడం నైతిక నేరం. కానీ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆ ఇబ్బందిని పెట్టుబడిగా మార్చుకుని నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు సైబర్ ముఠాలు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వంట గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక లోపాలు, సరఫరాలో జాప్యం సామాన్యుడికి శాపంగా మారితే, సైబర్ నేరగాళ్లకు అది 'వర ప్రసాదం'లా పరిణమించింది. సందట్లో సడేమియా అన్నట్లుగా, గ్యాస్ కోసం ఎదురుచూస్తున్న అమాయక ప్రజల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తూ కొత్త తరహా మోసాలకు తెరలేపారు.




గత కొద్ది రోజులుగా ఎల్‌పీజీ (LPG) వినియోగదారులు గృహావసరాల సిలిండర్ బుకింగ్ కోసం నానా అవస్థలు పడుతున్నారు. అధికారిక నంబర్లు పని చేయకపోవడం, కాల్ చేస్తే మధ్యలోనే కట్ కావడం వంటి సమస్యలు వెలుగు చూస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయాన్ని సైబర్ నేరగాళ్లు ఎంచుకున్నారు. "మీ గ్యాస్ కేవైసీ (KYC) గడువు ముగిసింది", "వెంటనే అప్‌డేట్ చేయకపోతే కనెక్షన్ కట్ అవుతుంది", లేదా "అత్యవసరంగా గ్యాస్ సిలిండర్ కావాలా? ఈ లింక్ క్లిక్ చేయండి" అంటూ మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపుతున్నారు. కష్టాల్లో ఉన్న సామాన్యుడు, గ్యాస్ రాదేమో అన్న ఆందోళనతో ఆ ఉచ్చులో చిక్కుకుంటున్నాడు.

సైబర్ నేరగాళ్లు ఈ మధ్య కాలంలో ఉపయోగిస్తున్న ప్రధాన ఆయుధం 'మాలిషియస్ ఏపీకే ఫైల్స్'. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా పంపే ఈ చిన్న ఫైళ్లను యాప్ అనుకుని మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయడమే మనం చేసే అతిపెద్ద తప్పు. ఒకసారి ఈ యాప్ ఫోన్‌లోకి ప్రవేశించిందంటే, మీ మొబైల్ నియంత్రణ మొత్తం అవతలి వ్యక్తి చేతుల్లోకి వెళ్తుంది.

మీ కాంటాక్ట్స్, మెసేజ్‌లు, గ్యాలరీ సమాచారం వారికి చేరిపోతుంది. బ్యాంక్ నుంచి వచ్చే అత్యంత రహస్యమైన ఓటీపీలను (OTP) ఈ యాప్స్ నేరుగా నేరగాళ్లకు పంపిస్తాయి. మీకు తెలియకుండానే మీ ఖాతాలోని సొమ్ము మాయమైపోతుంది.

సోషల్ మీడియా వేదికలపై "తక్షణమే గ్యాస్ డెలివరీ", "అదనపు సిలిండర్ల లభ్యత" అంటూ వచ్చే ప్రకటనలను గుడ్డిగా నమ్మకూడదు. ముఖ్యంగా బుకింగ్‌కు ముందే ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలని కోరితే అది నూటికి నూరు శాతం మోసమని గ్రహించాలి. అధికారిక సంస్థలు ఏవీ కేవైసీ అప్‌డేట్ కోసం ఫోన్లలో లింకులు పంపవు లేదా వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అడగవు. ఈ సైబర్ మాయాజాలం నుండి తప్పించుకోవడానికి భయం కంటే అవగాహన ముఖ్యం. వినియోగదారులు కింది జాగ్రత్తలు తప్పని సరిగా పాటించాలి. అధికారిక వేదికలే శరణ్యం: గ్యాస్ బుకింగ్ లేదా కేవైసీ వివరాల కోసం సంబంధిత కంపెనీల అధికారిక యాప్స్ (ఉదాహరణకు: IndianOil ONE, HP Pay, BPCL SmartLine) లేదా వారి అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే వాడాలి.

సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ బుకింగ్ కాకపోతే, నేరుగా మీకు గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లి సంప్రదించడం ఉత్తమం. మీ గ్యాస్ బిల్లుపై ఏజెన్సీ అడ్రస్, అధికారిక నంబర్లు ఉంటాయి. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను, ముఖ్యంగా 'ఫ్జ' పేరుతో వచ్చే వాటిని క్లిక్ చేయకండి. అపరిచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. గ్యాస్ సిలిండర్ చేతికి అందకముందే తెలియని వ్యక్తులకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయకండి.

దురదృష్టవశాత్తు ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, వారు చేసే మొదటి పని కాలయాపన చేయకుండా ఫిర్యాదు చేయడం. సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును వేరే ఖాతాల్లోకి మళ్లించక ముందే అప్రమత్తమైతే, ఆ సొమ్మును తిరిగి పొందే అవకాశం ఉంటుంది. వెంటనే 1930 అనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.

ఈ సమస్యను మరింత లోతుగా పరిశీలిస్తే, ఇది కేవలం గ్యాస్ సరఫరా లోపం వల్ల కలిగిన ఇబ్బంది మాత్రమే కాదని స్పష్టమవుతుంది. ప్రభుత్వ సేవలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటి వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం పెద్ద లోటుగా మారుతోంది. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు, డిజిటల్ పరిజ్ఞానం తక్కువగా ఉన్నవారు సులభంగా మోసగాళ్ల లక్ష్యంగా మారుతున్నారు.

ఇలాంటి సందర్భాల్లో స్థానిక స్థాయిలో గ్యాస్ ఏజెన్సీలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వినియోగదారులకు సరైన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం అవసరం. ప్రతి వినియోగదారుడికి అధికారిక కమ్యూనికేషన్ మార్గాలను స్పష్టంగా తెలియజేయాలి.

అదే విధంగా మీడియా కూడా ఈ అంశంపై చురుకైన పాత్ర పోషించాలి. కేవలం ఘటనలు నివేదించడం కాకుండా, ప్రజలకు రక్షణ మార్గాలను తెలియజేయడం, మోసాల పద్ధతులను విశ్లేషించడం ద్వారా అవగాహన పెంచాలి. సైబర్ భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత కూడా. అప్రమత్తత, జాగ్రత్త, సమాచారం.. ఈ మూడు ఉంటేనే ఇలాంటి మోసాలను అరికట్టగలం. సాంకేతికత ఎంతగా పెరుగుతుందో, దానిని అడ్డుపెట్టుకుని చేసే నేరాలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం, గ్యాస్ కంపెనీలు తమ బుకింగ్ వ్యవస్థలను పటిష్టం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. అదే సమయంలో, ప్రజలు కూడా అత్యాశకు లేదా అనవసర భయానికి లోనుకాకుండా, విజ్ఞతతో వ్యవహరించినప్పుడే ఈ 'డిజిటల్ దొంగల' ఆట కట్టించగలం.



**సిద్ధగౌని సుదర్శన్**
**సెక్రటరీ, తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్,**
**97017 03684**
**హైదరాబాద్**

# యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ గర్జన

ప్రపంచ వ్యాప్తంగా ట్రంప్, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై చేపట్టిన దాడులు, లింకులు, యుద్ధ చర్యలను ఖండిస్తూ జరుగుతున్న నిరసన ర్యాలీలు ఈ రోజుల్లో ఒక భారీ ఉద్యమంగా మారాయి. ఫిబ్రవరి 28, 2026న అమెరికా-ఇజ్రాయెల్ కూటమి 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్‌పై భారీ ఎయిర్ స్ట్రైక్స్ ప్రారంభించినప్పటి నుంచి ఈ సంఘర్షణ నాలుగు వారాలుగా కొనసాగుతోంది. సుప్రీం లీడర్ అలీ ఖమనేయి సహా ఇరాన్ ఉన్నతాధికారులు చంపబడ్డారు, న్యూక్లియర్, బాలిస్టిక్ మిసైల్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. రెజిమ్ చేంజ్, ఇరాన్ సార్వభౌమత్వాన్ని అతిక్రమించడం అనే లక్ష్యాలతో ఈ యుద్ధం మొదలైంది. కానీ దీని ఫలితం? వందలాది సివిలియన్ల మరణాలు, లక్షలాది నిరాశ్రయులు, పాఠశాలలపై దాడులు, ప్రాంతీయ అస్థిరత. ఇరాన్ ప్రతీకార దాడులు అమెరికా సైనికులను, ఇజ్రాయెల్‌ను కూడా దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలోనే 'నో కింగ్స్' ర్యాలీలు అమెరికా, యూరప్, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల్లో విస్తరించాయి.




మార్చి 28-29, 2026న అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 3,200కి పైగా స్థలాల్లో ఈ ర్యాలీలు జరిగాయి. లక్షలాది నుంచి కోట్ల మంది పాల్గొన్నారని అంచనాలు. మిన్నెసోటా క్యాపిటల్‌లో బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ వంటి సెలబ్రిటీలు పాల్గొని ట్రంప్ విధానాలను తీవ్రంగా విమర్శించారు. న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, వాషింగ్టన్ డీసీలో ప్రజలు 'యుద్ధం కాదు శాంతి', 'ఇంపీరియలిజం డౌన్', 'ట్రంప్ ఇజ్రాయెల్ మొదటి' అని నినాదాలు చేశారు. లండన్‌లో 'స్టాప్ ది ఫార్ రైట్', ప్యారిస్ బాస్టిల్ స్క్వేర్‌లో హండ్రెడ్స్ ఆఫ్ పీపుల్, వెనిజులా ఇరాన్ ఎంబసీ వద్ద, పాకిస్తాన్ పెషావర్, టోక్యోలో కూడా నిరసనలు జరిగాయి. ఇవి కేవలం అమెరికా వ్యతిరేకత కాదు, గ్లోబల్ సౌత్ నుంచి వచ్చిన గొంతులు. చైనా, ఇతర దేశాలు ఈ దాడులను 'అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన'గా ఖండించాయి. యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ చీఫ్ సైతం 'బాంబులు, మిసైల్స్ తేడాలను పరిష్కరించవు, మానవ బాధలు మాత్రమే కలిగిస్తాయి' అని చెప్పారు.

ఈ నిరసనలు ట్రంప్ రెండవ టర్మ్‌లోని అథారిటేరియన్ ధోరణులకు, అనవసర యుద్ధాలకు స్పష్టమైన సవాలు. 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని ట్రంప్ 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మార్చారని విమర్శకులు అంటున్నారు. ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమం, బాలిస్టిక్ మిసైల్స్ ఆందోళన కలిగించేవి నిజమే. కానీ దానికి సమాధానం డిప్లమసీ కాదా? 2025లో జరిగిన న్యూక్లియర్ చర్చలు, ఇరాన్ లోపలి జనవరి నిరసనలు (ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ దమనకాండ) ఉన్నప్పుడు యుద్ధం ఎందుకు? ఇది ఇరాక్ 2003 యుద్ధం లాంటి తప్పు. అప్పుడు 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' అని చెప్పి లక్షలాది మరణాలు, ట్రిలియన్ డాలర్ల నష్టం, ఐఎస్ లాంటి ఉగ్రవాదం పుట్టింది. ఇప్పుడు కూడా అదే నమూనా. ఇరాన్ ఆర్థికం ఇప్పటికే దెబ్బతిన్న స్థితిలో ఉంది, ప్రజలు రెజిమ్‌కు వ్యతిరేకంగా ఉద్యమించారు. కానీ బాంబులు వేసి రెజిమ్ చేంజ్ లక్ష్యం సాధించలేదు. బదులుగా ఇరాన్ ప్రజల్లో నేషనలిజం పెరిగింది, ప్రభుత్వ మద్దతు ర్యాలీలు జరిగాయి.

విశ్లేషణాత్మకంగా చూస్తే ఈ యుద్ధం అమెరికా ఆర్థిక, రాజకీయ హితాలకు వ్యతిరేకం. ఆయిల్ ధరలు పెరిగి గ్లోబల్ ఇన్‌ఫ్లేషన్ పెరిగింది. మిడిల్ ఈస్ట్ అస్థిరత హౌతీలు, హెజ్బొల్లా వంటి గ్రూపులను మరింత ఉగ్రంగా చేసింది. ట్రంప్ పాలసీలు డొమెస్టిక్ సమస్యలను విస్మరించాయి - ఇమ్మిగ్రేషన్, ఆర్థిక అసమానతలు, ట్రాన్స్‌జెండర్ హక్కులు. 'నో కింగ్స్' ఉద్యమం గత ఏడాదిలోనే మూడుసార్లు జరిగి మిలియన్లను ఒక్కటి చేసింది. ఇది అమెరికా ప్రజాస్వామ్యం ఇంకా సజీవంగా ఉందని చూపిస్తోంది. ట్రంప్ అధికారాన్ని 'కింగ్'లా ఉపయోగించుకోవడం వ్యతిరేకంగా ప్రజలు 'నో కింగ్స్' అని అరుస్తున్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి చేసిన ఈ చర్యలు అమెరికాను 'ఇంపీరియల్ పవర్'గా చూపిస్తున్నాయి. గ్లోబల్ సౌత్ దేశాలు దీన్ని 'డబుల్ స్టాండర్డ్'గా విమర్శిస్తున్నాయి -- ఇరాన్ హక్కుల ఉల్లంఘనలను ఖండించాలి, కానీ దానికి బదులు బాంబులు వేయడం సరికాదు.

ఈ నిరసనలు మానవత్వానికి గొప్ప సందేశం. యుద్ధం ఎప్పుడూ సమస్యలను పరిష్కరించదు. ఇరాన్ లోపలి జనవరి నిరసనల్లో లక్షలాది మంది చనిపోయారు అని రిపోర్టులు. ఇప్పుడు బాహ్య దాడులు మరిన్ని మరణాలు తెచ్చాయి. ఇది హ్యూమన్ రైట్స్ వ్యతిరేకం. ట్రంప్ ప్రభుత్వం 'సెల్ఫ్ డిఫెన్స్' అని చెప్పినా, ఇది ప్రీ-ఎంటివ్ అటాక్. అంతర్జాతీయ చట్టాలు, యుఎన్ చార్టర్ ఉల్లంఘన. ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఆందోళనలు నిజమే, కానీ దానికి ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేయడం సరైన మార్గం కాదు. ఇది రీజినల్ యుద్ధాన్ని ప్రేరేపిస్తుంది, గల్ఫ్ దేశాలు, యూరప్ ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుంది.

చివరగా, ఈ ర్యాలీలు ప్రపంచానికి ఒక హెచ్చరిక. యుద్ధం ద్వారా రెజిమ్ చేంజ్ సాధ్యం కాదు, అది ఎప్పుడూ బ్యాక్‌ఫైర్ అవుతుంది. డిప్లమసీ, చర్చల ద్వారా మాత్రమే శాంతి సాధ్యం. ట్రంప్ ప్రభుత్వం ఇంకా సమయం ఉండగా మార్గం మార్చుకోవాలి. ప్రజల గొంతు, నిరసనలు ఇలాంటి అనవసర యుద్ధాలను ఆపగలవు. ఇది కేవలం ఇరాన్ సమస్య కాదు, ప్రపంచ శాంతి, మానవత్వం సమస్య. ఈ ఉద్యమం కొనసాగాలి, యుద్ధాలు ముగియాలి. శాంతి మార్గం మాత్రమే ఏకైక మార్గం.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## కళాశిల్పం

**వేలాది వేల సంవత్సరాలుగా**
**మా**
**పవిత్ర కళాశిల్పం జీవిస్తూ వుంది**
**ఆ కళాశిల్పంతో చీకటిలో**
**ప్రకాశవంతమై**
**ఈ భూమి కూడా**
**కానీ ఏ కేవీ సుఖ దుఃఖాల మధ్య**
**రణం రుణం మరణం**
**లేదని మాత్రం పలకలేదు**

**సోవియట్ కవిత**
**కవి అన్నాఅక్మతోవ**
**అనువాదం కోటం చంద్రశేఖర్**
**9492043348**

## సుందర విశ్వం

ఇంధన రణం
విశ్వం హాహాకారాలు
ప్రగతి శూన్యం

పెద్దన్న రణం
చిన్నన్న పద్మవ్యూహం
ఓటమి ఖాయం

పన్నుల మోత
కలసిరాని నేస్తాలు
ఒంటరి ట్రంపు

ఇరాన్‌కు బలి
మేకలుతిన్నపులి
చీమలకాలం

పెద్దన్న పేను
విశ్వం నెత్తిన పుండు
చావు తప్పదు

పెద్దల మాట
నీల్గుట ఈల్గుటకే
నిత్యసత్యాలు

రక్తపాతాలు

ఆర్థిక పతనాలు
యుద్ధమూలాలు

జనం క్షేమాలు
నాయక లక్షణాలు
ఉత్తమ నేత

శాంతి మార్గాలు
ప్రపంచ సౌభాగ్యాలు
సుందర విశ్వం

రేడియమ్
9291527757

## ఇంధన సంక్షోభం - ఇంటి నుంచే పని

# భారత ఆర్థిక భవిష్యత్తు ఎటు?

ప్రపంచం ఒకే రకమైన సంక్షోభానికి పరిమితం కాదని గత కొన్ని సంవత్సరాల పరిణామాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. 2019లో ప్రారంభమైన కరోనా మహమ్మారి సమయంలో ఆరోగ్య సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా దేశాలను లాక్‌డౌన్‌లవైపు నెట్టింది. ఆ సమయంలో ఆర్థిక కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నా, ప్రజల ప్రాణరక్షణకు అది అవసరమైంది. అదే సమయంలో "ఇంటి నుంచే పని" అనే విధానం అనివార్య పరిష్కారంగా ముందుకు వచ్చి, ఉద్యోగ వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పుకు దారితీసింది.

ఇప్పుడు 2026లో ప్రపంచం మరోసారి ఒక కొత్త రకమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా ఘర్షణ 2026 కారణంగా మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయ సరఫరా గొలుసులు దెబ్బతింటున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై యుద్ధ చర్యలు చేపట్టడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి పెరిగింది. ఈ యుద్ధ ప్రభావం కేవలం ఆ ప్రాంతానికి మాత్రమే పరిమితం కాకుండా, చమురు సరఫరా, గ్యాస్ పంపిణీ, సముద్ర రవాణా వంటి కీలక రంగాలపై ప్రభావం చూపుతోంది.

మధ్యప్రాచ్యం ప్రపంచ చమురు సరఫరాలో ప్రధాన కేంద్రంగా నిలుస్తుంది. హోర్ముజ్ జలసంధి వంటి సముద్ర మార్గం ద్వారా ప్రపంచానికి పెద్ద మొత్తంలో క్రూడ్ ఆయిల్ రవాణా జరుగుతుంది. యుద్ధ పరిస్థితుల వల్ల ఈ మార్గం భద్రత ప్రశ్నార్థకమవుతే, చమురు సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఫలితంగా ధరలు పెరుగుతాయి. భారతదేశం తన చమురు అవసరాలలో అధిక భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటున్నందున, ఈ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయి.

ఇంధన ధరలు పెరగడం అనేది కేవలం వాహనదారుల సమస్యగా మాత్రమే ఉండదు. అది మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అంశంగా మారుతుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల వస్తువుల ధరలు పెరుగుతాయి. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి ఖర్చులు అధికమవుతాయి. పరిశ్రమలు కూడా అధిక వ్యయాన్ని ఎదుర్కొంటాయి. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణాన్ని పెంచి సామాన్య ప్రజల జీవన వ్యయాన్ని మరింత భారంగా మారుస్తాయి.

ఇదే సమయంలో గ్యాస్ సరఫరా, ఆహార పదార్థాల దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. సముద్ర మార్గాలలో అంతరాయం వల్ల ఎల్పీజీ గ్యాస్ సరఫరా ఆలస్యం అవుతుంది. ఎరువుల దిగుమతి తగ్గుతుంది. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తి కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. సరఫరా తగ్గి డిమాండ్ పెరిగినప్పుడు ధరలు పెరగడం సహజం.

ఈ పరిస్థితుల్లో ఒక ప్రధాన ప్రశ్న తలెత్తుతుంది: భారతదేశం మళ్లీ లాక్‌డౌన్ ప్రకటించే పరిస్థితి వస్తుందా? 2019లో లాక్‌డౌన్ ఆరోగ్య పరిరక్షణ కోసం అమలు చేయబడింది. కానీ ప్రస్తుతం ఉన్న సంక్షోభం ఆర్థిక, ఇంధన సమస్యలకు సంబంధించినది. అందువల్ల అదే విధానాన్ని తిరిగి అమలు చేయడం అంత సులభం కాదు. లాక్‌డౌన్ విధిస్తే ఆర్థిక కార్యకలాపాలు మళ్లీ మందగిస్తాయి. నిరుద్యోగం పెరుగుతుంది. చిన్న వ్యాపారాలు నష్టపోతాయి. ప్రభుత్వ ఆదాయం తగ్గుతుంది. కాబట్టి ఇది తక్షణ పరిష్కారంగా కనిపించినా, దీర్ఘకాలంలో సమస్యలను మరింత పెంచే అవకాశం ఉంది.

అందువల్ల ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇంధన వినియోగాన్ని నియంత్రించడం ఒక ముఖ్యమైన చర్యగా మారవచ్చు. అవసరం లేని వాహన వినియోగాన్ని తగ్గించడం, కార్‌పూలింగ్ ప్రోత్సహించడం, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకోవచ్చు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని వేగవంతం చేయడం కూడా అవసరం అవుతుంది.


ఇదే సమయంలో ఉద్యోగ విధానాలలో మార్పులు కూడా ఒక ముఖ్యమైన పరిష్కారంగా మారవచ్చు. ఇంటి నుంచే పని విధానం మళ్లీ ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటి రంగం, సేవా రంగాలలో ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయడం ద్వారా ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ఇది ట్రాఫిక్ తగ్గింపుకే కాకుండా కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుంది. అయితే అన్ని రంగాలకు ఇది వర్తించదు. తయారీ రంగం, రవాణా రంగం వంటి విభాగాలలో భౌతిక హాజరు అవసరం ఉంటుంది.

ఇకపై ప్రపంచం ఇలాంటి సంక్షోభాలను తరచుగా ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, దేశాలు దీర్ఘకాల వ్యూహాలను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతదేశం వ్యూహాత్మక చమురు నిల్వలను పెంచడం, ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలను అన్వేషించడం, దేశీయ ఉత్పత్తిని పెంచడం వంటి చర్యలు తీసుకోవాలి. అలాగే పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాన్ని విస్తరించడం ద్వారా భవిష్యత్తులో ఇంధన సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించవచ్చు.

మొత్తంగా చూస్తే, ప్రస్తుత పరిస్థితులు 2019 లాక్‌డౌన్ తరహా చర్యలను మళ్లీ అమలు చేసేలా కనిపించడం లేదు. అయితే ఇంటి నుంచే పని వంటి ప్రత్యామ్నాయ విధానాలు మరింత విస్తృతంగా అమలు కావచ్చు. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం తీసుకునే నిర్ణయాలు దేశ ఆర్థిక భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఈ నేపథ్యంలో సాంకేతికత, సమర్థవంతమైన విధానాలు, ప్రత్యామ్నాయ శక్తి వనరులు కీలక పాత్ర పోషించనున్నాయి.

2.ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించినప్పుడు, ఒక స్పష్టమైన వాస్తవం మన ముందుకు వస్తుంది: సంక్షోభాల స్వభావం మారినా, వాటి ప్రభావం మాత్రం సమాజంలోని ప్రతి వర్గాన్నీ తాకుతుంది. 2019లో ఆరోగ్య సంక్షోభం రూపంలో వచ్చిన ప్రభావం మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఇప్పుడు 2026లో భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధ పరిస్థితులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొత్త సవాళ్ల ముందుంచుతున్నాయి. ఈ రెండు సంక్షోభాల మధ్య ఉన్న ప్రధాన తేడా ఏమిటంటే, మొదటిది మానవ ఆరోగ్యానికి నేరుగా ముప్పు కలిగించగా, రెండవది ఆర్థిక స్థిరత్వాన్ని కుదిపేస్తోంది.

ఈ నేపథ్యంలో భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న




దేశం తీసుకోవాల్సిన నిర్ణయాలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశంగా, ప్రపంచ చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు మాత్రమే కాదు, ఉత్పత్తి రంగం, వ్యవసాయం, సేవారంగం అన్నీ ప్రభావితమవుతాయి. ఈ ప్రభావం చివరకు సామాన్య ప్రజలపై పడుతుంది. జీవన వ్యయం పెరిగి, ఆదాయం-ఖర్చుల మధ్య అసమతుల్యత ఏర్పడుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే చర్యలు తక్షణ ఉపశమనం ఇవ్వడమే కాకుండా, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని కూడా నిర్ధారించాలి. పూర్తి స్థాయి లాక్‌డౌన్ అనేది ఒక తక్షణ ప్రతిస్పందనగా కనిపించినా, అది ఆర్థిక వ్యవస్థకు మళ్లీ తీవ్రమైన దెబ్బ తగిలించే ప్రమాదం ఉంది. గత అనుభవాలు చూపించినట్లుగా, లాక్‌డౌన్ వల్ల చిన్న వ్యాపారాలు మూతపడటం, ఉద్యోగాలు కోల్పోవడం, వలస కార్మికుల సమస్యలు పెరగడం వంటి అనేక ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాబట్టి అదే విధానాన్ని మళ్లీ అనుసరించడం సముచితం కాదు.

అయితే లాక్‌డౌన్‌కు బదులుగా మిశ్రమ విధానాలను అనుసరించడం ద్వారా సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చు. ఇంటి నుంచే పని విధానం ఇందులో ఒక ప్రధాన పాత్ర పోషించగలదు. ఇది కేవలం ఒక ఉద్యోగ విధానం మాత్రమే కాదు; ఇది ఇంధన వినియోగాన్ని తగ్గించే వ్యూహాత్మక సాధనంగా కూడా పనిచేస్తుంది. నగరాల్లో రోజూ జరిగే ప్రయాణాలు తగ్గితే, పెట్రోల్, డీజిల్ వినియోగం గణనీయంగా తగ్గుతుంది. దీనివల్ల దేశానికి విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గుతుంది. అలాగే కాలుష్యం తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుంది.

ఇది మాత్రమే కాదు, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కూడా ఈ సందర్భంలో అత్యంత అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తే, ఇంటి నుంచే పని అవకాశాలు విస్తరించవచ్చు. ఇది గ్రామీణ-పట్టణ అసమానతలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అదే సమయంలో సంస్థలు కూడా తమ విధానాలను మార్చుకుని, ఉద్యోగులకు అనువైన వాతావరణాన్ని కల్పించాలి. ఫ్లెక్సిబుల్ పని గంటలు, మిశ్రమ విధానాలు వంటి మార్పులు దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా ఉంటాయి.

ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు మరో ముఖ్యమైన మార్గం ప్రత్యామ్నాయ శక్తి వనరులపై దృష్టి సారించడం. సౌరశక్తి, వాయు శక్తి, హైడ్రోజన్ ఇంధనం వంటి వనరులు భవిష్యత్తులో కీలక పాత్ర పోషించనున్నాయి. భారతదేశం ఇప్పటికే ఈ రంగాల్లో కొన్ని ముందడుగులు వేసినప్పటికీ, వాటిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. దీనిద్వారా దేశం దిగుమతులపై ఆధారాన్ని తగ్గించుకోవచ్చు.

ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా భారతదేశం తన దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయాలి. వివిధ దేశాలతో ఇంధన ఒప్పందాలు కుదుర్చుకోవడం, కొత్త సరఫరా మార్గాలను అన్వేషించడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు. ఇది కేవలం ఆర్థిక భద్రతకే కాకుండా, వ్యూహాత్మక భద్రతకు కూడా అవసరం.

ఇక సామాజిక కోణంలో చూస్తే, ఇలాంటి సంక్షోభాలు సమాజంలో అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది. ధనిక వర్గాలు సులభంగా ప్రత్యామ్నాయాలను కనుగొనగలుగుతాయి. కానీ మధ్యతరగతి, పేద వర్గాలు మాత్రం ధరల పెరుగుదలతో తీవ్రంగా ప్రభావితమవుతాయి. అందువల్ల ప్రభుత్వ విధానాలు సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని ఉండాలి. సబ్సిడీలు, ప్రత్యక్ష నగదు బదిలీలు, అవసరమైన వస్తువుల సరఫరా నియంత్రణ వంటి చర్యలు సామాజిక స్థిరత్వానికి అవసరం.

ఇంటి నుంచే పని విధానం కూడా ఈ నేపథ్యంలో ఒక సామాజిక మార్పుకు దారితీస్తోంది. ఇది కేవలం ఉద్యోగ పద్ధతిలో మార్పు మాత్రమే కాదు; జీవన విధానాన్ని కూడా మార్చుతోంది. కుటుంబంతో గడిపే సమయం పెరగడం, నగరాలపై ఒత్తిడి తగ్గడం, గ్రామీణ ప్రాంతాలకు అవకాశాలు విస్తరించడం వంటి అనేక సానుకూల పరిణామాలు కనిపిస్తున్నాయి. అయితే దీనికి సంబంధించి కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డిజిటల్ విభజన, ఇంటర్నెట్ సదుపాయాల లోపం, పని-వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కోల్పోవడం వంటి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

ఇకపోతే, విద్యా రంగం కూడా ఈ మార్పుల ప్రభావాన్ని అనుభవిస్తోంది. ఆన్‌లైన్ విద్య, డిజిటల్ నేర్చుకునే వేదికలు విస్తృతంగా ఉపయోగంలోకి వచ్చాయి. ఇది ఒకవైపు అవకాశాలను పెంచినా, మరోవైపు అసమానతలను కూడా పెంచే ప్రమాదం ఉంది. అందువల్ల విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు అవసరం.

అంతర్జాతీయ స్థాయిలో కూడా దేశాల మధ్య పోటీ, సహకారం రెండూ ఒకేసారి కొనసాగుతున్నాయి. ఇంధన వనరుల కోసం పోటీ పెరుగుతుండగా, వాతావరణ మార్పుల సమస్యను ఎదుర్కొనేందుకు సహకారం అవసరం అవుతోంది. ఈ విభిన్న లక్ష్యాలను సమతుల్యం చేయడం ప్రతి దేశానికి ఒక పెద్ద సవాలు.

భారతదేశం ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే, ఒక సమగ్ర దృష్టికోణం అవసరం. తక్షణ చర్యలు మాత్రమే కాకుండా, దీర్ఘకాల వ్యూహాలు కూడా ఉండాలి. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం, సామాజిక సమానత్వం, పర్యావరణ పరిరక్షణ- ఈ నాలుగు అంశాలు పరస్పరం అనుసంధానంగా ఉండాలి.

ప్రస్తుతం లాక్‌డౌన్ అవసరమా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఏమిటంటే: పూర్తి స్థాయి లాక్‌డౌన్ కంటే నియంత్రణాత్మక, లక్ష్యబద్ధమైన చర్యలు మరింత ప్రభావవంతంగా ఉంటాయి. అవసరమైన రంగాల్లో మాత్రమే పరిమితులు విధించడం, మిగతా రంగాలను కొనసాగించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను రక్షించవచ్చు. ఈ సందర్భంలో ఇంటి నుంచే పని ఒక సమతుల్య పరిష్కారంగా నిలుస్తుంది.

చివరగా, ఈ సంక్షోభం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతోంది: స్వయం సమృద్ధి ఎంత ముఖ్యమో. స్థానిక ఉత్పత్తి, స్థానిక వినియోగం, స్థానిక ఉపాధి అవకాశాలపై దృష్టి సారించడం ద్వారా దేశం బలపడుతుంది. గ్లోబల్ స్థాయిలో అనిశ్చితి ఉన్నప్పటికీ, లోకల్ స్థాయిలో స్థిరత్వాన్ని సాధించడం ద్వారా పెద్ద ప్రభావాలను తగ్గించవచ్చు.

మొత్తంగా చూస్తే, 2026లో ఉన్న పరిస్థితులు ఒక పరీక్షలా మారాయి. ఈ పరీక్షను భారతదేశం ఎలా ఎదుర్కొంటుందో దాని భవిష్యత్తును నిర్ణయిస్తుంది. సరైన విధానాలు, సమర్థవంతమైన అమలు, ప్రజల సహకారం-కలిసి పనిచేస్తే, ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చుకోవచ్చు. ఇంటి నుంచే పని, ఇంధన సంస్కరణలు, డిజిటల్ అభివృద్ధి- కలిపి ఒక కొత్త భారతదేశ నిర్మాణానికి మార్గం సుగమం చేయగలవు. ఈ దిశగా తీసుకునే ప్రతి అడుగు, భవిష్యత్తు తరాలకు ఒక బలమైన పునాది అవుతుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

# దురాలవాట్లను దూరం చేసుకుంటే క్యాన్సర్ దూరం

**తాండూరు, మార్చి 29 (జనంసాక్షి) :** దురాలవాట్లను దూరం చేసుకుంటే క్యాన్సర్ దూరం అవుతుందని డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్యులు డా.మధు దేవర శెట్టిలు వేల్లడించారు.ఆదివారం తాండూరు పట్టణం సాయితరుణ్ ఆసుపత్రిలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జయప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎంఏ, కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాబూ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై వైద్యులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్ వైద్య శిబిరాన్ని దృష్టిలో ఉంచుకుని సుమారు 14 మంది వైద్యులు సేవలు అందించారు. ఈ శిబిరానికి తాండూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 350 మందికి పైగా తరలివచ్చి వివిధ పరీక్షలు చేయించుకున్నారు. 150 మందికి పైగా రక్తపరీక్షలు, 63 మంది అల్ట్రా సౌండ్ స్కానింగ్, 12 మంది



మోమోగ్రఫీ, 8 మంది ఎండోస్కోపింగ్, 69 మంది ఎక్స్‌రే, 63 మంది క్యాన్సర్ పరీక్షలు, 53 మంది పాప్ స్మియర్ పరీక్షలు, మిగతా వారు ఇతర పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డా.మధు దేవర శెట్టి మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. దురాలవాట్లను దూరం చేసుకుంటే క్యాన్సర్‌ను దూరంగా ఉంచవచ్చని అన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధిని నయం చేయవచ్చని అన్నారు. డీఎస్పీ నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్యాన్సర్ వ్యాధి అంటే భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. సకాలంలో పరీక్షలు, వైద్యం చేయించుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఐఎంఏ, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, తాండూరు ఐఎంఏ ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవి నీటి ఎద్దడికి సర్పంచ్ ప్రత్యేక చొరవ



**వెల్దండ, మార్చి 29 (జనంసాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలో వేసవి కాలం నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకొని నూతన బోరు మోటార్లలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, గ్రామంలో నెలకొన్న సమస్యలను క్రమానుగతంగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న 9 వ వార్డు సభ్యులు ముదికొండ కవిత రమేష్ , మాసుల మల్లేష్ , గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి



**మోమిన్‌పేట, మార్చి 29 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని మోమిన్ పేటమండల బిజెపి అధ్యక్షులు గోంగూలూరు ఆశీరెడ్డి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోమిన్ పేట్ మండలంలోని లచ్చా నాయక్ తండాలో వీబీజీ రాంజీ మరియు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో పది లక్షల సిసి రోడ్ పనులను గ్రామ సర్పంచ్ లక్ష్మీ రాజు చౌహాన్ తో కలిసి ప్రారంభించడం జరిగింది. మోమిన్ పేట్ మండలానికి నిధులు కేటాయించినందుకు మన బీజేపీ చేవెళ్ల ఎంపీకొండా విశ్వేశ్వర్ రెడ్డికి ప్రతేకంగా ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెగావత్ లక్ష్మి చరణ్ పెద్దలు సిహెచ్ చందర్ జగదీష్ వార్డ్ మెంబర్ ప్రవీణ్ చౌహన్ బాల్ సింగ్ రమేష్ వర్థ్య రాజు పరుశురాం ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...



**సికింద్రాబాద్, మార్చి 29 (జనంసాక్షి) :** రానున్న ఎన్నికల్లో లష్కర్ లో టీడీపీ జెండా ఎగురుతుందని సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వల్లారపు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. లస్కర్ ఒకప్పుడు టిడిపి కి కంచుకోటగా ఉండేదని తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి దిశగా ప్రతి కార్యకర్త కంకణ బద్దలై పనిచేయాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టీడీపీ నాయకులు సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని అన్ని డివిజన్ లలో పార్టీ జెండా ఎగురవేసి, స్వీట్లు, పళ్లు పంచి పెడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వల్లారపు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిఎం.రమేష్, గండికోట విజయ్ కుమార్, చందర్ ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖ కఠిన నిఘా

**అబ్దుల్లాపూర్మెట్, మార్చి 29 (జనం సాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో జరిగే వేడుకలు, ఈవెంట్లపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఫంక్షన్ హాల్స్, బ్యాంక్వెట్ హాల్స్, రిసార్ట్స్, ఫార్మ్ హౌస్‌లలో నిర్వహించే కార్యక్రమాల్లో అక్రమ మద్యం, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్టేట్ టాస్క్ ఫోర్స్ , రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్, సరూర్ నగర్ జిల్లా టాస్క్ ఫోర్స్ , హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ఎక్సైజ్ బృందాలు సంయుక్తంగా నిరంతర తనిఖీలు నిర్వహించనున్నాయి. ముఖ్యంగా డిఫెన్స్ లిక్కర్, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఇతర రాష్ట్రాల మద్యం), విదేశీ మద్యం, గంజాయి, డ్రగ్స్ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈవెంట్లలో మద్యం వినియోగానికి తప్పనిసరిగా ఈవెంట్ పర్మిట్ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం తప్ప ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చిన మద్యం లేదా డిఫెన్స్, విదేశీ మద్యం వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.అదనంగా, ఎక్సైజ్ బృందాలు ఆధునిక టెక్నాలజీ యాప్‌ల సహాయంతో మద్యం వినియోగాన్ని తనిఖీ చేయనున్నాయి. అనుమతి లేకుండా ఈవెంట్లు నిర్వహించడం లేదా నిబంధనలు ఉల్లంఘించడం జరిగితే సంబంధిత ఫంక్షన్ హాల్ లేదా రిసార్ట్‌ను బ్లాక్‌లిస్ట్ చేసి భవిష్యత్తులో ఈవెంట్ పర్మిట్లు ఇవ్వబోమని తెలిపారు .ఫంక్షన్ హాల్, రిసార్ట్ యజమానులు తమ వద్ద జరిగే ఈవెంట్లలో అన్ని నిబంధనలు పాటించేలా బాధ్యతగా వ్యవహరించాలని ఎక్సైజ్ అధికారులు కోరారు.

# భోజనం గొడవలో రక్తపాతం

**రాజేంద్రనగర్, మార్చి 29 (జనంసాక్షి) :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి ప్రకారం మార్చి 28 రాత్రి కొకాపేట్‌లోని నార్త్ స్టార్ అలూరా విలాస్‌లో నివసిస్తున్న కత్రగుంట ధర్మతేజ ఫిర్యాదు మేరకు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆయన మామ పేరుతో అద్దెకు తీసుకున్న విల్లాలో గత నాలుగు నెలలుగా నివసిస్తున్నారు. అక్కడ షేక్ బాషా అనే వ్యక్తి వంట మనిషిగా పనిచేస్తూ సర్వెంట్ గదిలో ఉంటున్నాడు. సుమారు 15 రోజుల క్రితం అతని ద్వారా పీసుమల్ల కార్తిక్‌ను డ్రైవర్‌గా నియమించారు.ఘటన జరిగిన రోజు ఇంట్లో ధర్మతేజ లేకపోవడంతో, వంటమనిషి షేక్ బాషా, డ్రైవర్ కార్తిక్ మధ్య భోజనం విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో, కోపోద్రిక్తుడైన షేక్ బాషా కత్తితో కార్తిక్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో కార్తిక్‌కు అనేక గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడు షేక్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు తన తప్పును అంగీకరించాడు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీ 14వ వార్షికోత్సవం




**అబ్దుల్లాపూర్మెట్, మార్చి 29 (జనం సాక్షి) :** శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీఆధ్వర్యంలో తట్టిఅన్నారం, కాలేజీ ప్రాంతంలో శనివారం 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, విశిష్ట అతిథులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన. సి శేఖర్రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలో చోటుచేసుకుంటున్న మార్పులు, ముఖ్యం ఆర్టిఫిషల్ ఇంతలిజెన్స్ ప్రభావం గురించి వివరించారు. విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు, అకడమిక్ టాపర్స్‌కి మరియు ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అటామిక్ వర్క్‌లో రూ.21 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైన విద్యార్థి అఖిల్ కోసూరిని ప్రత్యేకంగా అభినందించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న మద్ది శెట్టి రాజగోపాల్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా మరియు వ్యాపార రంగాలలో ఉన్న అవకాశాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకు రావాలని ప్రోత్సహించారు.సంస్థ ఉపాధ్యక్షుడు అనంతుల హృదయ్ రెడ్డి మాట్లాడుతూ అమెరికా, థాయిలాండ్ దేశాలలోని విశ్వవిద్యాలయాలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలు గ్లోబల్ ఎడ్యుకేషన్ అవకాశాలను విస్తరించనున్నాయని తెలిపారు. మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులకు అందిస్తున్న ప్లేస్‌మెంట్ శిక్షణపై వివరించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ సి ఉదయ్ కిరణ్ వార్షిక నివేదికను సమర్పిస్తూ, సంస్థ గత ఏడాది సాధించిన విజయాలు, పురోగతిని వివరించారు. విద్యార్థులు, సిబ్బంది కృషిని అభినందించారు.ఈ వేడుకలకు 3000కి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, విభాగాధిపతులు హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, విద్యా అవార్డులు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సంస్థ నిర్వహణ, అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సంస్థ కట్టుబాటును ఈ వేడుక ప్రతిబింబించింది.

## బిజెపి ఆధ్వర్యంలో పండిత్ దిన్ దయల్ ఉపాధ్యాయ శిక్షణ

**చేర్యాల, మార్చి 29 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ బిజెపి ఆధ్వర్యంలో పండిత్ దిన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభినయ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని బిజెపి మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవ ఆధ్వర్యంలో స్థానిక వాసవి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సౌడ రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, జిల్లా కార్యదర్శి తోకల ఉమారాణి, ప్రశిక్షణకు కన్వీనర్ బల్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, సీనియర్ నియోజకవర్గ నాయకులు అంకుగారి శశిధర్ రెడ్డి, నర్ర మహేందర్ రెడ్డి, బూరుగు సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ శిల్పా రామంలో సృజన హైస్కూల్ రజతోత్సవం



**ఉప్పల్, మార్చి 29 (జనం సాక్షి) :** ఉప్పల్ శిల్పా రామంలో సృజన హై స్కూల్ నిర్వహించిన "రజతోత్సవం" 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకోగా, ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఎమ్మెల్యే గారు, విద్య ద్వారానే భవిష్యత్ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంది వనపర్తి లో దొడ్ల డైరి చిల్లింగ్ కేంద్రం ప్రారంభం



**యాచారం, మార్చి 29 (జనం సాక్షి) :** యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలో దొడ్ల పాలడైరీ చిల్లింగ్ ప్లాంటును గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నీలం విజయలక్ష్మి వీరాంజనేయులు నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రాయి కంటి విజయ్ కుమార్ ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ రీజినల్ మేనేజర్ అంజిరెడ్డి, హెడ్. హెచ్ఆర్ మధుసూదన్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ బ్రహ్మారెడ్డి, సి ఎం సి ఇంచార్జ్ వెంకటేష్, ఉప సర్పంచ్ శ్రీశైలం, నిర్వాహకులు మల్లికార్జున్, రైతులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఇందిరాపార్క్ స్థలాన్ని కాపాడాలి



**ముషీరాబాద్, మార్చి 29 (జనం సాక్షి) :** కరాటే క్లాసుల పేరుతో ప్రభుత్వ స్థలమైన ఇందిరా పార్క్ లోని కొంత భాగాన్ని నిర్వాహకుడు మహమ్మద్ షఫీరుద్దీన్ స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని, వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి, ఆ స్థలాన్ని కబ్జా నుండి విముక్తి పరచాలని, కబ్జాదారునికి మద్దతిస్తున్న నాయకులపై నా చర్యలు తీసుకోవాలని శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సిపిఐ పార్టీ నాయకులు నారాయణ తో కలిసి ఇందిరా పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల స్థలమైన ఇందిరాపార్క్ లో ఎలాంటి అనుమతులు లేకుండా మహమ్మద్ షఫీరుద్దీన్ కరాటే క్లాస్లులు నిర్వహిస్తున్నారని, అంతేకాకుండా పార్క్ గోడలు కూల్చేసి, నిర్మాణాలు చేపడుతూ పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఇందిరా పార్క్ స్థలాన్ని కబ్జాదారుల చెరనుండి విముక్తి కలిగించి, కబ్జాకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మణికొండ క్రికెట్ మైదానం అవకతవకలపై విచారణకు బీఆర్ఎస్ డిమాండ్



**రాజేంద్రనగర్, మార్చి 29 (జనంసాక్షి) :** మణికొండలో రూ 3.05 కోట్ల ప్రజా ధనంతో నిర్మించిన క్రికెట్ మైదానం నాసిరకం పనితనం కారణంగా వినియోగానికి అనర్హంగా మారిందని మణికొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆరోపించారు. ముఖ్యంగా క్రికెట్ పిచ్ పూర్తిగా పనికిరాని స్థితిలో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబు 2025 నవంబర్ 19న మైదానాన్ని ప్రారంభించగా, టెండర్లు మాత్రం నవంబర్ 27న పిలవడం తీవ్ర అవకతవకలుగా పేర్కొన్నారు. ఇది తెలంగాణ మున్సిపల్ చట్టం 2019కు విరుద్ధమని విమర్శించారు. ఇదిలా ఉండగా, స్థానిక నవజ్యోతి యువజన సంఘం మైదానాన్ని కాపాడుతూ స్వంత నిధులతో టోర్నమెంట్లు నిర్వహిస్తూ యువతకు సేవలందిస్తోందని ప్రశంసించారు. మైదానం నిర్వహణను ఆ సంఘానికే రెవెన్యూ షేరింగ్ విధానంలో అప్పగించాలని సూచించారు. టెండర్ లోపాలపై విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్ చేయాలని, అలాగే పిచ్‌ను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ స్థానిక నాయకులు కుంభగల్ల ధనరాజ్, ఉపేంద్రనాథ్ రెడ్డి, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, మహమ్మద్ అరిఫ్, సుమనలిని, తదితరులు విజ్ఞప్తి చేశారు.

# చౌదర్పల్లిలో అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ

**యాచారం, మార్చి 29 (జనం సాక్షి) :** మహనీయులను సమాజం ఎప్పటికీ మరువదని అలాంటి మహనీయుల్లో ముందు వరుసలో ఉన్న మహనీయులు ఎవరైనా ఉన్నారంటే అది కేవలం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ అని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చెప్పారు. చౌదర్పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ, రిటైర్డ్ ఐఐఎస్ జాతీయ చైర్మన్ జేబీ రాజు పాల్గొనే విగ్రహాలను ఆవిష్కరించారు. ఏళ్లుగా పేదవాళ్లకు మహిళలకు కుల వ్యవస్థ విద్యా అవకాశాలు లేకుండా చేసిందని చదువును దూరం చేసిన వ్యవస్థలో చదువుకుంటేనే సమాజంలో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించవచ్చని అందరూ చదువుకోవాలి అందులో అట్టడుగు



వర్గాల వారు చదువుకోవాలని చదువు అనే స్ఫూర్తిని ఈ సమాజానికి అందించిన మహనీయులు జ్యోతిరావు పూలే దంపతులు అన్నారు. ప్రపంచంలో మేధావుల్లో అతి గొప్ప మేధావి ఎవరైనా ఉన్నారంటే అది కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాత్రమేనని ఐక్యరాజ్యసమితి అంబేద్కర్ ను ప్రపంచ మేధావిగా గుర్తించిందని చెప్పారు. బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వామి అయ్యారని, రాజ్యాంగానికి ఆమోద ముద్ర వేయించడంలోకీలకపాత్ర పోషించారని చెప్పారు. దళిత పేద వర్గాల వారికి రిజర్వేషన్లు అందుబాటులోకి రావాలని చెప్పి పోరాటాలు ఎన్నో చేశారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు కేశమోని రాజు, విగ్రహ దాతలు జుట్టు శ్రీశైలం, రిటైర్డ్ అధికారి సాయిలు, నవీన్ రెడ్డి, నడికుడి కృష్ణ, శ్రీధర్, నాయిని వెంకటరమణారెడ్డి బిలకంటి శేఖర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అలీన విధానం అమలులో మోడీ విఫలం




**వనపర్తి బ్యూరో, మార్చి 29 (జనం సాక్షి) :** అమెరికా ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధ విరమణకు చొరవ చూపటల్లో దేశ ప్రధాని మోదీ విఫలమయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ విమర్శించారు. ఆదివారం రాబర్ట్ అధ్యక్షతన జరిగిన వనపర్తి జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు దేశాల మధ్య యుద్ధాలు వచ్చినప్పుడు భారతదేశ అలీన విధానం పాటించి యుద్ధ నివారణకు చొరవ చూపారని మోదీ విషయంలో అది లోపించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు అప్పుడు అని మోడీ గొప్పలు చెప్పడం తప్ప యుద్ధంతో ఇండియాకు జరిగే నష్టాన్ని వివరించి రాజీతో యుద్ధ విరమణ చేయించలేకపోయారన్నారు. ఇరాన్, క్యూబా, వెనుజుల దేశాలను ఆక్రమించాలనే ట్రంప్ సామ్రాజ్యవాద రాజ్య విస్తరణ కాంక్ష ప్రజా వినాశనం కలిగించే యుద్ధాలకు కారణమన్నారు. ఇరాన్ దేశంలో 30% చమురు నిల్వలు ఉన్నాయని వాటిని కొండగొట్టేందుకు ఇరాన్ వద్ద యురేనియం అనుబాంబులు ఉన్నాయని వాటితో తమకు ప్రమాదమని ప్రపంచాన్ని తప్పుదారి పట్టించి యుద్ధానికి దిగారు అన్నారు. ఫలితంగా భారతదేశంలో డీజిల్ పెట్రోల్ గ్యాస్ కొరత కు దారి తీసింది అన్నారు. మోడీ మౌనం దేశానికి తీరని నష్టమన్నారు. ఇరాన్, ఇరాన్ మద్దతు దేశాల వద్ద ఆయుధ సంపత్తి ఉందని ఎంతకాలం యుద్ధం జరుగుతుందో చెప్పలేమని దేశంలో ఎన్ని సమస్యలు వస్తాయో అంతు పట్టడం లేదన్నారు. యుద్ధం తక్షణ ఆపేందుకు భారతదేశం తన వంతు పాత్రను పోషించాలన్నారు. దేశంలో పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ కొరత ఫలితంగా ఇతర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు జీవించలేని పరిస్థితి ఏర్పడబోతోందని సమస్యల పరిష్కారానికి తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అరకొరగా అమలు చేస్తుందన్నారు. చాలామంది అర్హులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదని, రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో రైతు ఖాతాల్లో జమ కాలేదని, రైతు బీమా పథకానికి నిధులు కేటాయించలేదని మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వలేదన్నారు. ఆసరా పింఛన్లు రూ. 2000 నుంచి 4 వేలకు పెంచలేదని, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల్లోను కాంగ్రెస్ మిత్ర ధర్మం పాటించలేదని విమర్శించారు. రానున్న జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో సొంతంగా పోటీకి సిద్ధం కావాలని కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి పది వరకు ఇంటింటికి సిపిఐ ప్రోగ్రాం ఉందని ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం నేతలు కార్యకర్తలు పని చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, చంద్రయ్య, రాబర్ట్, రమేష్, మోష,భాస్కర్,రవీందర్, కురుమయ్య,అబ్రహం, కుతుబ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించాలి



**చిలప్‌చేడ్, మార్చి 29 (జనంసాక్షి) :** భారత ప్రభుత్వ విద్యా,అక్షరాస్యత మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహించబడుతున్న ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షర మాల పేరుతో చదువుకోని మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించడానికి వాలంటీర్ల ద్వారా చదువు నేర్చుకున్న మహిళలకు మూల్యాంకన పరీక్షను ఈ రోజు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సంఘాల్లో నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలను పరిశీలన పర్యవేక్షణ చేయడానికి న్యూఢిల్లీ నుండి ఈ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న సీనియర్ కన్సల్టెంట్ బాను బొరా రావడం జరిగింది. జిల్లాలో చిలప్ చేడ్ మండలంలో చండూరు గ్రామంలో నిర్వహించిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ విద్య, అక్షరాస్యత మంత్రిత్వ శాఖలో సీనియర్ కన్సల్టెంట్ న్యూ ఢిల్లీ భాను బొర, డిప్యూటీ డైరెక్టర్ కే వెంకటరెడ్డి, వయోజన విద్య మెదక్ ప్రాజెక్ట్ అధికారి మురళీ మోహన్, మండల ఏపీఎం గౌరీ శంకర్, జిల్లా ఎపిఎం వెంకటస్వామి, సీసీ భాగ్య, వివోఏ సరిత, అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



**చేర్యాల/మద్దూరు, మార్చి 29 (జనంసాక్షి) :** ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మద్దూరు మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2005లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏర్పాటు కోసం సిపిఐ కాంగ్రెస్ కలిసి చట్టం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బిజెపి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథక పేరును వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంగా మార్చడం సిగ్గుచేటు అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు శాపంగా ఆన్ లైన్ ద్వారా ఫోటో క్యాప్చర్ తీసుకొచ్చి కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 200 పని దినాన్ని వంద రోజులకు కుదించి ఉపాధి కూలీల హక్కులను బిజెపి ప్రభుత్వం కాల రాస్తుందని విమర్శించారు. ఉపాధి కూలీలు పనిచేసే స్థలంలో టెంట్, మెడికల్ కిట్లు, పనిముట్లు, త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉపాధి కూలీలను ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఐ మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోమారపు నర్సయ్య, నంగి కనకయ్య, బియ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

# మంజీరా, నక్క వాగును కాలుష్యం నుండి కాపాడాలి

- కాలుష్య నివారణకు బడ్జెట్ లో నిధులు కేటాయించాలి
- మూసిలాగా మంజీరా ను శుద్ధి చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బహిరంగ లేఖ


COMMUNIST PARTY OF INDIA (MARXIST)
SANGAREDDY DISTRICT COMMITTEE
బహిరంగ లేఖ
తేది:- 29.03.2026
శ్రీయుత గౌరవనీయులైన ఎ.రేవంత్ రెడ్డి గారు,
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు,
డా|| బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం, హైదరాబాద్.
విషయం: మంజీరా, నక్క వాగును కాలుష్యం నుండి కాపాడాలని, కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరుట గురించి.
అర్యా!

**సంగారెడ్డి టౌన్, మార్చి 29 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ఉన్న మంజీరా, నక్క వాగులను కాలుష్యం నుండి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి జిల్లాలో ఉన్న మంజీరానదిని, నక్క వాగులను కాలుష్యం బారి నుంచి కాపాడాలని, అందుకు అవసరమైన నిధులు బడ్జెట్ లో కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి బహిరంగ లేఖ రాయడం జరిగింది. నేడు కేవలం కిషన్ భవన్లో బహిరంగ లేఖను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజీరా నది సంగారెడ్డి జిల్లాతో పాటు మెదక్, హైదరాబాదు, రంగారెడ్డి, నిజామాబాద్ కామారెడ్డి లకు తాగునీటిని అందిస్తూ జీవనాధారంగా ఉన్నదని అన్నారు. దీనిపై జిల్లాలో అనేకమంది రైతులు, మత్స్యకారులు, వృతిదారులు, ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.మంజీరా నది వెంట అనేక పట్టణాలు, గ్రామాలు, పరిశ్రమ లు విస్తరించి ఉన్నాయని అన్నారు.సంగారెడ్డి జిల్లాకు గుండెకాయ లాంటి మంజీరా జలాలను పరిశ్రమల వ్యర్థ కాలుష్య జలాలు వలన కాలుష్యమయమైపోతున్నాయని అన్నారు.మంజీరా నది వెనుక పక్కన ఉన్న అనేక గ్రామాల ప్రజలు ఈ కాలుష్యం తోటి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా నక్క వాగు కాలుష్యం వలన పటాన్చెరు సంగారెడ్డి, కంది మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మంజీరను, నక్క వాగును కాలుష్యం నుంచి పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలుష్య జలాలను విడుదల చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నివారణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాలుష్యమయం అవుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని కోరారు. మూసిలాగా మంజీరా ను శుద్ధి చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బెజ్జంకి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



**బెజ్జంకి, మార్చి 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తీరుకల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా,భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతూ, భక్తుల రద్దీతో నిండిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాలు ఘనంగా సాగాయి. ప్రత్యేక పూజలు,హోమాలు,అర్చనలు నిర్వహించి,స్వామివారికి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి దర్శనం చేసుకుని ఆశీర్వాదాలు పొందారు. ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, భక్తుల కోసం అన్ని మౌలిక వసతులు కల్పించామని అన్నారు.కళ్యాణ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్(పెద్దన్నా),ఉపసర్పంచ్ దుమాల మహేష్,వార్డు మెంబర్లు,ఆలయ కమిటీ మెంబర్లు మరియు గ్రామ పెద్దలు,భక్తులు భారీగా పాల్గొన్నారు.కల్యాణోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహించగా,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## వ్యాయామం శ్రేష్టమైన ఆరోగ్యం



**సంగారెడ్డి టౌన్, మార్చి 29 (జనం సాక్షి) :** సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్ మున్సిపల్ పార్కులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి మున్సిపల్ ఆధ్వర్యంలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని పట్టణంలోని కలెక్టరేట్ బ్యాక్ సైడ్ విద్యానగర్ కాలనీలో ఉన్న మున్సిపల్ పార్కులో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్ సన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రణాళికలో భాగంగా హ్యాపీ సండే ప్రోగ్రాం నిర్వహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ యు ఎల్ ఎం డైరెక్టర్ లావణ్య, కౌన్సిలర్ సతీష్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ,యువజన సంఘాల నాయకులు కూన వేణు , యోగ గురువులు దత్, సోమలింగం, ఉద్యోగులు,వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ పెద్దలు, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సభ్యులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కిరాణా షాపులో అగ్నిప్రమాదం



**చిలప్‌చెడ్, మార్చి 29 (జనంసాక్షి) :** మండల పరిధిలోని జగంపేట గ్రామ శివారు లోని గల సిరిపురం గేటు వద్ద ఉన్న కిరాణా షాపులో శనివారం నాడు అర్ధరాత్రి 1:00గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.10 లక్షల ఆస్తి కాలి బూడిదైందని జగ్గంపేట గ్రామానికి చెందిన బొలిశెట్టి ప్రభు ఆవేదన వ్యక్తం చేశారు.కిరాణా దుకాణంలో నిన్న అర్ధరాత్రి కరెంట్ షాక్ తో కిరాణా షాపులోని సమాన్లు దగ్ధమయ్యాయి. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే కిరాణం షాప్ లోని సరుకులన్నీ కాలి బూడిదయ్యాయని బాధితుడి కుటుంబానికి సంబంధించిన పట్టా పాస్ బుక్ లు, ఆధార్ కార్డులు కాలిపోయాయని. అగ్ని ప్రమాదానికి భవనం కూడా బీటలు వారిందని బాధితుడు ఆవేదన చెందాడు. ఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారి సునీల్ పరిశీలించి ఆస్తి నష్టాన్ని అంచన వేశారు. కిరణా షాపులో కాలిపోయిన ఆస్తి నష్టం విలువ సుమారు రూ. 7లక్షల 18 వేల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని అంచన వేశారు. అలాగే బాధితుడి కుటుంబానికి సంబంధించిన పట్టా పాస్ బుక్ ఆధార్ కార్డ్స్ బ్యాంక్ పాస్ బుక్కులు తదితర వస్తువులు దగ్ధమైనట్లు గుర్తించామని ఈ రిపోర్టును ఉన్నత అధికారులకు అందజేసి బాధితుడు ప్రభువుకి తగిన ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సునీల్,జిపిఓ జనార్దన్ రెడ్డి, గ్రామస్తులు నరసింహారెడ్డి, బీరప్ప, నరేందర్,వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి



**గద్వాల టౌన్, మార్చి 29 (జనంసాక్షి) :** జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు కేంద్ర ప్రభుత్వం క్వింటా రూ.2400 మద్దతు ధర నిర్ణయించినప్పటికీ మార్కెట్ సదుపాయం లేకపోవడంతో రైతులు దళారులకు కేవలం రూ.1700కే అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ తక్కువ ధరకు అమ్ముకుంటే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.ప్రభుత్వం కొనుగోలు చేస్తుందనే ఆశతో రైతులు తమ మొక్కజొన్న పంటను కల్లాల దగ్గర నిల్వ చేస్తున్నారు.అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు పండించినపంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు.జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే,వ్యవసాయశాఖ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రకటన విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# 5.88 కోట్ల రూపాయలతో చిన్న గోప్లాపూర్ థర్డ్ పంప్ రిపేర్ పనులు

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి చొరవతో మూడో పంప్ అందుబాటులోకి
- 2018 ఏప్రిల్ నుంచి పనిచేయని థర్డ్ పంప్




**మక్తల్, మార్చి 29 (జనంసాక్షి) :** స్థానికుడు ఎమ్మెల్యేగా గెలిస్తే తెలంగాణ రాష్ట్ర మంత్రి పదవిలో ఉంటే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో ఎలా పరుగులు పెడుతుందో మఖ్తల్ నియోజవర్గ ప్రజలకు అభివృద్ధిని రుచి చూపిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2018 ఏప్రిల్ ఎన్నికలకు ముందు నుంచి భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా స్టేజ్ వన్ చిన్న గోపులాపూర్ లిఫ్ట్ వద్ద మూడు పంపులు ఉండగా కేవలం రెండు మాత్రమే పనిచేసి ముడో పంపు చెడిపోగా 2018 నుంచి కనీసం థర్డ్ పంపు రిపేరు పనులు అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టలేదు. 2018 నుంచి రెండు పంపులు మాత్రమే పనిచేస్తుండగా... కేవలం ఒకే పంపు ను ఉపయోగిస్తూ... మరో పంపును స్పేర్ లో ఉంచుకొని నీటిని ఎత్తిపోస్తూ వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి మంత్రి పదవి చేపట్టిన తర్వాత చిన్న గోపులాపూర్ థర్డ్ పంప్ విషయం గురించి అధికారులు మంత్రికి వివరించగా అప్పటికప్పుడు ఆగమేఘాల మీద సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి థర్డ్ పంప్ రిపేర్ విషయం గురించి చర్యలు తీసుకున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించిన వెంటనే 5.88 కోట్ల రూపాయలతో థర్డ్ పంపు నకు సంబంధించిన సామాగ్రి, సాఫ్ట్వేర్ అప్ గ్రేడేషన్ చేయిస్తూ రిపేర్ పనులు పూర్తి చేసుకొని శనివారం రోజు విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. పంపు మరమ్మత్తులు విజయవంతం కావడంలో ప్రత్యేక కృషి చేసిన ఇరిగేషన్ అధికారులకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. చిన్న గోపులాపూర్ లిఫ్ట్ వద్ద మూడు పంపులు ఒక్కొక్కటి 650 క్యూసెక్కుల సామర్థ్యంతో పనిచేసేవి ఉండగా ఒకేసారి రెండు పంపులను ఆన్ చేసి మూడో పంపును అత్యవసర సమయాల్లో వినియోగించేలా అప్పటి సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిజైన్ చేసింది. అయితే మూడో పంపు చెడిపోవడంతో 2018 నుంచి ఒకే పంపును మాత్రమే ఉపయోగిస్తూ... మరోపంపును స్పేర్ లో ఉంచి నెట్టు కొచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి వచ్చిన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకొని సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆగమేఘాల మీద దాదాపు 6 కోట్ల రూపాయలు వెచ్చించి మూడో పంపు రిపేర్ తో పాటు సాఫ్ట్వేర్ అప్ డేట్ చేయించారు. చిన్న గోపులాపూర్ థర్డ్ పంప్ రిపేర్ చేయించిన మంత్రి వాకిటి శ్రీహరికి, సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు సీఎం రేవంత్ రెడ్డికి నియోజవర్గ ప్రజలు రైతులు ధన్యవాదాలు చెబుతున్నారు. మఖ్తల్ నియోజకవర్గంను సస్యశ్యామలం చేసి, మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్ళేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.లక్ష్మారెడ్డి మాజీ జెడ్పిటిసి సభ్యులు, బి.గణేష్ కుమార్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వల్లంపల్లి లక్ష్మణ్ మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఏ. రవికుమార్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కావలి ఆంజనేయులు, కల్లూరి గోవర్ధన్ యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు, రాములు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాస్ నవభారత సాక్షారత్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**వెల్దండ, మార్చి 29 (జనంసాక్షి) :** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో వయోజనుల కోసం ఉల్లాస్ నవభారత సాక్షరత పరీక్షా కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక)జీ.వి శ్యాం ప్రసాద్ లాలు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఈ సమాజానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, ప్రతీ కుటుంబం కనీస విద్య పొందాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్డిఏ, డిపిఎం శ్రీనివాస్, ఏపిఎం సంతోష్ , గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ, ఉపసర్పంచ్ చెన్నోజు. ప్రసాద్ చారి,మహిళా సంఘం వీవోఎలు గంగాపురం జంగమ్మ, కాటిక పద్మ, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# 30న దేశవ్యాప్తంగా విశ్రాంత బొగ్గు కార్మికుల ధర్నా

- సింగరేణి విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం



హనుమకొండ ప్రతినిధి మార్చి 29 (జనం సాక్షి ) :బొగ్గు పరిశ్ర మలల్లో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికులు తమ పెన్షన్ పెరుగుదల మరియు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న ఢిల్లీలో తల పెట్టిన దర్నా విజయవంతం చేయాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాదర్ల ప్రకాష్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.1998 నుండి పెన్షన్ అమలు, వాస్తవంగా దాదాపు 20 సంవత్సరాల కాలము గడిచిన పెన్షన్లో ఎలాంటి పెరు గుదల లేదు, కావున కు పెంచాలి తక్షణమే కనీస పెన్షన్ 15,000 రూపాయలకు పెంచాలి. డీఏ కూడిన 50% పెన్షను అమలు చేయడం డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమ సింగరేణిలో కూడా ఇప్పటివరకు నెలవారి పెన్షన్ 500 నుంచి రూ.1000 తీసుకున్న వారి సంఖ్య దాదాపు 10 వేల మంది ఉన్నారని అన్నారు 30వ తేదీ తలపెట్టే మహాధర్నా కార్యక్రమాన్ని విశ్రాంతి సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ నలబాల దామోదర్ హాసన్ విశ్రాంతి సింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థానాల్లో పాలిటెక్నిక్ విద్యార్థులు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్
- వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు





వరంగల్ బ్యూరో, మార్చి 29 (జనం సాక్షి) : వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ , గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి, ఎన్పీడీసీఎల్ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి, త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని చెప్పారు.రూ.28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు.తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని, తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని, ఆ ప్రేరణతోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని, నైపుణ్యమే విజయానికి మూలమని పేర్కొన్నారు. ఏఐ మనుషులను భర్తీ చేయదని, కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఇ.వి. శ్రీనివాస్‌రావు , కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్, సంగీత కళాశాల బృందం, పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# జనహిత సేవా సమితి సేవలు హర్షణీయం

- మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్



బెల్లంపల్లి, మార్చ్ 29 (జనంసాక్షి) : జనహిత సేవా సమితి సేవలు హర్షనీయమని బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో సదశయా ఫౌండేషన్ సహకారంతో జనహిత సేవా సమితి 9 వ వార్షికోత్సవం సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన నేత్ర, అవయవ, శరీర దాన అవగాహన సదస్సు, అంగీకార పత్రాల స్వీకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్వామి వివేకానందుని చిత్ర పటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జనహిత సేవా సమితి వ్యవస్థాపక సభ్యులు గాడెపు దామోదర్, సభ్యులు ఆడేటి శ్రీనివాస్, 13 మంది నేత్రదాతలని స్మరించుకుంటు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్బంగా చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ మాట్లాడుతూ మనిషి మరణానంతరం మానవ శరీర భాగాలు వృధా చేయకుండా నేత్ర అవయవ శరీర దానానికి ముందుకు రావాలని ప్రజలని కోరారు. నేత్ర, అవయవదానం కోసం జనహిత సేవా సమితి చేస్తున్న కృషి, 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవలలు హర్షనీయమన్నారు. నెల రోజుల వ్యవధిలో బెల్లంపల్లి పరిసరాల్లో నేత్రదాతలు బింగి అశోక్ కుమార్, కొట్టే సత్యప్రకాష్, లింగంపల్లి వర్శిత, ఆయిల్ల మల్లేష్ కుటుంబ సభ్యుల స్పూర్తితో నాలుగు నేత్రధాన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో సుమారు 200 మంది నేత్ర, అవయవ దానానికి అంగీకారం తెలుపగా వారిని అభినందిస్తూ డోనర్ కార్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, సదశయా ఫౌండేషన్ అధ్యక్షుడు టి శ్రవణ్ కుమార్, వాసన్ ఐ బ్యాంక్ సీనియర్ మేనేజర్ అరవింద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ సింగ్, సాయి నిధి దెవలపర్లు రహీమ్ బాయ్, సదశయా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగ మూర్తి, జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి, వాసన్ ఐ బ్యాంక్ టెక్నిషన్ కిరణ్, తిలక్ వాకర్స్ అధ్యక్షుడు రంగ రామన్న, అమ్మ ఒడి ఎన్జిఓ హనుమాండ్ల మధుకర్, జనహిత సభ్యులు, నేత్ర అవయవ దాతలు, ప్రజలు పాల్గొన్నారు.

# వైద్యుల కొరత ఉన్నా సేవలకు కొరత లేదు

- జిల్లాలో పశువులకు సరిపడా అందుబాటులో మందులు
- విధి నిర్వహణలో ఎప్పుడూ అప్రమత్తమే..
- తగినంత సిబ్బంది లేకపోయినా విధుల్లో ముందడుగే..
- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రాథోడ్ రామారావు



ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంవర్ధక శాఖ ఆసుపత్రులలో వైద్యుల కొరత అరకొరగా ఉన్నప్పటికినీ పశువులకు ఎప్పుడు ఏ వ్యాధి సోకిన చికిత్స అందించడం కోసం సిబ్బంది అందుబాటులో ఉండి ఆసుపత్రులలో పశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పశువులకు చికిత్స అందించడమే మా లక్ష్యం అని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ రామారావు జనంసాక్షి దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

**జనంసాక్షి :** జిల్లా వ్యాప్తంగా ఎన్ని పశు సంవర్ధక శాఖ దవఖానాలు ఉన్నాయి?

**డాక్టర్ :** జిల్లాలో మొత్తం 37 పశు సంవర్ధక శాఖ దవఖానాలు ఉన్నాయి.

**జనంసాక్షి :** మొత్తం ఎంత మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు?

**డాక్టర్ :** ఈ దవఖానాలలో మొత్తం పద మూడు మంది వైద్యులు ప్రతీరోజూ పశు వులకు వైద్యం అందిస్తున్నారు. వీరిలో ఒకరు కాంట్రాక్టు పద్ధతిలో అన్నారు.

**జనంసాక్షి :** జిల్లాలో మొత్తం ఎన్ని రకాల పశువులు ఉన్నాయి.

**డాక్టర్ :**జిల్లాలో మొత్తం మూడు లక్షల నలబై ఎనిమిది వేల గేదెలు,ఆవులు,ఎద్దులు అదేవిధంగా రెండు లక్షల తొంబై ఐదు వేల గొర్రెలు, మేకలు అందుబాటులో ఉన్నాయి వీటన్నిటికీ ఎప్పుడు వైద్యం అందిస్తూ వస్తున్నాము.

**జనంసాక్షి :** పశువులకు వైద్యం అందించేందుకు పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నారా?

**డాక్టర్ :** లేదు. జిల్లా వ్యాప్తంగా ఇరవై రెండు మంది వైద్యులు అవసరం కాగా ఉన్నది కేవలం పద మూడు మంది మాత్రమే. అందులో ఒకరు కాంట్రాక్టు వైద్యులు. పూర్తి స్థాయిలో వైద్యులు లేని కారణంగా కొంత మేర ఇబ్బంది పడుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు పశువులకు మెరుగైన వైద్యం అందిస్తూ వస్తున్నాము.

**జనంసాక్షి :** పశువులకు ఏ ఏ రకాల వ్యాక్సినేషన్‌లు అందిస్తున్నారు.

**డాక్టర్ :** కాలాన్ని బట్టి పశువులకు ఎటువంటి వైరస్ లు సోకకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పలు రకాల వ్యాక్సినేషన్ కార్య క్రమాలు చేపడుతూ వస్తుంది. దాని ఆధారంగా జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నాం అందులో పీపీఆర్, గోట్ పాక్స్, షీప్ పాక్స్, నీలి నాలుక, ఈటి, గాలికుంటు, గొంతు వాపు, లంపి స్కిన్, జబ్బ వాపు ఇలాంటి వ్యాధులకు నివారణ టీకాల కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నాం.

**జనంసాక్షి :** పశువులకు సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా?

**డాక్టర్ :** పశువులకు ఎలాంటి వ్యాదులు సోకిన వాటిని నయం చేయడానికి జిల్లా వ్యాప్తంగా పశు సంవర్ధక దవఖానాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

**జనంసాక్షి :** కొత్త దవఖానాలకు ప్రభుత్వానికి ఏమైనా ప్రతి పాదనలు పంపారా?

**డాక్టర్ :** శిధిలావస్థలో ఉన్న దవఖానలను గుర్తించి వాటి స్థానంలో కొత్త ఆసుపత్రులు నిర్మించాలని గతంలోనే ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. అదే విధంగా జిల్లా కలెక్టర్లకు కూడ గుర్తు చేస్తూ వస్తున్నాము.

**జనంసాక్షి :** జిల్లాలో తగిన సిబ్బంది ఉన్నారా?

**డాక్టర్ :** పూర్తి స్థాయిలో సిబ్బంది లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా వ్యాక్సినేషన్ టీకాల కార్యక్రమాల సమయాలలో సిబ్బంది కొరత ఏర్పడుతుంది. అలాంటప్పుడు అందుబాటులో ఉన్న గోపాల మిత్రాల సహాయం తీసుకోవాల్సి వస్తుంది.



## ఆధ్యాత్మికతతో ఐకమత్యం

- రిటైర్డ్ జడ్జి న్యాయమూర్తి బత్తుల సత్తయ్య

పాలకుర్తి, మార్చి 29 (జనంసాక్షి) : ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ఐకమత్యం పెరుగుతోందని రిటైర్డ్ జడ్జి న్యాయమూర్తి బత్తుల సత్తయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తయ్య హాజరై మాట్లాడారు. గ్రామస్తులు. యువత ఐకమత్యంతో ఉండి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అలయాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిర్రు సోమేశ్వర్, అశోక్, కూస భాస్కర్, గోనె మహేందర్, సీపీఎం నాయకుడు మదార్ తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఆస్ట్రియా దేశస్తుడు



ములుగు/వెంకటాపూర్,మార్చి29(జనం సాక్షి): వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని అదివారం రామప్ప దేవాలయం ను అస్ట్రియా దేశానికి చెందిన సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్లు తీర్థప్రసాదాలు అందజే శారు.రామప్ప చరిత్ర శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.వారి వెంట టూరిస్ట్ పోలీసులు బద్రు, దశరథం, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య



చెన్నూర్ మార్చి 29 (జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా చెన్నూరులోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రాళ్లబండి శ్రీవింధ్య(13) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గంగారం గ్రామానికి చెందిన రల్లాబండి రమేష్, చంద్రకళల కుమార్తె అయిన ఆమె, నాలుగో తరగతి నుంచి అదే పాఠశాలలో చదువుతోంది. ఆమె సోదరి శ్రీజ కూడా అక్కడ ఆరవ తరగతి చదువుతోంది. గత బుధవారం సాయంత్రం శ్రీవింధ్య వాంతులు చేసుకోవడం ప్రారంభించడంతో, పాఠశాల సిబ్బంది ఆమెను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మరుసటి రోజు బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు, మరియు సిబ్బంది వచ్చిన వెంటనే వెళ్లిపోయారు. ఆమె పరిస్థితి విషమించడంతో నిన్న మంచిర్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆమె విషం సేవించిందని అనుమా నించి, విద్యార్థినిని అడగ్గా, ఆమె అసలు విషయం వెల్లడించింది. ఆమె ఈరోజు ఉదయం 6 గంటలకు కన్నుమూశారు. పాఠశాల సిబ్బంది వేధింపుల కారణంగానే బాలిక ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకు పంచుతాం

- ఏప్రిల్ ఒకటి నుండి ఇంటింటికి సిపిఐ కార్యక్రమం
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




హనుమకొండ ప్రతినిధి మార్చి 29 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లాలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను పేదలకు పంచుతామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బాషబోయిన సంతోష్ అధ్యక్షతన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములను కొందరు స్వాధీనం చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో పేదల అసైన్డ్ భూములను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారని, వాటిని అధికారులు రద్దు చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి పేదలు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. ఏ. స్టాలిన్,కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం,కొట్టెపాక రవి, యేషబోయిన శ్రీనివాస్, నకీర్త ఓదెలు,జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి పాల్గొన్నారు.

# బాలికలపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి




- బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్

నిర్మల్ బ్యూరో, మార్చి, (జనంసాక్షి) నిర్మల్ జిల్లాలో హిందులపై జరుగుతున్న వరుస దాడులు, అత్యాచారాల పట్ల సదరు నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. పట్టణంలో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నిన్న నిర్మల్ బంద్ కు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిస్తే, పట్టణంలో బంద్ కొనసాగుతుండగానే పట్టణంలోని సోఫీ నగర్ లో నిన్న కొందరు మైనార్టీ వర్గానికి చెందిన దుండగులు మైనర్ బాలికలపై అత్యాచారానికి పాల్పడటం హేయమైన చర్య. అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబ సభ్యులను నేడు బీజేపీ నాయకులు పరామర్శించారు. నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా ఒత్తిడి తెస్తామని అన్నారు. జిల్లా ఎస్పీ గారు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండే విధంగా, ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడే విధంగా నిందితులను శిక్షించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, పట్టణ బీజేపీ నాయకులు వోడ్నల రాజు, తో పాటు హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ పసివాడు చిచ్చరపిడుగు!

- ప్రస్తుతం చదువుతున్నది నర్సరీ..
- దేశాలు, రాష్ట్రాలు, ఎనిమల్స్, పర్వతాలు, వెజిటేబుల్స్, ప్లానెట్స్, కలర్స్, పక్షులు, లీడర్ల పేర్లు అవలీలగా చెబుతాడు
- కలామ్స్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ సాధించిన కృతి కాంత్ నాయక్



వరంగల్ బ్యూరో, మార్చి 29 (జనం సాక్షి) : పిట్ట కొంచెం.. కూతగనం అన్నట్లుగా ఈ పసివాడి తెలివితేటలు అపారమైనవి.. ఏది విన్న ఏది చూసినా ఇట్టే పసిగట్టి వాటిని వెంటనే గుర్తుంచుకునీ తిరిగి అవి ఏమిటో అవలీలగా చెప్పే జ్ఞానం ఈ పిల్లవాడికి ఉంది. ఇంత చిన్న వయసులో అంతటి జ్ఞాపక శక్తిని కలిగి ఉండడమే కాకుండా అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఏది అడిగినా కూడా వెంటనే సమాధానం చెబుతూ అందరిని ఆశ్చర్యానికి గురి చేయడం జరుగుతుంది. వరంగల్ నగరంలోని హనుమకొండ ప్రాంతానికి చెందిన గుగులోతు కృష్ణ కాంత్, ప్రియాంక దంపతుల కుమారుడు గుగులోతు కృతి కాంత్ నాయక్ స్థానిక వరంగల్ పబ్లిక్ స్కూల్లో నర్సరీ చదువుతున్నాడు. బాలుడి అపారమైనటువంటి జ్ఞానాన్ని గుర్తించినటువంటి కలాంస్ వరల్డ్ రికార్డ్ వారు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ సర్టిఫికెట్ గత నెల 25న అందించారు. బాలుడు గుగులోతు కృతి కాంత్ నాయక్ 18 రాష్ట్రాల పేర్లు, 30 జంతువుల పేర్లు, 55 దేశ పతాకాల పేర్లు, 22 పర్వతాల పేర్లు, 1 నుంచి 100 వరకు నంబర్స్, 31 పండ్ల పేర్లు, 32 వెజిటేబుల్స్ పేర్లు, 16 నేషనల్ సింబల్స్ పేర్లు, 20 వాహనాల పేర్లు, 9 గ్రహాల పేర్లు, 15 రంగుల పేర్లు, 26 ఆల్ఫాబెట్స్ పేర్లు, 10 షేప్స్, 24 ఆపోజిట్ గురించి, 22 పక్షుల పేర్లు, 15 మంది లీడర్ల పేర్లను ఏకధాటిగా అవలీలగా చెప్పడం ఈ బాలుడి గొప్ప తనానికి నిదర్శనం. చిన్న ప్పటినుండే ఈ బాలుడులో ఒక గొప్ప జ్ఞాపకశక్తి, చూసిన, విన్న ఏ అంశం పైన కూడా న ం నా య నా న ం గా మనసులో గుర్తుపెట్టుకునే విధంగా ఒక అద్భుతమైన శక్తి నిక్షిప్తమై ఉంది. నర్సరీ చదువుతూనే ఇంతటి జ్ఞానాన్ని ఇప్పుడే కలిగి ఉండడం అందర్నీ ఆశ్చర్య చెక్కితులను చేస్తుంది. ఇందుకు వీరన్న, కవిత ప్రోత్సాహం ఎంతో ఉందని బాలుడు తల్లిదండ్రులు చెబుతున్నారు. తమ పిల్లవాడికి ఇంత చిన్న వయసులోనే అంత జ్ఞాపకశక్తి ఉండడం తమకేంతో సంతోషాన్ని ఆనందాన్ని కలిగిస్తుందని అంటున్నారు. ముందు ముందు మరింత జ్ఞాన సంపాదన పెంచు కుంటూ ఇటు చదువు లోనూ అటు అన్ని రంగాలలో ముందుకు వెళ్తాడని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బాలుడి మామ సందీప్ నాయక్, కుటుంబ సభ్యులు బంధువులు, శ్రేయోభిలాషులతో పాటు పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు అందరూ బాలుడినీ అభినందిస్తున్నారు.






జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
30 మార్చి 2026

# మణుగూరు ఏరియా పీకే ఓసి 2లో ప్రమాదం..

- ఒక వ్యక్తి మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలు..
- మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కార్మిక సంఘాల డిమాండ్
- రక్షణ సూత్రాలు పాటించని ఓబీ కంపెనీలు...



**మణుగూరు, మార్చి 29 (జనం సాక్షి) :** మణుగూరు ఉపరితల గని విపిఆర్ (దుర్గ) ఓబీ కంపెనీలో టైరు పేలిన సంఘటనలో ఒకరి మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. వారిని వెంటనే సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. ఏరియా ఆసుపత్రిలో మృతుని సందర్శించిన జిఎం దుర్గం రామచందర్ కార్మిక సంఘాల నాయకులు. వివరాల్లోకి వెళ్తే మణుగూరు ఏరియా పీకే ఓసి 2 లో విపిఆర్ (దుర్గ)ఓబీ కంపెనీలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు దుర్ఘటన చోటు చేసుకుంది ఆగిపోయిన డంపర్ టైర్ విప్పే క్రమంలో ప్రమాదవశాత్తు టైరు పేలిన సంఘటనలో బీహార్ కి చెందిన టైర్ ఫిట్టర్ మహమ్మద్ సర్ఫేజ్ (40) తీవ్రంగా గాయపడగా సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు క్షతగాత్రుని పరీక్షించిన వైద్యులు సర్ఫరాజ్ చనిపోయినట్టుగా ధ్రువీకరించారు. సాహెబ్ లాల్ యాదవ్ (50) జగదీష్ కుష్వాల్(50) మంతూ కుమార్(30) మొహమ్మద్ తాజ్ అన్సారీ (28)లు గాయపడగా సాహెబ్ లాల్ యాదవ్ ను మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే హుటాహుటిన ఏరియా జిఎం దుర్గం రామచందర్, పీకే ఓసి ప్రాజెక్ట్ రమేష్, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, అధికార ప్రతినిధి ఎస్ రమేష్, సెక్యూరిటీ అధికారి ఎం శ్రీనివాస్ ఇతర అధికారులతో కలిసి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మృతుని భౌతిక కాయాన్ని సందర్శించారు అనంతరం గాయాల పాలైన ఓబి వర్కర్లను సందర్శించి వారికి ధైర్యం చెప్పారు మెరుగైన వైద్యం అందించాలని సింగరేణి వైద్యులు జ్యోతిర్మయిని,డాక్టర్లను ఆదేశించారు అవసరమైతే హైదరాబాద్ తరలించి వారు త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు,

**మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి**

బ్రతుకుతెరువు కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి మృత్యువాత పడ్డారు. నిబంధన ప్రకారం మృతుని కుటుంబానికి బ్యాంకు భీమా నలభై లక్షలతో పాటు అదనంగా ఓబి యాజమాన్యం కూడా ఎక్స్ గ్రేషియా కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలనీ డిమాండ్ చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందజేయాలనీ, ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఇలాంటి ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని, ఓబి కంపెనీలలో కూడా పూర్తి స్థాయిలో ఎస్ఓపి అమలు చేయాలని నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ఓపి వర్కర్లు పెద్ద ఎత్తున ఏరియా ఆసుపత్రి చేరుకున్నారు. ప్రమాద సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సందర్శించిన వారిలో ఏరియా గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు వై రాంగోపాల్, మేకల ఈశ్వర్ ,ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వర్ గట్టయ్య, షేక్ అబ్దుల్ రవూఫ్, సిఐటియు నాయకులు మందా నరసింహారావు, వి వెంకటరత్నం, ఐ ఎఫ్ టి యు నాయకులు యస్ డి నా సర్ పాషా, అంగోత్ మంగీలాల్, టీబీజీకేస్ నాయకులు నాగేల్లి వెంకట్, హెచ్ ఎం ఎస్ నాయకులు శ్రీలత, మస్తాన్ బి ఎం ఎస్ నాయకులు, బి కిషన్ తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎస్పీ ప్రసన్నకుమార్



**మద్దిరాల, మార్చి 29 (జనంసాక్షి) :** తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని మద్దిరాల పోలీస్ స్టేషన్ ను ఆదివారం సూర్యాపేట డీస్పీ ప్రసన్న కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల వివరాలు పరిశీలించారు పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాలపై మండలంలోని అన్ని గ్రామాలలో ప్రధాన కూడలిలో అవగాహన కల్పించాలని వారు ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎస్సై వీరన్న, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సారా అమ్మకాలను ఆపాలి



**నాంపల్లి, మార్చి 29 (జనం సాక్షి) :** మండల పరిధిలో పలు గ్రామాల్లో గుడుంబా గుప్పుమంటుంది, ఎమ్మెల్యే మాటను బేఖాతరు చేస్తూ అన్ని గ్రామాలలో బెల్ట్ షాపులు జోరుగా నడుస్తునాయి.సంబంధిత అధికారులకు ప్రజల ఆరోగ్యం గురించి పట్టింపు లేకుండా పోయింది. ఎమ్మెల్యే చెపితే మాకేంటి,మా రూట్ సపరేట్ అన్నట్టు బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్న మండల ఎక్సైజ్ శాఖ, ప్రజల ఆరోగ్యానికి బాట వేసే పని మరిచి , వసూల వేట లో పడ్డారు అని మండలంలో గుసగుసలు వినిపిస్తునాయి.వీటిని చూస్తూ భరించలేని నాంపల్లి మండల మహిళ సంఘాల సభ్యులు అందరు కలిసి నాంపల్లి సబ్ ఇన్స్పెక్టర్ కె. లింగారెడ్డి కి అభ్యర్థన పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు మాట్లాడుతూ మండలంలోనీ పలు గ్రామాల్లో, నాంపల్లి మండల కేంద్రంలో బెల్ట్ షాపులు, గుడుంబా అమ్మకాలు జోరుగా నడుస్తున్నాయి,వీటి వలన మహిళాల మీద అఘాయిత్యాలు,భర్తలు తాగి వచి భార్యలను శారీరకంగా మానసికంగా హింసకు గురిచేస్తున్నారు.చిన్న వయసులో యువత తాగుడికి బానిస అయి వారిని నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.ఈ గుడుంబా ,బెల్ట్ షాపులను అరికట్టి వారి కుటుంబాలు,ప్రజల ఆరోగ్యాని కాపాడాలి అని సబ్ ఇన్స్పెక్టర్ ని కలిసి మెమొరాండం అందించమని,సబ్ ఇన్స్పెక్టర్ తక్షణమే చర్యలు తీసుకుంటాము అని హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షురాలు బిరుదోజు యాదమ్మ,మహిళ సమాఖ్య కోశాధికారి, పోలోజు. అరుణ, వివోఏ ల మండలం అధ్యక్షురాలు, అరుణ,ఎస్ కె. సైదాబేగం, ప్రమీల, మంజుల, సుజాత, పరమేశ్వరి , జయమ్మ, ముత్యపమ్మ, అంజమ్మ, కల్పన, ఉష, సుహాసిని, స్వాతి, సుగుణమ్మ, ఎల్లమ్మ, కోటేశ్వరి, దేవి, నవనీత,బిస్మిల్లా, శ్రీజ, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యం చేరాలి..



**చింతకాని, మార్చి 29 (జనం సాక్షి) :** వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యం చేరాలి అని వైరా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. ఆదివారం నేరడ గ్రామపంచాయతీ సర్పంచ్ దూసరి. నేతాజీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి పై ఆయన కుటుంబ సభ్యులు ఆధారపడి జీవిస్తారని అలాంటి వ్యక్తి రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదవశాత్తు జరగరానిది జరిగితే ఆ కుటుంబం మొత్తం రోడ్డు పడాల్సిన అవసరం వస్తుందని అందుకు కావలసిన జాగ్రత్తలను పాటిస్తే ప్రమాదాలకు స్థానం లేకుండా చేయొచ్చని ఆయన కోరారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే అరైవ్-- అలైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం, సేఫ్ అండ్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అనుసరించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రజలు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వర్వరావు గ్రామ పెద్దలు ఆలశ్యం వెంకయ్య ,మెడ బాబు నున్న వీరయ్య,ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్టా కాలేష్ ట్రాక్టర్ అసోసియేషన్ సైద ,రాగం లింగ బాబు.మట్ట రవి వార్డ్ మెంబర్స్ అమాడల్ వెంకటేశ్వర్లు సీపీఐ గ్రామ కార్యదర్శి ఎస్కే దస్తగిరి .గుణగుంట్ల వెంకన్న ,గోగుల ఆదినారాయణ, పంచాయతీ సెక్రటరీ అర్జున్ తో పలువురు గ్రామ స్థులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజా మార్గం



**తుంగతుర్తి మార్చి 29 (జనం సాక్షి) :** రాజీ మార్గమే రాజ మార్గమని, ఒక కేసులో రాజీ పడటం వల్ల ఇరువర్గాలు ఆ కేసులో గెలిచినట్లే అని తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి ఎండి.గౌస్ పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొని మాట్లాడారు. పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, చిన్న చిన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమస్యలు పరిష్కరించుకొని స్నేహంగా ఉండాలన్నారు. ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తికీ జీవించే హక్కు, సమానత్వపు హక్కు ఉందని, వాటికి భంగం కలిగినప్పుడు కోర్టును ఆశ్రయించాలని తెలిపారు. నేటి సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత విజ్ఞానాన్ని పెంచుకునేందుకు వినియోగించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు వినియోగించవద్దని తెలిపారు. ఈ సందర్భంగా 54 కేసుల్లో 53 క్రిమినల్ కేసులు, సివిల్ ఒక కేసు పరిష్కారం చేయగా రూ.4.50 లక్షల జరిమానా విధించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 584, ఈపీటీ కేసులు 781 పరిష్కారం కాగా రూ.1,38,810 జరిమానా విధించారు. సైబర్ క్రైమ్ 2 కేసులో రూ.83వేలు, రూ.32,800 రికవరీ చేసి బాధితులకు ఇప్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్, న్యాయవాదులు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేయాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**నాంపల్లి, మార్చి 29 (జనం సాక్షి) :** డిండి ఎత్తిపోతల పథకం ప్రభుత్వం సత్వరమే పూర్తి చేయాలి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో ఆదివారం సిపిఐ పార్టీ మండల కౌన్సిల్ సమావేశం పార్టీ కార్యాలయంలో ఏ ఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేసి దేవరకొండ మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయాలని, పాలమూరు, రంగారెడ్డి, ప్రాజెక్టుకు 440 అడుగులు, ఢిండి ఇచ్చే కెనాల్ 436.7 అడుగులు దీనివల్ల 11 అడుగుల తేడా వస్తుంది దీనివల్ల డిండి ప్రాజెక్టుకు నీరు తక్కువ వచ్చే అవకాశం ఉన్నాయి, కాబట్టి వ్యత్యాసం లేకుండా ప్రాజెక్టు పనులను సమాంతరంగా కెనాల్ తీసి రైతులకు సాగునీరు అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు గాని, ఆసరా పెన్షన్లు, అర్హులైన పేదలకు అందించాలి.అనంతరం ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో మండలంలోని రాందాస్ తండా గ్రామపంచాయతీ రాయి కుంట తండా ప్రజలు, మెగావత్ బీముడు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, వడ్త్యా బాలాజీ,మెగావత్ సందీప్,మెగావత్ పవణ్,మెగావత్ బీమా,కొర్ర మున్నా సిపిఐ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి, సిపిఐ మండల కార్యదర్శి సుదన బోయిన రమేష్, మండల సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, ఊరి పాక వెంకటయ్య, దండిగా వెంకటయ్య, నాయకులు గిరి స్వామి, బుషిపాక యాదయ్య, ఉప సర్పంచ్, అగ్గిరాజు, దామెర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ ఆమోదం

- ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదించిన సభ్యులు
- మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ



**దేవరకొండ, మార్చి 29 (జనం సాక్షి) :** దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో మొదటి పాలక వర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ రావు, చైర్ పర్సన్ పున్న శైలజ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో, మౌలిక వసతులు కల్పించడంలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని 2026 - 27 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ప్రభుత్వ గ్రాంట్ కలుపుకొని మున్సిపల్ ఆదాయం 51 కోట్లు 90 లక్షల 79,వేల రూపాయలు మరియు 2026 - 27 బడ్జెట్ అంచనా ఖర్చు 55 కోట్ల 25 లక్షల 39 వేల బడ్జెట్ను నిర్ణయించారు. బడ్జెట్ ద్వారా పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రోడ్లు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిల్ సభ్యులు వైస్ చైర్మన్ తో ఏకగ్రీవంగా మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ ఆమోదం తెలిపారు.ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 7,624 కేసుల పరిష్కారం

- ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లక్ష్యం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 29 (జనం సాక్షి) :** ఈ నెల 28-03-2026 న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కేసులను వేగవంతంగా పరిష్కరించడంలో పోలీస్ శాఖ, న్యాయ విభాగం మరియు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో విశేష ఫలితాలు సాధించబడినవి. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈ లోక్ అదాలత్ నిర్వహించబడిందిని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మొత్తం 7,624 కేసులు విజయవంతంగా పరిష్కరించబడినవి. వాటి వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ మాట్లాడుతూ,జాతీయ లోక్ అదాలత్ వంటి కార్యక్రమాలు ప్రజలకు త్వరిత న్యాయం అందించడంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా కోర్టులపై భారం తగ్గించడంతో పాటు, ప్రజల సమయం మరియు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు.అదేవిధంగా, ప్రజలు తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి పొందగలరని, భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందని జిల్లా ఎస్పి అభినందించారు.

## వేగంగా మహిళా శక్తి భవన నిర్మాణం పనులు



**కోదాడ టౌన్, మార్చి 29 (జనం సాక్షి) :** ఆదివారం గుడిబండ గ్రామంలో స్త్రీ శక్తి భవనానికి గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన స్లాబు పోయించే కార్యక్రమానికి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమాటి వరప్రసాద్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇర్ల నరసింహారెడ్డి సర్పంచ్ నాగయ్యలు మాట్లాడుతూ ఈ భవనం మహిళా సంఘాల సమావేశాలు,శిక్షణ,వారి ఉత్పత్తుల మార్కెటింగ్ మరియు కామన్ వర్క్ షెడ్‌ల కోసం ఈ భవనాలను ఉపయోగిస్తారని అలాగే కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆశీస్సులతో మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో గుడిబండ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని వారి కి విధేయత చూపించి గుడిబండని అత్యున్నత స్థానంలో నిలబెడతానని తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ జయసింహారెడ్డి వార్డ్ మెంబర్ కుక్కడపు ఖాజా,భూక్య సక్రు,వంశీ,ప్రేమ్చంద్,సుహాసిని, రోజా,ఓరుగంటి రమాదేవి, కుకడపు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# డెలివరీ బాయ్‌పై బీజేపీ నాయకుడి దౌర్జన్యం

- పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కార్మిక సంఘాల డిమాండ్



**చందూరు, మార్చి 29 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా చందూరు మండల కేంద్రంలో గ్యాస్ డెలివరీ బాయ్‌పై జరిగిన దౌర్జన్యం స్థానికంగా కలకలం రేపుతోంది. డెలివరీ బాయ్‌ను దూషించడమే కాకుండా, అతని ఉద్యోగం తీయించిన బి.జె.వై.ఎం నాయకుడు పిన్నింటి నరేందర్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ డిమాండ్ చేసింది.ఆదివారం చందూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పుల్లెంల గ్రామానికి చెందిన బి.జె.వై.ఎం నాయకుడు నరేందర్ రెడ్డి ఇంటికి నగేష్ గౌడ్ అనే డెలివరీ బాయ్ గ్యాస్ సిలిండర్ ఇవ్వడానికి వెళ్లారు. ఆ సమయంలో నరేందర్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా అదనపు సిలిండర్ కావాలని డిమాండ్ చేశారు.యాజమాన్యంతో మాట్లాడి ఇస్తానని చెప్పిన నగేష్‌పై నరేందర్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, తన రాజకీయ బలంతో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి నగేష్‌ను ఉద్యోగం నుండి తొలగించేలా చేశారు.గతంలోనూ ఇదే విధంగా లింగయ్య అనే మరో డెలివరీ బాయ్‌ను వేధించి, అతని ఉద్యోగం పోవడానికి నరేందర్ రెడ్డి కారణమయ్యారని నాయకులు ఆరోపించారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన కార్మికులపై ఇలాంటి రాజకీయ దౌర్జన్యాలు చేయడం అమానుషం. - డెలివరీ బాయ్స్‌ను వేధిస్తున్న నరేందర్ రెడ్డిని వెంటనే బీజేపీ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి.అన్యాయంగా ఉద్యోగం కోల్పోయిన నగేష్ గౌడ్‌కు వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలి.ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోకపోతే, జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మరియు డీఎస్పీకి ఫిర్యాదు చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# సెన్సెక్స్ 1,690 పాయింట్లు, నిఫ్టీ 487 పాయింట్లు పతనం

- మిడిల్ ఈస్ట్ యుద్ధ ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ఒత్తిడి
- ఈ నెలలో FPIలు రికార్డు ₹1.14 లక్షల కోట్ల విక్రయాలు
- మార్కెట్ క్యాపిటలైజేషన్ ₹9 లక్షల కోట్ల నష్టం



**న్యూఢిల్లీ, మార్చి 29 (జనంసాక్షి) :** భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ పతనంతో ముగిశాయి. మిడిల్ ఈస్ట్‌లో (యూఎస్-ఇరాన్) యుద్ధ ఉద్రిక్తతలు, పెరిగిన క్రూడ్ ఆయిల్ ధరలు, రూపాయి ద్రవ్య విలువ క్షీణతతో మార్కెట్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగింది.
బీఎస్ఈ సెన్సెక్స్ 1,690 పాయింట్లు (2.25 శాతం) తగ్గి 73,583 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 487 పాయింట్లు (2.09 శాతం) పడి 22,819 వద్ద సెటిల్ అయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,739 పాయింట్లు, నిఫ్టీ 502 పాయింట్ల వరకు పతనం చెందాయి. ఈ పతనంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.9 లక్షల కోట్లు నష్టపోయింది.
ఈ నెలలో ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (FPI) భారీగా విక్రయాలు చేశారు. మార్చి నెలలోనే రికార్డు స్థాయిలో రూ.1.14 లక్షల కోట్లు (సుమారు 12.3 బిలియన్ డాలర్లు) విక్రయించారు. ఇది ఇప్పటి వరకు ఒక్క నెలలోనే అత్యధిక ఔట్‌ఫ్లో. ఈ ఏడాది ఇప్పటివరకు FPIలు మొత్తం రూ.1.27 లక్షల కోట్లు విక్రయించినట్లు డేటా చూపిస్తోంది.
బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 109.9 డాలర్ల వరకు పెరిగింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే 94.82 వద్ద కొత్త లో రికార్డు స్థాయికి పడిపోయింది. ఆటో, బ్యాంకింగ్, పీఎస్‌యూ స్టాకుల్లో భారీ అమ్మకాలు నమోదయ్యాయి. ఈ పరిస్థితులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

# యుద్ధ భయంతో బంగారం ధరలు

- 2030 నాటికి 10 గ్రాముల బంగారం రూ.2 లక్షలు
- ఫండ్స్ ఇండియా సీఈఓ అక్షయ్ సప్రూ విశ్లేషణ
- ఎఫ్‌బిఐ ద్వారా దశలవారీగా కొనుగోలు చేయాలని సలహా
- వెండికి దూరంగా ఉండాలని హెచ్చరిక



**న్యూఢిల్లీ, మార్చి 29 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు అందరి దృష్టి బంగారం మీదే పడింది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో 24 క్యారెట్ బంగారం గ్రాముకు సుమారు రూ.14,800 నుంచి రూ.14,850 రేంజ్‌లో ట్రేడ్ అవుతోంది. నగరాల వారీగా కొద్దిగా తేడా ఉండవచ్చు. ఫండ్స్ ఇండియా సీఈఓ అక్షయ్ సప్రూ భారతీయ పెట్టుబడి ధోరణుల్లో వస్తున్న కీలక మార్పులను, బంగారం భవిష్యత్తును విశ్లేషించారు. పెట్టుబడిదారులు ఇప్పుడు పాత పద్ధతులను వదిలి కొత్త దారిలో వెళ్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. 2030 నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.1,68,000 నుంచి రూ.2,25,000 వరకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకుల బంగారు కొనుగోళ్లు, కరెన్సీ అస్థిరత, ప్రపంచవ్యాప్త యుద్ధ వాతావరణం ధరలను రెక్కలు తొడిగిస్తున్నాయి. 2026 నాటికి 24 క్యారెట్ బంగారం 10 గ్రాములు సుమారు రూ.1,48,000 నుంచి రూ.1,50,000 మధ్య ఉండే అవకాశం ఉందని సప్రూ విశ్లేషణలో తెలిపారు. అయితే గడిచిన కొన్నేళ్లుగా బంగారం ఇచ్చినంత భారీ రాబడిని రాబోయే ఐదేళ్లలో ఇవ్వకపోవచ్చని హెచ్చరించారు.

**పెట్టుబడి సలహాలు:**
మీ పోర్ట్‌ఫోలియోలో ఇప్పటికే 5 నుంచి 10 శాతం బంగారం ఉంటే దానిని మార్చాల్సిన అవసరం లేదని సప్రూ సూచించారు. కొత్తగా పెట్టుబడి పెట్టేవారు భారీ మొత్తంలో కాకుండా ఎస్ఐపి ద్వారా దశలవారీగా బంగారం కొనుగోలు చేయడం ఉత్తమం. వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయని, సాధారణ పెట్టుబడిదారులు దానికి దూరంగా ఉండటమే మేలని సలహా ఇచ్చారు.

**మారుతున్న పెట్టుబడిదారుల ఆలోచన:**
గతంలో మార్కెట్ కుప్పకూలితే భయపడి వెనక్కి తగ్గే పెట్టుబడిదారులు ఇప్పుడు మరింత స్పృహతో ఆలోచిస్తున్నారని సప్రూ తెలిపారు. మెట్రో సిటీల నుంచి మాత్రమే కాకుండా చిన్న నగరాల నుంచి కూడా భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. మార్కెట్ పడిపోయినప్పుడు ఆందోళన చెందకుండా కొత్త ఎస్ఐపి రిజిస్ట్రేషన్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతం.

**స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్ టిప్స్:**
రిస్క్ తగ్గించుకుని లాభాలు పొందడానికి డైవర్సిఫైడ్ ఇన్వెస్ట్‌మెంట్ సూత్రాన్ని పాటించాలని సప్రూ సూచించారు. వయస్సు 30 ఏళ్లు ఉంటే డబ్బులో 70 శాతం స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఒకే రంగంపై ఆధారపడకుండా విభిన్న రంగాలలో పెట్టుబడులను విస్తరించడం ద్వారా నష్ట భయాన్ని తగ్గించుకోవచ్చు. భౌగోళిక ఉద్రిక్తతలు మన అదుపులో లేవు కానీ మన పెట్టుబడి మన అదుపులో ఉండాలి. మార్కెట్ పడిపోయినప్పుడు మంచి కంపెనీల షేర్లను తక్కువ ధరకు కొనే అవకాశంగా భావించాలి తప్ప ఆందోళనతో వెనక్కి తగ్గకూడదని ఆయన స్పష్టం చేశారు.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 380 | ₹ 45.60 |
| వరంగల్ | ₹ 382 | ₹45.84 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,48,090 | ₹1,35,750 |
| చెన్నై | ₹1,43,430 | ₹1,36,600 |

**వెండి ధరలు (కేజీ)** హైదరాబాద్ ₹2,50,000

# ప్రజల సంక్షేమమే లక్ష్యం

- తమిళనాడు ఎన్నికలు: డీఎంకే మ్యానిఫెస్టో విడుదల
- మహిళలకు నెలవారీ రూ.2,000 సాయం
- గృహాలు, సంక్షేమ పథకాలపై బలమైన దృష్టి
- యువత, ఆరోగ్యం, విద్యకు కీలక హామీలు



చెన్నై, మార్చి 29: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డీఎంకే పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. మహిళలకు నెలవారీ రూ.2,000 ఆర్థిక సాయం, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల విస్తరణతో పాటు యువత, ఆరోగ్యం, విద్య రంగాల్లో కీలక హామీలు ఇచ్చింది. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఆధ్వర్యంలో విడుదలైన ఈ మ్యానిఫెస్టోలో మహిళల సంక్షేమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం అమలులో ఉన్న మహిళల ఉరిమై తోగై పథకాన్ని విస్తరించి, అర్హులైన మహిళలందరికీ నెలవారీ రూ.2,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఇది కుటుంబాల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడుతుందని పార్టీ నాయకులు తెలిపారు. గృహాలు, సంక్షేమ రంగాలపై కూడా డీఎంకే బలమైన దృష్టి సారించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఇళ్లు అందించే పథకాల విస్తరణ, సామాజిక సంక్షేమ యోజనలు, వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ప్రత్యేక సహాయం వంటి హామీలు ఇచ్చింది.
యువతకు ఉపాధి, విద్యా రుణాల మాఫీ, ఉపాధి హామీ పథకాల విస్తరణ, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలు మ్యానిఫెస్టోలో ముఖ్య స్థానం పొందాయి. డీఎంకే ప్రభుత్వం గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను మరింత విస్తరించి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డీఎంకే ఈ మ్యానిఫెస్టో ద్వారా మహిళలు, యువత, సామాన్యులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇది రాబోయే ఎన్నికల్లో డీఎంకే వ్యూహాత్మకంగా ముందుకు సాగడానికి దోహదపడుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'మేము గెలిచాం, కానీ నిర్ణయం మార్చేశారు'

## జైప్రకాష్ అసోసియేట్స్ బిడ్ రివర్సల్‌పై వేదాంత అనిల్ అగర్వాల్



న్యూఢిల్లీ, మార్చి 29: జైప్రకాష్ అసోసియేట్స్ (జేఏఎల్) ఆస్తుల కోసం జరిగిన బిడ్‌లో తాము అత్యధిక బిడ్డర్‌గా ఎంపికైనా, తర్వాత నిర్ణయం మార్చేశారని వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ స్పష్టం చేశారు. ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ "మేము గెలిచాం, కానీ నిర్ణయం మార్చేశారు" అని అనిల్ అగర్వాల్ అన్నారు. "ఇది పారదర్శక ప్రక్రియ. మేము అత్యధిక బిడ్డర్‌గా ఎంపికైనట్లు రాతపూర్వకంగా తెలిపారు. కానీ జీవితం అంత సరళంగా ఉండదు. కొన్ని రోజుల తర్వాత నిర్ణయం మార్చేశారు. వివరాల్లోకి వెళ్లాలనుకోవడం లేదు. అది సరైన వేదికకు చెందిన విషయం" అని ఆయన తెలిపారు. అదానీ గ్రూప్ ఉన్నత ముందస్తు చెల్లింపు మరియు వేగవంతమైన ప్రాజెక్ట్ టైమ్‌లైన్‌తో బిడ్‌ను గెలుచుకున్నట్లు ఇటీవల నిర్ణయం వెలువడింది. ఈ నిర్ణయాన్ని వేదాంత గ్రూప్ సవాలు చేస్తూ చీజూరులో అప్పీల్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.
అనిల్ అగర్వాల్ భగవద్గీతను ఉద్ధరిస్తూ "ఈ ఆస్తిపై మాకు ఎలాంటి మమకారం లేదు" అని కూడా చెప్పారు. అయినప్పటికీ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, న్యాయం జరగాలని ఆయన భావిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చారు. జైప్రకాష్ అసోసియేట్స్ ఇన్సాల్వెన్సీ ప్రక్రియలో ఆస్తులను కొనుగోలు చేయడానికి వేదాంత్ మరియు అదానీ గ్రూపుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ బిడ్ రివర్సల్‌పై వేదాంత లీగల్ రూట్‌లో ముందుకు వెళ్లనుంది.

# ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డ్‌కు కొత్త నిబంధనలు


- నగదు లావాదేవీలు రూ.10 లక్షలు దాటితే మాత్రమేూాాచీ తప్పనిసరి
- పాత రూ.50,000 డైలీ లిమిట్ రద్దు - వార్షిక మొత్తం ఆధారంగా
- ఆస్తి లావాదేవీలు రూ.20 లక్షలు, వాహనాలు రూ.5 లక్షలు పైన పాన్
- చిన్న లావాదేవీలకు ఉపశమనం - పెద్ద లావాదేవీలపై కఠిన నియంత్రణ




**న్యూఢిల్లీ, మార్చి 29 (జనంసాక్షి) :** ఏప్రిల్ 1, 2026 నుంచి పాన్ కార్డ్‌కు సంబంధించి కొన్ని ముఖ్యమైన కొత్త నిబంధనలు అమలులోకి వస్తున్నాయి. ఆదాయపు పన్ను నియమాలు 2026 ప్రకారం, చిన్న నగదు లావాదేవీలకు పాన్ అవసరం లేకుండా సరళీకరణ చేయబడింది.
నగదు డిపాజిట్లు / విత్‌డ్రాయల్స్: ఒక ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు) ఒకటి లేదా అనేక ఖాతాల్లో మొత్తం నగదు లావాదేవీలు రూ.10 లక్షలు దాటితే మాత్రమే పాన్ తప్పనిసరి. ఇంతకు ముందు ఒక్క రోజులో రూ.50,000 పైనే ూాచీ అవసరం ఉండేది. ఇప్పుడు వార్షిక మొత్తం ఆధారంగా నిర్ణయం తీసుకోబడుతుంది. ఆస్తి (ఇమ్మొవబుల్ ప్రాపర్టీ) లావాదేవీలు: రూ.20 లక్షలు దాటితే పాన్ తప్పనిసరి (ఇంతకు ముందు రూ.10 లక్షలు).
మోటార్ వాహనాలు (కార్లు, బైకులు): రూ.5 లక్షలు దాటితే పాన్ అవసరం (ట్రాక్టర్లు మినహా). హోటల్ / రెస్టారెంట్ / ఈవెంట్ బిల్లులు: నగదు చెల్లింపు రూ.1 లక్షలు దాటితే పాన్ తప్పనిసరి (ఇంతకు ముందు రూ.50,000). ఈ మార్పులు చిన్న వ్యాపారులు, రైతులు, సామాన్యులకు గణనీయమైన ఉపశమనం కల్పిస్తాయి. రోజువారీ చిన్న లావాదేవీలకు పాన్ అవసరం లేకుండా ఉ ఒడటం వల్ల కాగితపు పని తగ్గుతుంది. అయితే, పెద్ద మొత్తాల లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖ సులభంగా ట్రాక్ చేయగలదు. పన్ను చెల్లింపుదారులు ఏప్రిల్ 1 నుంచి తమ బ్యాంక్ లావాదేవీలు, ఆస్తి కొనుగోళ్లు వంటివి గమనించి, అవసరమైతే పాన్ లింక్ చేసుకోవాలని సూచించబడుతోంది. ఈ నియమాలు ఇన్‌కాం టాక్స్ అక్ట్, 2025 అమలుతో ముడిపడి ఉన్నాయి.

# మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు, ఆయిల్ స్వింగ్స్ మార్కెట్

**రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ ఫ్లోలపై దృష్టి**



**ముంబై, మార్చి 29:** మిడిల్ ఈస్ట్‌లో (పశ్చిమాసియా) కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల స్వింగ్స్ ఈ వారం దళాల్ స్ట్రీట్‌ను ప్రభావి తం చేయనున్నాయి. ఈ వారం మహావీర్ జయంతి (మంగళవారం) మరియు గుడ్ ఫ్రైడే (శుక్రవారం) సెలవుల కారణంగా ట్రేడింగ్ రోజులు కుదించబడ్డాయి. గత వారం మార్కెట్లు ఒత్తిడిలో ఉండగా, ఈ వారం కూడా గ్లోబల్ మాక్రో అభివృద్ధులు, ముఖ్యంగా క్రూడ్ ఆయిల్ ధరలు మరియు యూఎస్-ఇరాన్ సంబంధాల్లో ఏవైనా మార్పులు మార్కెట్ సెంటిమెంట్‌ను రూపొందించనున్నాయి. ఆయిల్ ధరలు ఇప్పటికే గణనీయంగా పెరిగి ఉండటం ఇన్‌ఫ్లేషన్ ఆందోళనలను పెంచుతోంది. విశ్లేషకులు ఈ వారం అస్థిరత ఎక్కువగా ఉండవచ్చని, ఆయిల్ ధరలలో ఏవైనా పెరుగుదల లేదా తగ్గుదల మార్కెట్ దిశను నిర్ణయించనున్నట్లు చెబుతున్నారు. రూపాయి డాలర్‌తో కదలికలు, ఫారిన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) ఫ్లోలు కూడా దృష్టి సారించాల్సిన అంశాలు.


**కీలకమైన ట్రిగ్గర్లు:**
- మిడిల్ ఈస్ట్ యుద్ధ పరిణామాలు మరియు యూఎస్-ఇరాన్ సీజ్‌ఫైర్ చర్చలు
- క్రూడ్ ఆయిల్ ధరల హెచ్చుతగ్గులు
- రూపాయి ద్రవ్య విలువ కదలికలు
- గ్లోబల్ మార్కెట్ క్యూస్

ప్రస్తుతం మార్కెట్ సెంటిమెంట్ జాగ్రత్తగా ఉంది. ఆయిల్ ధరలలో ఏదైనా తగ్గుదల వచ్చినా షార్ట్ కవరింగ్ ద్వారా రికవరీ రావచ్చని, అయితే ఎలివేటెడ్ ఆయిల్ ధరలు మార్కెట్‌పై ఒత్తిడి కొనసాగించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
ఈ కుదించిన వారంలో ట్రేడర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని, గ్లోబల్ అభివృద్ధులపై నిరంతరం దృష్టి ఉంచాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.



# కోడలు తన అత్త-మామలకు ఆర్థిక సహాయం చేయాల్సిన చట్టపరమైన బాధ్యత లేదు : అలహాబాద్ హైకోర్టు

- నైతిక బాధ్యత మాత్రమే - చట్టపరమైన బాధ్యత కాదు
- వితంతువు కోడలు.. బాధ్యత లేదని స్పష్టం
- కుటుంబాల్లో సామాజిక చర్చకు దారితీసే తీర్పు




**ప్రయాగరాజ్, మార్చి 29:** కోడలు తన అత్త-మామలకు ఆర్థిక సహాయం చేయాల్సిన ఎలాంటి చట్టపరమైన బాధ్యత లేదని అలహాబాద్ హైకోర్టు ముఖ్యమైన తీర్పు ఇచ్చింది. జస్టిస్ మదన్ పాల్ సింగ్ సింగిల్ బెంచ్ ఈ తీర్పు ఇచ్చింది. సెక్షన్ 125 సీఆర్‌పీసీ (ప్రస్తుతం సెక్షన్ 144 సీఆర్‌పీసీ) కింద భర్త తల్లిదండ్రులు తమ కోడల్ని నిర్వహణ కోసం ఆశ్రయించలేరని కోర్టు స్పష్టం చేసింది. ఈ సెక్షన్ కింద నిర్వహణ హక్కు కేవలం నిర్దిష్ట వ్యక్తులకు (భార్య, పిల్లలు, తల్లిదండ్రులు) మాత్రమే వర్తిస్తుందని, భర్త తల్లిదండ్రులు ఆ జాబితాలో లేరని కోర్టు గమనించింది.
ఒక వితంతువు కోడలు తన అత్త-మామలకు నిర్వహణ ఇవ్వాల్సిన అవసరం లేదని, నైతిక బాధ్యత మాత్రమే ఉంటుందని, దానిని చట్టపరంగా బలవంతం చేయలేమని కోర్టు తెలిపింది. "లెజిస్లేచర్ తన జ్ఞానంతో తల్లిదండ్రులను ఈ సెక్షన్ పరిధిలో చేర్చలేదు" అని జస్టిస్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఈ కేసులో వృద్ధ దంపతులు తమ కొడుకు మరణం తర్వాత కోడల్ని నిర్వహణ కోసం ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఫ్యామిలీ కోర్టు ఆ అప్లికేషన్‌ను తిరస్కరించడాన్ని హైకోర్టు సమర్థించింది.
ఈ తీర్పు కుటుంబాల్లోని సామాజిక-నైతిక బాధ్యతలు, చట్టపరమైన బాధ్యతల మధ్య ఉన్న తేడాను స్పష్టం చేస్తోంది. సమాజంలో కోడలు తన అత్త-మామలను చూసుకోవాలనే ఉన్నప్పటికీ, చట్టం ఆ బాధ్యతను ఆమెపై బలవంతం చేయడం లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు భారతదేశంలోని అనేక కుటుంబాల్లో చర్చనీయాంశం అవుతుందని న్యాయవర్తులు అంచనా వేస్తున్నారు.




# యుద్ధ ఉద్రిక్తతలతో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి

- బ్రెంట్ క్రూడ్ ‌105-112 రేంజ్‌లో ట్రేడ్
- స్ట్రీట్ ఆఫ్ హర్మజ్ దాదాపు బ్లాక్ - ప్రపంచ సప్లైలో 20% డిస్టర్బెన్స్
- ఇన్‌ఫ్లేషన్, గ్యాస్ ధరలు పెరిగే అవకాశం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, మార్చి 29:** మిడిల్ ఈస్ట్‌లో (యూఎస్-ఇరాన్) యుద్ధ ఉద్రిక్తతలు తీవ్రమవడంతో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు ‌105 నుంచి ‌112 వరకు ట్రేడ్ అవుతోంది. కొన్ని రోజుల్లో ‌120 వరకు కూడా చేరుకున్నట్లు మార్కెట్ నివేదికలు చెబుతున్నాయి.
పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచ ఆయిల్ సరఫరాలో దాదాపు 20 శాతం వరకు మా ర్గం చేసే స్ట్రీట్ ఆఫ్ హర్మజ్ దాదాపు బ్లాక్ అయినందున ప్రపంచ ఆయిల్ సప్లైలో తీవ్ర డిస్ట్రబెన్స్ వచ్చింది. ఇరాన్ బెదిరింపులు, షిప్పింగ్ మార్గాలపై దాడుల భయం వల్ల ట్యాంకర్ల రాకపోకలు గణనీయంగా తగ్గాయి.
ఈ పరిణామాలు ఇన్‌ఫ్లేషన్ను మరింత పెంచి, గ్యాస్ ధరలు, పెట్రోల్-డీజిల్ ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.
ఇరాన్ హెచ్చరికలు, అమెరికా-ఇజ్రాయెల్ చర్యల నేపథ్యంలో ఆయిల్ మార్కెట్ అత్యంత అస్థిర స్థితిలో ఉంది. ఈ ఉద్రిక్తతలు ఇంకా కొనసాగితే ఆయిల్ ధరలు మరింత ఎగసిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కాంగ్రెస్ 284 మంది అభ్యర్థుల జాబితా విడుదల

- బహరాంపూర్ నుంచి అధీర్ రంజన్ చౌదరి బరిలో
- రాష్ట్రవ్యాప్తంగా ఒంటరి పోరు - ఎన్నికల యుద్ధానికి సన్నాహాలు
- ముర్షిదాబాద్‌లో బలమైన అభ్యర్థి - అధీర్‌పై ఆశలు
- తృణమూల్, బీజేపీ, లెఫ్ట్‌తో నాలుగు మూలల పోటీ

**కోల్‌కతా:** తమిళనాడు తర్వాత పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తన 284 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. రాష్ట్రంలోని 294 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఈ జాబితాలో బహరాంపూర్ (బెహరాంపూర్) నియోజకవర్గం నుంచి సీనియర్ నాయకుడు, మాజీ లోక్‌సభ సభ్యుడు అధీర్ రంజన్ చౌదరిని బరిలోకి దింపింది. అధీర్ రంజన్ చౌదరి గతంలో బెహరాంపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచిన అనుభవం ఉన్న నాయకుడు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనుండటం కాంగ్రెస్‌లో ఆసక్తి రేపుతోంది. ముర్షిదాబాద్ జిల్లాలోని బహరాంపూర్ కాంగ్రెస్‌కు సాంప్రదాయికంగా బలమైన కేంద్రంగా పరిగణించబడుతోంది. కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో ఒంటరి గా పోటీ చేయాలని నిర్ణయించింది. ఇది తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్‌తో నాలుగు మూలల పోటీని సృష్టించ నుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. ఈసారి బలమైన తిరుగుబాటును చేయాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. అధీర్ రంజన్ చౌదరి ఇటీవల బహరాంపూర్‌లో తన అభ్యర్థిత్వా న్ని స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో పార్టీ అధికారికంగా జాబితాలో చేర్చడం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ హైకమాండ్ ఆయనను బలమైన అభ్యర్థిగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. కాంగ్రెస్ ఈ మొదటి జాబితాతో పాటు మిగిలిన సీట్లకు కూడా త్వరలో అభ్యర్థులను ప్రకటించనుంది. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో నాలుగు మూలల పోటీని సృష్టించి, ఆసక్తికరంగా మారనున్నాయి.

# పవర్‌ఫుల్ ఇండియన్స్ జాబితాలో రామ్మోహన్ నాయుడు

- 90వ స్థానం సాధించిన కేంద్ర మంత్రి
- విమానయాన సంక్షోభాలు సమర్థవంతంగా ఎదుర్కొన్న ఘనత
- దేశీయ ఏరోస్పేస్ రంగానికి కృషి



**న్యూఢిల్లీ, మార్చి 29:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మరో అరుదైన ఘనత సాధించారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకటించిన 'పవర్‌ఫుల్ ఇండియన్స్' (శక్తిమంత మైన భారతీయులు) జాబితాలో 90వ స్థానాన్ని సంపాదించారు. మోదీ ప్రస్తుత కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కేంద్ర మంత్రిగా రామ్మోహన్ నాయుడు గుర్తింపు పొందారు. గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా (AI 171) విమాన ప్రమాదం మరియు ఇండిగో విమానయాన సంక్షోభాలను పౌర విమానయాన శాఖ మంత్రిగా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. దేశీయ ఏరోస్పేస్ తయారీ రంగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, విమాన ప్రయాణాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు.
లోక్‌సభ సభ్యుడిగా మాత్రమే కాకుండా కేంద్ర మంత్రిగా పార్లమెంటులో బలమైన ప్రాంతీయ గళాన్ని తనదైన శైలిలో వినిపిస్తున్నారు. పలు సామాజిక అంశాలపై కూడా ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారు. రాజకీయాల్లోకి రాకముందు రామ్మోహన్ నాయుడు మంచి ఫోటోగ్రాఫర్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు. 38 ఏళ్ల వయస్సులో మోదీ క్యాబినెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కేంద్ర మంత్రుల్లో ఒకరిగా రామ్మోహన్ నాయుడు ప్రస్తుతం దేశవ్యాప్త గుర్తింపు పొందుతున్నారు.

# ఇజ్రాయెల్ ఏజెంట్‌గా ట్రంప్

- పర్షియన్ గల్ఫ్‌లో గ్రౌండ్ అసాల్ట్‌కు ఇరాన్ స్టార్క్ హెచ్చరిక
- ఖతం అల్-అన్బియా స్పోక్స్‌పర్సన్ ఎబ్రాహిం జోల్‌ఫఖారి హెచ్చరిక



న్యూఢిల్లీ/తెహ్రాన్, మార్చి 29: పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా గ్రౌండ్ ఆపరేషన్ లేదా ఏదైనా ఇరాన్ భూభాగం ఆక్రమణ ప్రయత్నించినా, అమెరికా సైనికులు "పర్షియన్ గల్ఫ్ సముద్రపు చేపల (షార్క్స్)కు మంచి ఆహారం" అవుతారని ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది.
ఇరాన్ ఖతం అల్-అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ స్పోక్స్‌పర్సన్ బ్రిగేడియర్ జనరల్ ఎబ్రాహిం జోల్‌ఫఖారి ఆదివారం వీడియో స్టేట్‌మెంట్‌లో ఈ హెచ్చరికలు ఇచ్చారు. "ట్రంప్ అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్ ప్రధాని ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఇరాన్ భూభాగం లేదా ద్వీపాలను ఆక్రమించాలని బెదిరించడం కేవలం కలలు మాత్రమే. ఇస్లామిక్ యోధులు ఇలాంటి ఆక్రమణల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఆక్రమణదారులు అవమానకరమైన బంధీలుగా, శరీరాలు విచ్ఛిన్నమై, అదృశ్యమైపోతారు. అమెరికా కమాండర్లు, సైనికులు పర్షియన్ గల్ఫ్ షార్క్స్‌కు మంచి ఆహారం అవుతారు" అని ఆయన హెచ్చరించారు.
ఇరాన్ సైన్యం ఈ హెచ్చరికలు ట్రంప్ ఇటీవలి బెదిరింపుల నేపథ్యంలో వచ్చాయి. ఖార్గ్ ద్వీపం వంటి వ్యూహాత్మక ప్రాంతాలపై అమెరికా దృష్టి పెట్టినట్లు నివేదికలు వచ్చిన నేపథ్యంలో ఇరాన్ తన రక్షణలను బలోపేతం చేస్తోంది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఖర్ ఘాలిబాఫ్ కూడా ఇటీవల ఇలాంటి హెచ్చరికలు ఇచ్చారు.
ప్రస్తుతం మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్నాయి. అమెరికా ట్రూప్స్ గల్ఫ్ ప్రాంతంలోకి మరిన్ని బలగాలను పంపుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. ఇరాన్ ఈ హెచ్చరికలు యుద్ధ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
ఇరాన్ సైన్యం "ఇస్లామిక్ యోధులు సిద్ధంగా ఉన్నారు" అని పేర్కొంటూ, ఏ ఆక్రమణకైనా తగిన బదులు ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఆయిల్ సరఫరా మార్గాలైన స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

# ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ 2026లో కళా సంబరం

- ఏప్రిల్ 3 నుంచి 5 వరకు జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో



**హైదరాబాద్ (జనంసాక్షి):** హైదరాబాద్ నగరం మళ్లీ రంగులతో ముస్తాబవుతోంది. కాన్వాస్‌లపై ఊపిరి పీల్చే భావాలు, శిల్పాల్లో ప్రతిఫలించే మనసులు, రంగుల వెనుక దాగిన కథలు.. ఇవి అన్నీ ఒకే వేదికపై దర్శనమివ్వబోతున్నాయి. ఏప్రిల్ 3 నుంచి 5 వరకు జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ 2026, కళాభిమానులను ఒక సృజనాత్మక ప్రయాణంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా ప్రాధాన్యం పొందిన ఈ ఆర్ట్ ఫెస్టివల్, హైదరాబాద్‌లో మూడోసారి నిర్వహించబడుతుండగా, నగర కళాకారులు ఈసారి ప్రత్యేకంగా తమ ముద్ర వేయడానికి సిద్ధమయ్యారు. ప్రతి చిత్రంలో ఒక భావం, ప్రతి శిల్పంలో ఒక కథ, ప్రతి రంగులో ఒక సందేశం దాగి ఉంది. ఉ. విజయ్ కుమార్ చిత్రాల్లో మనిషి భావోద్వేగాలు స్పష్టంగా ప్రతిబింబిస్తే, కప్పరి కృష్ణన్ కళల్లో పౌరాణిక, ఆధ్యాత్మికత ఒక కొత్త రూపంలో కనిపిస్తాయి. సత్య గన్నోజు చిత్రాల్లో భక్తి పరవశం కనిపిస్తే, భూపతి మోషే దయాన్ కళల్లో జీవితం, అనుభూతులు కథలుగా మారిపోతాయి.



శిల్పకళలో ఎస్.కాంతా రెడ్డి, డీవీఎస్ కృష్ణ రూపొందించిన ప్రకాశవంతమైన మానవ తల శిల్పాలు చూసే వారిని కాసేపు ఆలోచనలో ముంచేస్తాయి. 'మనిషి ఎవరు? అతని ఆత్మ ఏమిటి?' అన్న ప్రశ్నలను ఇవి నిశ్శబ్దంగా అడుగుతాయి. గ్రామీణ జీవితం, జానపద సంప్రదాయాలు కూడా ఈ ఫెస్టివల్‌లో ప్రాధాన్యం పొందాయి. ఎం.పి. నర్సింహారావు, రాజు ఎపూరి, నన్నుట రాజేశ్వర్ చిత్రాల్లో పల్లె సౌందర్యం రంగుల రూపంలో కళకళలాడుతుంది. హేమంత్ చంద్ర ప్రసాద్, నర్సింహ గౌడ్ రోలు కళల్లో పౌరాణిక గాథలు జీవం పొందుతాయి .ప్రకృతి ప్రేమికుల కు కూడా ఈ ప్రదర్శన ఒక పండుగే. రమణి మైలవరపు, నేహా జైన్, రక్షా జేస్రాణి చిత్రాల్లో పుష్పాలు, ప్రకృతి ఆకృతులు, రంగుల ప్రవాహం మనసును ప్రశాంతంగా చేస్తాయి. ఇక రమేష్ కుమార్, సాత్విక కొరిమి వంటి కళాకారులు తమ డ్రాయింగ్స్‌లో చూపిన నైపుణ్యం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కుంచెకు ప్రాణం పోసే వారి కళ, సహనానికి ప్రతీకగా నిలుస్తుంది. దీపా నాథ్, లబ్య ఎల్, రాజేష్ ఝువేరి, ఎం. బాలరాజ్ వంటి కళాకారులు మనిషి



సంబంధాలు, వ్యక్తిత్వం, భావోద్వేగాలను బలమైన రంగులతో ఆవిష్కరిస్తారు. సాధ్నా చాగంటి మాత్రం సహజ రంగులతో కాటన్ ఫ్యాబ్రిక్‌పై సాంప్రదాయ శైలిలో చేసిన కళాఖండాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కళా వేడుకలో 3,000కి పైగా కళాఖండాలు ప్రదర్శనలో ఉండనున్నాయి. ప్రతి అడుగు ఒక కొత్త అనుభూతి, ప్రతి మూల ఒక కొత్త ఆలోచనను అందిస్తుంది. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ 2026 కేవలం ఒక ప్రదర్శన కాదు... ఇది భావాల పండుగ, సృజనాత్మకతకు వేదిక, కళాకారుల ఆత్మీయ ప్రపంచానికి తలుపు. హైదరాబాద్ నగరం ఈ మూడు రోజులు చిత్రకళకు చిరునామాగా నిలవబోతుంది

# నైపుణ్యం.. ఉద్యోగ అవకాశాలపై అవగాహన

**స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ జి.సుబ్బారావు**



**గోదావరిఖని, (జనంసాక్షి) :** స్థానిక శారదనగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీస్ అండ్ ఆధ్వర్యంలో టిసిఎస్ అయాన్ జాబ్ అచీవర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అనే కార్యక్రమం మీద అవగాహన అవగా హన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్ర మానికి స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి సుబ్బారావు అధ్యక్షత వహించగా కరీంనగర్ నుంచి వచ్చిన రిసోర్స్ పర్సన్ కుమార్, స్టడీ సెంటర్ కౌన్సిలర్ విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం అధికారుల సూచన మేరకు అంబేద్కర్ విద్యార్థిని విద్యార్థులకు ఈ కార్యక్రమం మీద అవగాహన కల్పించుటకు ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులను అనేక రకాల నైపుణ్యాల పట్ల, ఉద్యోగ అవకాశాల పట్ల అవగాహన కల్పిస్తూ వారి పేర్లను నమోదు చేసుకోవడం జరిగినది. విద్యార్థినీ విద్యార్థులను నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం తమ వంతు కృషిలో భాగంగా ఈ కార్యక్ర మాన్ని రూపకల్పన చేయడం జరిగింది. ఇందులో తమ పేరును నమోదు చేసుకున్న వారికి విశ్వవిద్యాలయ అధికారులు విశ్వవిద్యాలయాలు స్కూటీ ద్వారా తమ యొక్క అర్హతలను బట్టి అడ్మిషన్ ఇస్తూ ఆపైన శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ శిక్షణ ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్, బిజినెస్, ప్రజెంటేషన్ స్కిల్స్ మరియు ఇతర ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ మీద శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. కనుక అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో చదువు కుని మొదటి , రెండవ సంవత్సర విద్యార్థులు ఈ కార్యక్రమం కొరకు నమోదు చేసుకొని సరైన శిక్షణ పొంది అనేక రకాల మల్టీనేషనల్ కంపెనీలలో అత్యుత్తమైన ఉద్యోగ అవకా శాలు పొందగలరని తద్వారా వారి జీవితాలను మార్చుకోగలరని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. సుబ్బారావు ఆకాంక్షించారు. తదుపరి కరీంనగర్ నుండి వచ్చిన రిసోర్స్ పర్సన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వివరించి అందరూ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా సహాయ సహకారాలు అందించారు.

### ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి
# అడ్డుగా మారిన విద్యుత్ తీగలు

**నిలిచిపోయిన పనులు విద్యుత్ తీగలను తొలగించాలని లబ్ధిదారు వేడుకోలు**



**రుద్రంగి, మార్చి 29 (జనంసాక్షి):** రుద్రంగి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి అడ్డుగా మారినా విద్యుత్ తీగలు తొలగించాలని అధికారులను వేడుకోలు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ నూతన గృహాల నిర్మాణం అధికారుల నిర్లక్ష్యంతో మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహనిర్మాణం విద్యుత్ తీగల కారణంగా నిలిచిపోయింది. ఇంటి పైభాగం మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడం వల్ల పనులు కొనసాగిం చలేక గ్రామానికి చెందిన మీసాల గంగు ఇబ్బందులు పడుతున్నారు. అట్టి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతోంది. విద్యుత్ తీగలు ఇంటికి పై భాగం మధ్య నుండి వెళ్లడంతో ప్రమాదం జరిగే అవకాశముందని వారు భయపడుతున్నారు. దీంతో స్లాబ్ వరకు వచ్చిన ఇందిరమ్మ ఇల్లు సెంట్రింగ్ కొట్టడా నికి మేస్త్రీలు భయపడుతున్నారు. విద్యుత్ తీగలు తొలగించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇంటి మధ్య నుండి వెళ్లే విద్యుత్ తీగలను వెంటనే తొలగించి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సహకరించాలని అధికారులను కోరుతున్నారు.

### మద్యం మీ కళ్ళను మూయవచ్చు..
# కానీ మీ కుటుంబ కళ్ళలో కన్నీరు నింపకండి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** మద్యం మీ కళ్ళను మూయవచ్చు,కానీ మీ కుటుంబ కళ్ళలో కన్నీరు నింపకండి అని ,డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు ఉంటా యని ఒక్క రోజే 553 మందికి శిక్షలు విధించబడ్డాయని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తోందని. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చేపట్టిన తనిఖీల్లో భారీ సంఖ్యలో వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని. పట్టుబడిన 553 మందిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలను విధించిందన్నారు. జిల్లా వ్యాప్తం గా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 553 మందికి కోర్టు శిక్షలు విధించబడినాయి. ఇందులో ఒకరికి 5 రోజుల జైలు శిక్ష విధించగా, మిగిలిన వారందరికీ కలిపి మొత్తం రూ. 6,38,500 జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం కేవలం చట్ట పరమైన నేరమే కాకుండా, ప్రాణాంతక పరిణామాలకు దారితీసే ప్రమాదకర చర్య అని తెలిపారు. మద్యం మీ కళ్లను తాత్కాలి కంగా మూయ వచ్చు కానీ మీ కుటుంబ కళ్లలో కన్నీరు నింపకండి అని ప్రజలను హెచ్చరించారు. తాత్కాలిక మత్తులో తీసుకునే నిర్లక్ష్య నిర్ణయాలు కుటుంబాల జీవితాలను శాశ్వతం గా దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తన కుటుంబం మరియు సమాజం పట్ల బాధ్యతను గుర్తుంచుకుని మద్యం సేవించి వాహనం నడపకుండా ఉం డాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించేపై కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీస్ శాఖ హెచ్చరించింది.

### గ్రామపంచాయతీ భవనాన్ని
# మంజూరు చేయాలని ఎంపీకి వినతి



**తలకొండపల్లి (జనంసాక్షి):** తలకొండపల్లి మండలంలో నూతన గ్రామ పంచాయితీగా ఏర్పడిన వీరన్నపల్లి,కి పంచాయితీ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం సర్పంచ్ కడారి రామకృష్ణ యాదవ్ గ్రామస్తులతో కలిసి నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి,కి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై ఎంపీ మల్లు రవి స్పందిస్తూ కొత్తగా ఏర్పడిన గ్రామాల్లో నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మిన్నల డేవిడ్,ఉప సర్పంచ్ నూనె రాఘవేందర్,యువ నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం' పోటీలకు విశేష స్పందన

**సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం**



**కరీంనగర్ బ్యూరో, (జనంసాక్షి) :** నగరంలోని 'భగత్ నగర్ సిద్ధార్థ' పాఠశాలలో సిద్ధార్థ పాఠశాలల అంతర్గత చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన పోటీలో 80 మంది విద్యార్థులు పాల్గొని వారి మేధాశక్తిని చాటారు. ఈ సందర్భంగా సిద్ధార్థ పాఠశాలల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ... చదరంగం ఆటతో విద్యార్థులకు మేధాశక్తి ఏకాగ్రత పెరుగుతుందని అందుకు చదరంగం క్రీడ నేర్చుకునేవిధంగా పిల్లలను చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. చదరంగం ఆటలో ఎంతో మంది కరీంనగర్‌కు చెందిన విద్యార్థులు నేషనల్, ఇంటర్నేషనల్ క్రీడాకారులుగా ఉన్నారని అందుకు ప్రోత్సహిస్తున్న జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య, అకాడమీ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్‌లను ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, కరీంనగర్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు తాటిపెల్లి సతీష్ బాబు, కంకటి సుజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మార్క అనిల్, కోచ్ లు తరుణ్, అభిరామ్, రేవిక్, పృథ్వి, విశాల్, బి.జీవన్, ఆర్.నరేన్, క్రీడాకారులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

# మునుగనూరులో పారుతున్న మురుగు

**ప్రేక్షక పాత్రలో అధికారులు..!**



**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ పరిధి మునగనూరులో నూతనంగా ప్రారంభించిన సబ్ రిజిస్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో రెండు నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. ఈ మురుగు నీరు దాదాపు కిలోమీటర్ వరకు పారుతోందని, స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిని దాటుకుంటూ పలు హోటల్లు, వ్యాపార సంస్థలకు తాకుతూ వెళ్తుందని దీంతో నిత్యం దుర్వాసనతో యుద్ధం చేస్తున్నామని వ్యాపారస్తులు తలలు పట్టుకుంటున్నారు. ఈ మధ్యనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ గ్రేటర్ హైదరాబాద్లో కలిసిందని దీంతో ప్రజలకు మరింత సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులే ఇలా ప్రేక్షక పాత్రలో ఉండటం అధికారుల తీర్పు అద్దం పడుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరుచుకొని మురుగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్
# షిప్ పోటీలో పారమిత విద్యార్థి అద్భుత ప్రతిభ

**పారమిత పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు**



**కరీంనగర్, మార్చి 29 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కె. విఘ్నేష్ 7వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ నెల 22 నుండి 24 వరకు హైదరాబాద్ లోని రాష్ట్ర బాక్సింగ్ క్రీడా సమాఖ్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర బాక్సింగ్ ఛాంపియన్ షిప్ 80 కేజీల విభాగంలో పారమిత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె. విఘ్నేష్ తన అద్భుత ప్రతిభ తో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలో కాంస్య పథకం సాధించిన కె. విఘ్నేష్ ని పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద రావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత సమన్వయకర్త శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రామక్రిష్ణ లు అభినంధించారు.

# రాజన్న ఆలయంలో నాగుపాముల సంచారం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి నాగుపాములు ఆలయ పరిసర ప్రాంతాల్లో కనపడడంతో అభివృద్ధి పనులు చేస్తున్న కార్మికులు,ఆలయ అర్చకులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారము 6 అడుగులు గల నాగుపాము ప్రత్యక్షం కావడంతో అక్కడ పనులు నిర్వహిస్తున్న కార్మికులతో పాటు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టే జగదీష్ కు ఆలయ అధికారులు సమాచారం ఇవ్వడంతో ఆయన నాగుపామును పట్టుకొని సుదూర ప్రాంతంలోని విడిచిపెట్టాడు.

# కొండెక్కిన కోడి..దిగింది..

**వంద రూపాయలు తగ్గిన చికెన్ రేటు**



**ముస్తాబాద్ (జనంసాక్షి):** ఈ మధ్యకాలంలో పౌల్ట్రీ కోడి మాంసము రేటు గణనీయంగా పెరగడంతో చికెన్ ప్రియులకు ఇది పెద్ద ఇబ్బందిగానే మారింది. అంతగా కొండెక్కిన కోడి రేటును చూసి అయ్యో అంటూ తినకుండా మానుకున్న రోజులు ఉన్నాయి. ఇక ఇప్పుడిప్పుడే కొండెక్కిన కోడి రేటు మాత్రం మెల్లగా దిగి వస్తుంది. ప్రస్తుతం చికెన్ రేటు మార్కెట్లో 270కిలో గాఅమ్మకాలు జరుగుతున్నాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు. కోళ్ల పెంపకం, లభ్యతను బట్టి ధరలు. చికెన్ లవర్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూసే. గత వారం భారీగా పెరిగిన చికెన్ ధరలు.. ఈ వారం అమాంతం తగ్గిపోయాయి. మార్చి నెల ఆరంభంలో కిలో చికెన్ ధర రూ. 360, రూ. 400 పలికింది. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో కోళ్లు చనిపోవడం, వాటి దాణా ఖర్చులు పెరగడంతో కోళ్ల ఫారమ్ల యజమానులు ధరలను పెంచారు. ఇదే సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు కూడా ఉండటంతో చికెన్ కు గిరాకీ ఏర్పడింది. వెరసి స్కిన్ లెస్, నార్మల్ చికెన్ ధర కూడా ఆల్ టైమ్ రికార్డుకు చేరింది. గతవారం కేజీ చికెన్ ధర ఏకంగా రూ. 400కు చేరడంతో. చికెన్ ప్రియులంతా సీ ఫుడ్ వైపు మళ్లారు. వారం రోజుల తర్వాత కిలో చికెన్ రేటు ఏకంగా రూ. 100 వరకూ తగ్గింది. హైదరాబాద్‌లో నేడు స్కిన్ లెస్ చికెన్ కేజీ ధర రూ. 270గా ఉండగా. అటు వరంగల్ లోనూ అదే ధర కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని అమలాపురంలో మాత్రం రూ. 300-350 పలుకుతోంది. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, కోళ్ల పెంపకం, లభ్యతను బట్టి ధరలు మారుతుంటాయని వ్యాపారస్తులు తెలిపారు.

# ఆత్మ రక్షణ కోసం కుంగ్-ఫూ






- వందమంది విద్యార్థులకు బెల్టుల ప్రధానం..
- గ్రాండ్ మాస్టర్ వీరాచారి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 29 (జనంసాక్షి):** కుంగ్-ఫూ నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణ ఉంటుందని కుంగ్-ఫూ అకాడమి ఆల్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్, లెజెండరీ గ్రౌండ్ మాస్టారు విరాచారి అన్నారు. ఆదివారం వేములవాడలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో వీరాచారి కుంగ్ ఫు విద్యార్థులకు బెల్టుల ప్రధానోత్స వానికి ముఖ్య అతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఆఘుత్యాలను అరికట్టేందుకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడుతుందన్నారు. బాల, బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకునేలా తల్లిదండ్రులు మరింత ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. ఇపుటికే ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఉచిత మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం శుభపరిణా మన్నారు. విద్యార్థులకు బెల్టులు,సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

**బ్లాక్ బెల్ట్ అందచేత..**

కుంగు ఫూ అకాడమీ సీనియర్ ఇన్స్ట్రక్టర్ నేరేళ్ల శ్రీధర్ గౌడ్, అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్, తెలంగాణ చీఫ్ ఎగ్జామినర్ గా పదోన్నతి పొందుతూ, ఆరవ బ్లాక్ బెల్ట్ సాధించారని ఆల్ ఇండియా చీఫ్ ఎగ్జామినర్ వీరాచారి తెలిపారు. కనక ప్రసాద్ నాలుగవ బ్లాక్ బెల్ట్, రాకేష్, బాలు మూడవ బ్లాక్ బెల్ట్ సాధించారన్నారు. బ్లాక్ బెల్ట్ లు సాధించిన వీరిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు తోట రాజు, కొండ శేఖర్,కాంగ్రెస్ నాయకులు చిలుకరమేష్, కట్కూరి శ్రీనివాస్,చీఫ్ ఎగ్జామినర్ నేరెళ్ల శ్రీధర్ గౌడ్,మాస్టార్లు కనక ప్రసాద్, రాకేష్, బాలరాజు, బెల్ట్ గ్రహీతలు పాల్గొన్నారు.

# పేదప్రజల అభ్యున్నతికి సేవా భారతి కృషి

**గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**



**హైదరాబాద్, (జనంసాక్షి) :** పేదప్రజ లకు సేవలు అందించడంలో సేవ భారతి ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సేవా భారతి ఆధ్వర్యంలో సుల్తాన్ బజార్‌లో ఏర్పాటు చేసిన "సేవా భారతి డాక్టర్ హెడ్గేవార్ రక్త నిధి కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం ప్రారంభిం చారు. అనంతరం ఆయన సేవా భారతి సభ్యులు, డాక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. సేవా భారతి పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం సేవలు అందిస్తున్న ప్రముఖ సామాజిక సంస్థ అని గవర్నర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అత్యాధునిక సదుపాయాలు, సాంకేతిక పరికరాలతో కూడిన ఇలాంటి బ్లడ్ సెంటర్‌ను తాను చూడడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్న నిరుపేదలకు ఈ రక్త కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలు, ముఖ్యంగా యువత రక్తదానానికి ముందుకు రావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. జాతీయవాది డా. హెడ్గేవార్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఆయన జీవితాంతం దేశహితానికి అంకితమై సేవలు అందించారని గవర్నర్ కొనియాడారు. వారి పేరుతో బ్లడ్ బ్యాంక్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ కూడా 'మానవ సేవే మాధవ సేవ' అనే సూత్రంతో ప్రజాసేవలో ముందుండాలని ప్రజాప్రతినిధులకు చెబుతుంటారని గవర్నర్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి, సేవా భారతి తెలంగాణ అధ్యక్షులుడి దుర్గారెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ది స్పేస్ హైస్కూల్ పదవ వార్షికోత్సవ వేడుకలు

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రోబో స్ట్రోమ్**



**సూర్యాపేట (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో గల ది స్పేస్ హైస్కూల్ 10వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా విద్యార్థులచే ఏర్పాటు చేసిన రోబో స్ట్రోమ్ అల్టిమేట్ స్టూడెంట్ రోబో ఎక్స్ పో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ ప్రజ్ఞారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక సాంకేతిక యుగం లో విద్యార్థులు చదువుతోపాటు టెక్నికల్ అంశాలపై కూడా పట్టు సాధించాలన్నారు. విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరవచ్చని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాల కు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ది స్పేస్ హై స్కూల్ కరస్పాండెంట్ జె.వనిల్ కుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్ చాలా అవసరమని అన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు టెక్నికల్ స్కిల్స్ ను అందించాలనే తమ ఆలోచనలకు విద్యార్థుల ఉత్సాహం, తల్లిదండ్రుల ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న టెక్నికల్ అంశాలచే ఏర్పాటు చేసిన రోబో స్ట్రోమ్ కు మంచి ఆదరణ లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా దేవి, చైర్మన్ మురళీ మనోహర్ రెడ్డి, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాడు స్వరాష్ట్రం కోసం పోరాటం
# నేడు ఉపాధి కోసం ఆరాటం

- స్వరాష్ట్రం కోసం దరువేసిన చేతులు
- ఉపాధి లేక ఎదురుచూస్తున్న బతుకులు





**కోహెడ, (జనంసాక్షి):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ ప్రాంతం ఒక ప్రత్యేకమైనది ఉద్యమాలకు, పోరాటాలకు పురిటిగడ్డగా ఉద్యమాలు నడిపిన నేల హుస్నాబాద్. ఎంతోమంది ఉద్యమకారులు కవులు కళాకారులకు నిలయం హుస్నాబాద్. ఈ ప్రాంత వాస్తవ్యుడు డప్పు అశోక్ పొన్నాల ప్రస్తుతం సిద్దిపేట జిల్లా కోహెడ గ్రామానికి చెందిన ఉద్యమ కళాకారుడు స్వరాష్ట్ర మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక ధూంధాం వేదికలపైన డప్పు వాయిద్యంతో తనదైన ముద్ర వేసుకున్నాడు. పొన్నాల అశోక్ స్వంత గ్రామం కోహెడ తల్లిదండ్రులు విజయ -అంజయ్య. పుట్టిపెరిగింది మాత్రం తన అమ్మమ్మ ఊరు మైసంపల్లి గ్రామంలో. చిన్నతనంలోనే కళలకు, సామాజిక కార్యక్రమాలకు ఆకర్షితుడై, స్వరాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమాలను చూస్తూ పొన్నాల అశోక్ పెరిగాడు. ధూందాం కళాకారులు మామ కీ "శ్రే ఎనగందుల చందు అలాగే డప్పు భాస్కర్ల ప్రోత్సహంతో గురు సమానులు బోనగిరి వెంకట స్వామి కళాబృందంలో డప్పు కళాకారుడిగా తన కళారాంగాన్ని ప్రారంభించాడు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో 2009 డిసెంబర్ నుండి తెలంగాణ సాధన కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేక ధూంధాం వేదికల పైన డప్పు వాయిద్యంతో అలరించి సకల జనుల సమ్మె, వంటావార్పు, రాస్తారోకో,రైలు రోకో, నిరసన కార్యక్రమంలో పాల్గొని ఉద్యమ స్ఫూర్తిని చాటుకున్నాడు. హుస్నాబాద్ ప్రాంత కళాకారులు, గడిపే బాలయ్య, గొల్లపల్లి వినోద్, బోనగిరి శ్రీకాంత్, ఠాకూర్ మనోహర్ సింగ్, గజ్జెల వినోద, ముక్కెర సంపత్ కుమార్లతో కలిసి కళారంగంలో కలిసి ప్రోగ్రాం చేశాడు. ప్రజా యుద్ధనౌక కీ "శ్రే "గద్దరన్నా, ధూంధాం వ్యవస్థాపకులు రసమయి బాలకిషన్ , బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, కందుకూరి శంకర్ బాబు,మురళిమధు , దరువు అంజన్న, బుర్ర సతీష్, ఆకునూరి దేవయ్య, వడ్లకొండ అనిల్ , పొద్దుపొడుపు శంకర్ , ఒరుగంటి శేఖర్ , తేలు విజయ, వొళ్ళాల వాణి, సౌమ్య, సీనియర్ కళాకారులతో వేదికలలో పాల్గొని తన డప్పు వాయిద్యంతో ప్రశంశాలు పొందాడు. తెలంగాణ స్వరాష్టంలో బహుజన రాజ్యాధికారంకోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్తో కలిసి అడుగులో అడుగై ప్రజా వాగ్గేయకారులు రచయిత మచ్చ దేవేందర్, బహుజన గర్జన గజ్జెల అశోక్, పాటమ్మ రాంబాబులతో మహనీయుల ఆశయాల బాటలో బహుజన ధూందాం వేదికలల్లో రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక ప్రదర్శనలలో పాల్గొన్నాడు. సల్వాజి మ్యూజికల్ గ్రూప్, ఆర్గనైజ్ , కళారవళి అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆధ్యాత్మిక పౌరాణిక భజన ప్రదర్శన కార్యక్రమంలో తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల నుండి 1000 కళాకారులచే 10 గంటల ప్రదర్శన ప్రోగ్రాంలో సల్వాజి ప్రవీణ్ ప్రోత్సా హంతో కార్యక్రమంలో పాల్గొని డప్పు వాయిద్య సహకారం అందించినందుకుగాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రశంస పత్రంతో ఘనంగా సన్మానించారు.

ఇలా ఎక్కడ ఏ సందర్భం లోనైనా చురుకుగా డప్పు వాయిద్యంతో అన్ని కార్యక్రమాలల్లో ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నాడు పొన్నాల అశోక్ డప్పు.

**పొన్నాల అశోక్ డప్పు మాటల్లో..**

2009 డిసెంబర్ నుండి 2026 నేటి వరకు 17 సంవత్సరాలుగా ఆట -పాటే ఉపాధిగా నా కళా జీవితం కొనసాగుతుంది. స్వరాష్ట్ర సాధన కోసం చదువును సైతం పక్కన పెట్టి ఉద్యమంలో భాగస్వామినై ఆట - పాట - మాట డప్పు దరువునే నమ్ముకొని (డప్పు అశోక్ గా పిలువబడుతూ) ప్రజలను చైతన్యం చేస్తూ జీవిస్తున్న నా లాంటి చాలా మంది ఉద్యమ కళాకారులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతూ కూలీలుగా మారామన్నారు. గత బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ప్రభుత్వంలో మాజీ సాంస్కృతిక శాఖ చైర్మన్ రసమయి నాయకత్వంలో 550 మంది ఉద్యమ కళాకారులను ఆదుకొని సాంస్కృతిక శాఖలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి కొంతమందికి న్యాయం చేసి మాలాంటి చాలా మందికి అన్యాయం జరిగిందని అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఉపాధి, ఉద్యోగాలకోసం ఎదురుచూస్తు ఉన్నాము. ఇకనైనా మాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నైనా న్యాయం జరిగి ఉపాధి కోసం ఎదురు చూస్తున్న మరికొంత మంది ఉద్యమ కళాకారులను ఆదుకొని టీఎస్ఎస్లో ఉద్యో గాలు కల్పిస్తారని కొండంత ఆశతో ఎదురు చూస్తున్న ట్లు అన్నారు.గతంలో అనేక మంది ప్రముఖులు చేతుల మీదుగా అందుకున్న ప్రశంస పత్రాలు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్, ఉగాది పురస్కారాలు, తెలంగాణ అవతరణ దినోత్సవం, గ్రామీణ కళ ప్రదర్శనలు,భాషా సాంస్కృతిక శాఖ ఉత్సవాలు మహనీయుల జయంతులు, మొదలగునవి చాలా ప్రశంశాలు అందుకున్నారు.

# జర్నలిస్టులు పెన్ డౌన్.. కెమెరా డౌన్‌కు సిద్ధం

- ఇండ్ల స్థలాలు... జర్నలిస్టుల హక్కు
- సాధన కోసం ఎటువంటి పోరాటానికైనా టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం
- అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- జర్నలిస్టు రాంబాబు ఇండ్ల స్థలాల దీక్ష విరమణ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి





**ఖమ్మం టౌన్ (జనంసాక్షి):** ఇండ్ల స్థలాలు జర్నలిస్టుల హక్కు.. వాటి సాధన కోసం ఎటువంటి పోరాటానికైనా సిద్ధమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ ) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అవసరమైతే పెన్, కెమెరా డౌన్ లు కూడా చేపడతామన్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం 14 రోజులుగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొరకొప్పుల రాంబాబుకు ఆదివారం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం సంఘటితంగా పోరాడుదామని ఖదీర్, శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. ఆర్థిక, వ్యక్తిగత ఇబ్బందులను సైతం పక్కకు పెట్టి జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం రాంబాబు దీక్ష తలపెట్టడం అభినందనీయమని, జర్నలిస్టుల పక్షాన ముందుకు వచ్చి దీక్షకు కూర్చున్న తనకు తొలుత అండగా నిలుస్తామన్న సంఘాలు ఆ తర్వాత ముఖం చాటేయడం... వారి మోసపూరిత వైఖరికి నిదర్శనం అని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ద్వారా పలుమార్లు ఇండ్ల స్థలాలు పొందిన వారు... నిబంధనల ప్రకారం ఇప్పుడు మళ్లీ ఇండ్ల స్థలాలు రావని, రానీయరని తమ పదవులు, ప్రాపకం కోసం జర్నలిస్టులను పక్కదోవ పట్టించే చర్యలను టీడబ్ల్యూజేఎఫ్ ఖండిస్తోందన్నారు. జర్నలిస్టుల ప్రయోజనాల కోసం సంఘాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతు కూడగడతామని, ఇండ్ల స్థలాలు సాధించేందుకు దశల వారీ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకూ ఉద్యమాలు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటిస్తున్నట్లుగా న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాను నమ్మిన ఓ యూనియన్, మరో యూనియన్ తో కుమ్మక్కై తన ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం పట్ల మనోవేదనకు గురైనట్లు రాంబాబు పేర్కొన్నారు. తనను దీక్ష చేపట్టమని చెప్పిన జర్నలిస్ట్ సంఘాల నేతలు ఆ తర్వాత తాను చేస్తున్న దీక్షపై నిందలు వేసే విధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ నిర్మాణాత్మక సంఘంగా టీడబ్ల్యూజేఎఫ్ నికరమైన ఉద్యమాలు చేస్తోంది కాబట్టే తాను ఈ సంఘం తో కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అందుకే తాను ఇప్పటివరకు పని చేసిన టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్)కు, ఆ యూనియన్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని రాంబాబు ప్రకటించారు. తనకు ఆహ్వానం పలికి అక్కున చేర్చుకున్న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షులు దువ్వా సాగర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుబాటి మాధవ రావు, జిల్లా కమిటీ సభ్యులు కూరాకుల గోపీ, ఎస్ కే జానీపాష, నలుబోల మధుశ్రీ, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, కెమెరా మన్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు ఫయాజ్, భూక్యా గణేష్, అర్షద్, యూసుఫ్, పాల్గొన్నారు.

# ఏప్రిల్ 5న భారీ కవి సమ్మేళనం

- కుల వివక్ష పై గళమెత్తాలని కవులు, కళాకారులకు పిలుపు
- ఎస్ వి కే కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్



**ముషీరాబాద్, (జనంసాక్షి):** సామాజిక సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా ఏప్రిల్ 5న హైదరాబాద్, బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా భారీ 'కవి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాన్ని కవి సమ్మేళనం నిర్వాహకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ దేశంలో మనిషి హక్కులు ఆయన పుట్టుక ఆధారంగానే నిర్ణయించబడటం దురదృష్టకరం, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి పౌర హక్కులు కుల వ్యవస్థ వల్ల సామాన్యుడికి నిరాకరించబడుతున్నాయి అన్నారు. అదేవిధంగా మనిషి ఎదుగుదలకు కులం అతిపెద్ద ఆటంకంగా మారిందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న కుల వివక్షను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

అందుకే కుల నిర్మూలనసాంస్కృతికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కవి సమ్మేళనంలో కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి కార్యదర్శి కె. ఆనందాచారి,తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు కుల బాలో సవం ఉపాధ్యక్షురాలు సుజావతి, తెలంగాణ సాహితి సహాయ కార్యదర్శి అనంతోజు మోహన్ కృష్ణ తెలంగాణ సాహితి మహేష్ దుర్గే పాల్గొన్నారు.

# ప్రాక్టికల్ జ్ఞానం ఎంతో అవసరం

- అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కాన్ఫరెన్స్ "ప్రాణా-2026" విజయవంతం





**కరీంనగర్ (జనంసాక్షి) :** ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ యూజీ విద్యార్థులచే వైద్య విద్యార్థుల కోసం నిర్వహించిన అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కాన్ఫరెన్స్ "ప్రాణా--2026" ఘనంగా విజయవంతమైంది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో విద్యార్థులు తమ వైద్య పరిజ్ఞానం, పరిశోధనా ఆలోచనలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను ప్రదర్శించారు. రెండవ రోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హాజరై సిపి తనూ మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందన్నారు. మెడికల్ విద్యార్థులు రేపటి డాక్టర్లు కావడంతో, ప్రాక్టికల్ జ్ఞానం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాలు భవిష్యత్ కెరీర్‌కు మేలు చేస్తాయని అన్నారు. ఇటీవల పోలీస్ విభాగంలో కూడా ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నానని, "ఎమర్జింగ్ క్రైమ్స్" అంశంపై 2047 నాటికి ఎదురయ్యే సవాళ్లపై ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు వివరించారు. వైద్య రంగంలో జరుగుతున్న ఆధునిక పరిశోధనల గురించి ప్రస్తావిస్తూ, మెదడు నుంచి వచ్చే ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌ను డిజిటల్ పరికరాలతో అనుసంధానించి, శరీర భాగాలను నియంత్రించే టెక్నాలజీలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఆయన, అక్కడ ఉన్న ఆధునిక పరికరాలు విద్యార్థుల శిక్షణకు ఎంతో దోహదపడుతున్నాయని అభినందించారు. ప్రతిమ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ హాసిని మాట్లాడుతూ... "ప్రాణా" అంటే జీవశక్తి, ఉత్సాహం, లక్ష్యం.. ఈ మూడు విలువలను మీరు అందరూ ఆచరణలో చూపించారని డాక్టర్ హాసిని పేర్కొన్నారు. ఈ రెండు రోజులలో కేవలం ఆలోచనలు పంచుకోవడం మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ ఒక కొత్త దిశలో ఆలోచిస్తూ, కేవలం డాక్టర్లుగానే కాకుండా, ఆలోచ నాపరులు, నవీనతను తీసుకొచ్చే వారు, నాయకులుగా ఎదిగారన్నారు. ప్రెజెంటేషన్లు, చర్చలు, అర్థవంతమైన సంభాషణల ద్వారా ఆత్మవిశ్వాసం, సహకారం, సృజ నాత్మకత స్పష్టంగా కనిపించాయని ఇక్కడ మీరు నేర్చుకున్న సంబంధాలు, జ్ఞానం, టెక్నాలజీ ఇవన్నీ కేవలం మీకు సహాయం చేయడానికే కాదు, భవిష్యత్తులో మెరుగైన ఆరోగ్య సేవలను అందించేందుకు ఉపయో గపడాలన్నారు. కార్యక్రమంలో నిపుణులు వైద్య రంగంలో తాజా అభివృద్ధులు, నైపుణ్యాల ప్రాముఖ్యత, రోగి సేవలో నైతిక విలువలపై ప్రసంగించారు. విద్యార్థులను కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా, పరిశోధన, నాయకత్వ లక్షణాలు, సమగ్ర వైద్య సేవల వైపు దృష్టి సారించాలని ప్రోత్సహించారు. అనంతరం డాక్టర్ హాసిని సిపి గౌస్ ఆలం చేతులమీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిమ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ హాసిని సిపి గౌస్ ఆలంకు మెమెంటో ప్రధానం చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డా.జాన్ ఇజ్రాయెల్ (ప్రిన్సిపల్), రామచందర్ రావు (సీఏఓ), మెడికల్ సూపరింటెండెంట్ డా.సి.ఎన్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డా.కిషన్ రెడ్డి, రిజిస్ట్రార్ కమ్ అడ్మిన్ ప్రసాద్ రావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డా.అమిత్ (పిడియాట్రిక్స్ హెచ్ఓడీ), డా.ప్రణయ్, డా.సంధ్యా, డాక్టర్ టికేకే నాయకుడు ఓఎస్డీ, ఫ్యాకల్టీ బృందం, వివిధ డిపార్మెంట్ల వైద్య బృందం, సిబ్బంది , వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం

- అర్ధరాత్రి అక్రమ మద్యం విక్రయాలు
- శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్న పరిస్థితులు
- పోలీస్ పెట్రోలింగ్ పెంచాలంటున్న ప్రజలు




**వరంగల్ బ్యూరో, మార్చి 29 (జనంసాక్షి):** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి 40వ డివిజన్ లో గంజాయి మత్తులో ఉన్న యువకులు వీరంగం సృష్టించారు.అగ్గిపెట్టె విషయంలో చిన్న గొడవగా ప్రారంభమైన వివాదం, గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. సినిమా స్టైల్లో పరస్పరం దాడులు చేసుకున్న ఈ ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో, వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇటీవల వరుసగా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఘటనపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.ఇదిలా ఉండగా, ఉర్సు రోడ్డులో ఉన్న ఓ బార్‌లో అర్ధరాత్రి తర్వాత కూడా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి ఒంటి గంట సమయంలో బార్ మూసివేసిన తర్వాత ఒకరి ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అదే ప్రాంతంలో ఉన్న ఓ కిరాణా షాపు కూడా రాత్రి వేళల్లో తెరిచి ఉండడంతో, మద్యం సేవించిన యువకులు సిగరెట్లు, గుట్కా వంటి వస్తువుల కోసం అక్కడికి చేరుతూ పరిసరాల్లో ఉన్న కుటుంబాలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు హెచ్చరించినా మార్పు లేకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలపై మిల్స్ కాలనీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నగరంలో శాంతిభద్రతలు కాపాడేందుకు పెట్రోలింగ్ పెంచాలని కోరుతున్నారు.

## ఉప్పల్‌లో వరంగల్ బస్సు స్టాప్ మార్పు.. నల్లచెరువుకు తరలించే అవకాశం



**ఉప్పల్, (జనంసాక్షి):** ఉప్పల్ ప్రాంతంలో జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా వరంగల్ వైపు వెళ్లే బస్సుల స్టాప్‌ను మార్పు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రింగ్ రోడ్‌పై బస్సులు ఆగుతున్నప్పటికీ, త్వరలోనే కొత్తగా నిర్ణయించిన ప్రదేశంలో బస్సులు ఆగనున్నట్లు సమాచారం. వరంగల్, జనగాం, యాదగిరిగుట్ట, తొర్రూర్, భూపాలపల్లి దిశగా వెళ్లే బస్సులను నల్లచెరువు వద్దకు తరలించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ఈ మార్పులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ముందుగానే ఈ మార్పులను గమనించి, తమ ప్రయాణాలను అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.



## సికింద్రాబాద్‌లో సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠి సందడి

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రముఖ సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠీ సికింద్రాబాద్ లో సందడి చేశారు. సికింద్రాబాద్ ఆర్.పి.రోడ్ లో శ్రీ వెంకట రమణ గోల్డ్ అండ్ డైమండ్స్ 14వ ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సినీనటి లావణ్య త్రిపాఠి ప్రత్యేక అతిథిగా విచ్చేసి గ్రాండ్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మనీష్ మాట్లాడుతూ శ్రీ వెంకటరమణ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ సంప్రదాయం, వారసత్వం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబించే బంగారం వజ్రాభరణాలతో వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందిస్తోందనీ అన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ స్టార్ లో డై మండ్స్ రూ.46,999లు,1000 గ్రామ్స్ సిల్వర్ ఆర్టికల్స్ కొంటే 100 గ్రామ్స్ సిల్వర్ ఆర్టికల్స్ ఫ్రీ, బ్రైడల్ ఆఫర్ కింద 200 గ్రామ్స్ కొనుగోలు పై బ్రైడల్ గోల్డ్ జెవెల్లరీ హనీమూన్ ట్రిప్,500 కొనుగోలుపై బ్రైడల్ గోల్డ్ జెవెల్లరీ దుబాయ్ ట్రిప్ ఇంకా లాబ్ గ్రోన్ డైమండ్ కొన్నవారికి టీవీ, ఏసీ, సిల్వర్ జ్యువలరీ ఐఫోన్, స్కూటీ అందిస్తున్నామని చెప్పారు. ఈ ఆఫర్ మార్చి 29 నుండి ఏప్రిల్ 5 వరికి మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధునికతతో కూడిన సంప్రదాయ డిజైన్లు, పెళ్లిళ్లు, వధూవరుల వేడుకలు ప్రత్యేక సందర్భాల కోసం విభిన్న కలెక్షన్లు ఈ స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయనీ అన్నారు.

# సంఘటిత శక్తిగా మారాలి : డాక్టర్ నైనా జైస్వాల్

## పద్మశాలి భవన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు





**హైదరాబాద్, (జనంసాక్షి) :** మహిళలు సంఘటిత శక్తిగా ఎదిగినప్పుడే తెలంగాణ జాతీపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు నిజం అవుతాయని అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి డా. నైనా జైస్వాల్ అన్నారు. శనివారం అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం (అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం) ఆధ్వర్యంలో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో ఘనంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు తలుచుకుంటే అసాధ్యమనేది ఏదీ లేదని, సమాజాభివృద్ధి కోసం సంఘటిత శక్తిగా ఎదగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవలో విశేషకృషి చేసిన పలువురు మహిళలను శాలువా, మెమెంటోతో సత్కరించారు. అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు ధుష్యంతుల, ప్రధాన కార్యదర్శి సునీత, కోశాధికారి విశ్వరేఖ, ఉపాధ్యక్షులు పద్మ, లక్ష్మి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ అధ్యక్షురాలు పొరండ్ల శారద, చిలివేరి సునీత ,బసాని పద్మ, మిరియాల విశ్వరేఖ, పొట్టబత్తి అరుణ, వై.వాణి,కృష్ణ సంతోషి, గడ్డం కీర్తన, ఐటిపాముల ప్రవంతి, బొమ్మ ప్రవల్లిక, వర్ణలీల, వెంగళ పద్మ, వంగరీ స్వర్ణలత, డాక్టర్ సమత, అమరావతి, పోచం సుజాత, యశోద వంగ, చిలుకూరి మాధవి, పులి భువనేశ్వరి పాల్గొన్నారు.

# ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ కాలేజీలో కలకలం

- విద్యార్థినిపై లెక్చరర్ల కీచక పర్వం
- బీఎస్సీ డేటా సైన్స్ విద్యార్థినిపై మానసిక వేధింపులు
- ఆత్మహత్యాయత్నానికి దారితీసిన లెక్చరర్ల తీరు



**ఉప్పల్, మార్చి 29 (జనంసాక్షి):** విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలు వేధింపుల నిలయాలుగా మారుతున్నాయి. ఉప్పల్‌లోని ప్రముఖ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజీలో గురువుల ముసుగులో ఉన్న కొందరు కీచక లెక్చరర్ల అసలు స్వరూపం బయటపడింది. అనారోగ్యంతో బాధపడుతు న్న ఒక విద్యార్థినిని లక్ష్యంగా చేసుకుని, ఆమె గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించిన ఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బీఎస్సీ డేటా సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న సదరు విద్యార్థిని, గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే ఆమె కాలేజీకి రెగ్యులర్‌గా హాజరు కాలేకపోయింది. అయితే, చదువుపై ఉన్న ఆసక్తితో డాక్టర్ సర్టిఫికెట్లను సకాలంలో సమర్పిస్తూ పరీక్షలకు హాజరవుతోంది. కానీ, సాయం చేయాల్సిన లెక్చరర్లు ఆమె బలహీనతను ఆసరాగా చేసుకుని మానసిక వేధింపులకు తెరలేపారు.

**స్టాటిస్టిక్స్ లెక్చరర్ల టార్గెట్: బయటపడ్డ ఫిర్యాదు లేఖ**

బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లేఖలో ఇద్దరు స్టాటిస్టిక్స్ లెక్చరర్ల పేర్లను స్పష్టంగా ప్రస్తావించింది. గత కొన్ని నెలలుగా వారు ఆమెను ప్రతి అడుగులోనూ అవమానిస్తున్నట్లు పేర్కొంది. "నువ్వు ఎవరితో తిరుగుతున్నావో నాకు తెలుసు", "అసలు నువ్వు కాలేజీకి ఎందుకు వస్తున్నావు?" అంటూ తోటి విద్యార్థుల ముందు ఆమె క్యారెక్టర్‌ను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వెల్లడించింది. మెడికల్ సర్టిఫికెట్లు చూపించినా పట్టించుకోకుండా, కండోనేషన్ ఫీజు కట్టాలని, లేకపోతే పరీక్షలకు అనుమతించబోమని మానసిక ఒత్తిడికి గురిచేశారు. వ్యక్తిగత విమర్శలు: కేవలం చదువు విషయంలోనే కాకుండా, ఆమె వ్యక్తిగత జీవితంపై కూడా లెక్చరర్లు జోక్యం చేసుకుంటూ మానసిక మిగిల్చారని ఆరోపించింది.

**మృత్యువు అంచున విద్యార్థిని**

లెక్చరర్ల నిరంతర వేధింపులు భరించలేక, వారి అవమానకర మాటలను తట్టుకోలేక సదరు విద్యార్థిని తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే ఆమె ఇటీవల బలవన్మరణానికి (ఆత్మహత్యకు) కూడా ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొనడం కలవరపరుస్తోంది. "ఒక విద్యార్థిని ప్రాణం తీసుకునే స్థాయికి గురువులు ప్రవర్తించారంటే, అక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రక్షణ ఎక్కడ?**

తన బిడ్డ ప్రాణాలు పోయే పరిస్థితి రావడంతో బాధితురాలి తల్లి కన్నీరుమున్నీరవుతోంది."కాలేజీకి పంపేది చదువుకో వడానికా లేక ఇలాంటి వేధింపులు భరించడానికా?"అని ఆమె ప్ర శ్నించారు. తప్పు చేసిన లెక్చరర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని,పై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులను , విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు.

**దర్యాప్తు ప్రారంభించిన ఉప్పల్ పోలీసులు**

ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. బాధితురాలు సమర్పించిన ఆధారాలను, ఫిర్యాదు లేఖను పరిశీలిస్తున్నారు. కాలేజీలోని విద్యార్థుల నుంచి కూడా వివరాలు సేకరించే అవకాశం ఉంది. విద్యాసం స్థల్లో ఇలాంటి అరాచకాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
30 మార్చి 2026

## జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో కేసుల పరిష్కారం

- సీఐడీ అదనపు డీజీపీ చారు సిన్హా



హైదరాబాద్, మార్చి 29 (జనంసాక్షి) : రాజీ పడదగ్గ నేరారోపణలు, సివిల్ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని సిఐడి అదనపు డిజిపి చారు సిన్హా వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నాడు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో 1,44,251 కేసులు పరిష్కారం కావడం విశేషమని ఆమె వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు తొలుత మార్చి 14న జరగాల్సిన ఈ అదాలత్, మార్చి 28వ తేదీకి రీషెడ్యూల్ జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన లోక్ అదాలత్ కంటే ఈసారి 37.14 శాతం అధికంగా కేసులు పరిష్కారమయ్యాయని, అంటే దాదాపు 39,069 కేసులు అదనంగా పరిష్కారం అయ్యాయని ఆమె వివరించారు. ఈసారి లోక్ అదాలత్‌లో కేవలం సాధారణ కేసులే కాకుండా, సైబర్ నేరాల బాధితులకు సైతం పెద్దపీట వేశామని చారు సిన్హా తెలిపారు. మొత్తం 4,635 సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరించి, బాధితులకు సుమారు రూ.24.95 కోట్ల నగదును తిరిగి అందజేయగలిగామని ఆమె హర్షం వ్యక్తం చేశారు. వీటితో పాటు 21,388 రాజీ పడదగ్గ ఎఫ్.ఐ.ఆర్ కేసులు, 57,343 ఈ-పెట్టీ కేసులు, 60,094 మోటార్ వాహన చట్టం ఉల్లంఘన కేసులు మరియు 791 విపత్తు నిర్వహణ సంబంధిత కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రతువులో హైదరాబాద్ యూనిట్ 15,719 కేసుల పరిష్కారంతో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో మల్కాజిగిరి, సిద్దిపేట, రామగుండం మరియు నల్గొండ జిల్లాలు నిలిచాయని ఆమె వెల్లడించారు. లోక్ అదాలత్ విజయవంతం కోసం పోలీస్ యంత్రాంగం మార్చి 19 నుంచే కసరత్తు ప్రారంభించి, అర్హత ఉన్న కేసులను గుర్తించి ఇరు పక్షాలకు నోటీసులు అందజేసిందని అదనపు డిజిపి వివరించారు. న్యాయ వ్యవస్థ, పోలీస్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయం వల్లే ఈ విజయం సాధ్యమైందని, దీనివల్ల కక్షిదారులకు కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా సమయం, ధనం ఆదా అవుతాయని ఆమె అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ప్రజలు ఇలాంటి వేదికలను ఉపయోగించుకుని వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## 'సైబర్' బాధితులకు రూ.24.91 కోట్ల రీఫండ్


- జాతీయ లోక్ అదాలత్ ద్వారా తిరిగి బాధితులకు..
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్



హైదరాబాద్, మార్చి 29(జనంసాక్షి) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు తెలంగాణ పోలీసులు భారీ ఊరటనిచ్చారు. 2026 సంవత్సరపు జాతీయ అదాలత్ వేదికగా రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న బాధితులకు వారి సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఘన విజయం సాధించారు. ఈ మెగా లోక్ అదాలత్ ద్వారా మొత్తం 4,627 మంది బాధితులకు రూ. 24.91 కోట్ల నగదును రీఫండ్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, వివిధ బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ సంస్థలతో సమన్వయం చేసుకుని, అన్ని కమిషనరేట్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లతో కలిసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే రికార్డు స్థాయిలో రికవరీ సాధించామని, ముఖ్యంగా టీజీసీఎస్‌బీ ప్రధాన కార్యాలయం పరిధిలో 87 మంది బాధితులకు రూ. 5.64 కోట్లు తిరిగి ఇప్పించినట్లు శిఖా గోయల్ వివరించారు. అలాగే మల్కాజిగిరి విభాగం రూ. 4.79 కోట్లు (832 మంది బాధితులు), హైదరాబాద్ విభాగం రూ. 3.99 కోట్లు (553 మంది బాధితులు) రికవరీ చేసి అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. సైబరాబాద్, సంగారెడ్డి విభాగాలు చెరి రూ. 1.52 కోట్లను బాధితులకు చేరవేశాయని ఆమె వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే 2026లో సైబర్ నేరాల పట్ల స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేశామని, లోక్ అదాలత్ వంటి వ్యవస్థీకృత మార్గాల ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 53,434 మంది బాధితులకు ఏకంగా రూ. 399.06 కోట్ల మొత్తాన్ని రీఫండ్ చేయించినట్లు డైరెక్టర్ వెల్లడించారు. 2023లో రూ. 8.3 కోట్లుగా ఉన్న రీఫండ్ విలువ, 2024లో రూ. 183.9 కోట్లకు, 2025లో రూ. 183 కోట్లకు పెరిగిందని, ప్రస్తుతం 2026లో కేవలం మూడు నెలల్లోనే రూ. 24.91 కోట్లు సాధించడం తమ నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. యూపీఐ మోసాలు, పెట్టుబడి పథకాల పేరుతో జరిగే స్కామ్‌లు, ఐడెంటిటీ ఫ్రాడ్స్ వంటి వాటిపై బ్యాంకులు మరియు న్యాయవ్యవస్థతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రీఫండ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఆమె వివరించారు. ఇదే క్రమంలో ప్రజలు సైబర్ జాగ్రత్తలు పాటించాలని శిఖా గోయల్ విజ్ఞప్తి చేశారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు, పిన్ నంబర్లు, బ్యాంకింగ్ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే కస్టమర్ కేర్ నంబర్లను ధ్రువీకరించుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఒకవేళ మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే '1930' నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. నేరం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్) స్పందిస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, తెలంగాణను సైబర్ సురక్షిత రాష్ట్రంగా మార్చేందుకు తమ బ్యూరో నిరంతరం శ్రమిస్తుందని ఆమె పునరుద్ఘాటించారు.

## ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో సమగ్ర మార్పులు

- అసెంబ్లీలో బడ్జెట్ పద్దుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో సబ్ సెంటర్ల నుంచి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో సమగ్ర మార్పులు తీసుకువస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. పైసా ఖర్చు లేకుండా, ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. 2023 డిసెంబర్‌లో తమ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆరోగ్య రంగంలో భారీ నియామకాలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గత రెండు సంవత్సరాల్లో 9,572 పోస్టులను భర్తీ చేయగా, ప్రస్తుతం 7,267 పోస్టుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. మరో 2,929 పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మొత్తం కలిపి దాదాపు 19,768 పోస్టుల భర్తీ జరుగుతోందని మంత్రి వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల ద్వారా లక్షలాది మంది ప్రజలకు సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆరోగ్య సూచికలు దేశ సగటుతో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని వివరించారు. సెకండరీ హెల్త్ కేర్ సిస్టమ్‌ను పటిష్టం చేసేందుకు తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. ఈ నిర్ణయం ద్వారా కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్ల పనితీరు మెరుగుపడటంతో పాటు రోగులకు వేగంగా వైద్య సేవలు అందుతాయని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల నుంచి ప్రజలు హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరం లేకుండా, జిల్లా స్థాయిలోనే 80 శాతం వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచగా, మొత్తం 1,835 చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రెండేళ్లలో సుమారు 9.5 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య సేవలు అందించామని మంత్రి వెల్లడించారు. గతంలో సంవత్సరానికి 2.5 లక్షల మంది మాత్రమే సేవలు పొందగా, ప్రస్తుతం అది 4 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు.

# ఆడబిడ్డల అకౌంట్లలో పొదుపు సిరి

**రవాణా ఛార్జీల మొత్తం రూ.10,000 కోట్లు ఆదా**

- టికెట్ లేదు.. టెన్షన్ లేదు.. గమ్యానికి చేర్చే మహాలక్ష్మి తోడు
- ఇది కేవలం ప్రయాణం కాదు... తెలంగాణ ఆడబిడ్డల గెలుపు
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర సామాజిక, ఆర్థిక ముఖచిత్రంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల రవాణా ఛార్జీల మొత్తం నేటితో రూ. 10,000 కోట్ల మార్కును చేరుకుందని టీజీఎస్ ఆర్టీసీ అధికారికంగా ప్రకటించింది. 2023 డిసెంబర్ 9న పథకం ప్రారంభమైన నాటి నుంచి ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్లకు పైగా జీరో (ఉచిత ప్రయాణం) టికెట్లను మహిళా ప్రయాణికులు వినియోగించుకున్నట్లు రవాణా శాఖ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. గతంలో రవాణా ఛార్జీల కోసం నెలకు సగటున రూ. 1,500 నుండి రూ. 2,500 వరకు వెచ్చించే సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినులు, కూలీలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని, ఈ పొదుపు మొత్తం రాష్ట్రవ్యాప్తంగా రూ. 10,000 కోట్లకు చేరడం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. మహాలక్ష్మి అమలు తరువాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని, పథకం రాక ముందు 40 శాతంగా ఉన్న మహిళల వాటా, ప్రస్తుతం 67 శాతానికి పైగా నమోదవుతోందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నట్లు ఎండీ వెల్లడించారు. మహిళలు ఉచితంగా ప్రయాణించిన టిక్కెట్ల విలువను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీకి చెల్లిస్తోంది. తద్వారా ఆర్టీసీ ఆర్థిక బలోపేతం, సిబ్బంది జీతభత్యాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు ఈ నిధులు కొంత వెసలుబాటును కల్గిస్తున్నాయని ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ప్రారంభమైందని,ఆర్టీసీ లో మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి ద్వారా ఇప్పటి వరకు దాదాపు 290 కోట్ల మహిళా ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకొని మహిళలు 10వేల కోట్లు ఆదా చేసుకున్న సందర్భంగా మహిళలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనతి కాలంలోనే 290 కోట్ల ఉచిత ప్రయాణాలతో 10 వేల కోట్ల రూపాయలు ఆదా చేసుకున్న మహిళా ప్రయాణికుల కోసం నిరంతరం కృషి చేస్తున్న టీజీఎస్ ఆర్టీసీ సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు. మహాలక్ష్మి ద్వారా మహిళలు ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకొని నిత్యం ఆర్టీసీ బస్సుల్లో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ఉచితంగా ప్రయాణం చేస్తూ ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. మహిళలు చిన్న చిన్న గ్రామాల నుండి పట్టణాలకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని, గ్రామాల నుండి నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాదులో చికిత్స చేసుకుంటున్నారని, కుటుంబంతో కలిసి దేవాలయాలకు వెళ్తున్నారని ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

### మహాలక్ష్మి సేవల సౌలభ్యంకై మహిళలకు స్మార్ట్ కార్డుల జారీ

మహాలక్ష్మి పథకాన్ని మరింత సరళతరం చేసేందుకు, కచ్చితమైన గణాంకాల కోసం త్వరలో చిప్ ఆధారిత స్మార్ట్ కార్డుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎండీ నాగిరెడ్డి చెప్పారు. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండానే స్మార్ట్ కార్డులు ద్వారా మహిళల ఉచిత ప్రయాణం చేసేందుకు ఈ విధానం ఎంతగానో దోహదపడనుందని, పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెట్టడం జరుగుతోందని ఎండీ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళలకు గౌరవప్రదమైన, సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంలో భాగస్వాములైనందుకు టీజీఎస్‌ఆర్టీసీ గర్విస్తోందని సంస్థ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి అన్నారు. ఈ పథకం విజయవంతానికి సహకరిస్తున్న ప్రయాణికులకు, నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వానికి సంస్థ తరపున కృతజ్ఞతలు చెప్పారు. ఈ పథకం పల్లెవెలుగు 3278, డిస్ట్రిక్ట్ ఎక్స్‌ప్రెస్ 2039, సిటీ ఆర్డినరీ 1829, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ 1044 బస్సులలోని మొత్తం బస్సులలో 81% వర్తిస్తుందని వివరించారు. బాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉత్తమ, ఉన్నత విద్యను అభ్యసించేందుకు బాలికలకు ఈ ఉచిత ప్రయాణం ఎంతో దోహదపడుతుందని, తెలంగాణలోని ప్రతి మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా పది వేల కోట్ల రూపాయల రవాణా ఛార్జీలను ఆదా చేసుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తోందని అభివర్ణించారు.

## గత ప్రభుత్వ పాపాల్లో నాకూ భాగస్వామ్యముంది

- కాంగ్రెస్ అధికారంలోకొచ్చాక హామీని విస్మరించింది
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




హైదరాబాద్ (జనంసాక్షి) : గత ప్రభుత్వ పాపాల్లో తనకూ భాగస్వామ్యముందని, తనను క్షమించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహాధర్నాలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ వ్యవస్థ ఉండదని కలలుగంటే రాష్ట్రం వచ్చాక అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించాయని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కొన్ని శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మారారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో మార్పు తేలేకపోయినందుకు మీ సోదరిగా శిరస్సు వంచి క్షమాపణ కోరుతున్నానన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో తానూ ఉన్నానని ఆ పాపంలో తనకు కూడా భాగస్వామ్యం ఉంటుందని అందువల్ల క్షమాపణలు కోరుతున్నానని చెప్పారు.మాట్లాడిన కవిత.. తమ సమస్యలను బీఆర్ఎస్ పట్టించుకో కపోవడం వల్లే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిక్లేర్ చేసి మరీ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక పట్టించు కోవడం లేదన్నారు. 'కేసీఆర్ పాలనలో ధర్నాచౌక్ ఎత్తివేస్తే మేము వచ్చాక ధర్నా చౌక్ వద్ద అనుమతి ఇస్తామని కాంగ్రెస్ చెబితే ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచిస్తున్నారని అనుకున్నాం. కానీ ధర్నాచౌక్ ఇస్తాం మీ ఇష్టం ఉన్నన్నాళ్లు ధర్నాలు చేసి చావండి మేము మాత్రం స్పందించం అన్నట్లు కాంగ్రెస్ వ్యహరిస్తోందని ధ్వజమెత్తారు. నాడు ధర్నా చౌక్ లేకపోతే ఇప్పుడు ధర్నా చౌక్ ఉండి ఏం లాభం అని ప్రశ్నించారు. రెండున్నరేళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పోరాటం చేస్తుంటే ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్ వీధుల్లో మార్చ్ చేసేందుకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రణాళిక చేయాలన్నారు. అలా చేస్తే ప్రభుత్వం దిగి వచ్చి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఇవ్వక తప్పదన్నారు. 9 ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ లాభాలు వెళ్తోందని ఆరోపించారు. భవిష్యత్ లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండొద్దనేది తెలంగాణ జాగృతి లక్ష్యం అన్నారు. ప్రభుత్వానికి రెండు రోజుల గడువు ఇస్తున్నామని అన్ని శాఖల్లో దళారులు, మధ్యవర్తులు లేకుండా నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేలా కార్పొరేషన్ లేదా జీవోలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

## 9న నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల మెరిట్ లిస్ట్


హైదరాబాద్ (జనంసాక్షి) : ఏప్రిల్ 9న 2312 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్‌ను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేయనుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 174 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం విడుదల చేసింది. గైనకాలజీ, అనస్థీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాల్లో మొత్తం 174 పోస్టుల భర్తీకి ఈ జాబితా వెల్లడించినట్లు బోర్డు పేర్కొంది. గైనకాలజీలో 90 పోస్టులు, అనస్థీషియాలో 44 పీడియాట్రిక్స్‌లో 28, ఆర్థోపెడిక్స్‌లో 12 పోస్టులు ఉన్నాయి. మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని బోర్డు వెల్లడించింది. ఏప్రిల్ 1వ తేదీన హైదరాబాద్ వెంగళరావు నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. 2312 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఫైనల్ మెరిట్ లిస్ట్, సెల క్షన్ లిస్ట్‌ను ఏప్రిల్ 9వ తేదీ నాటికి విడుదల చేయనున్నట్టు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

### ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం: సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : అసెంబ్లీలో తమకు మైక్ ఇవ్వడం లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మైక్ ఇచ్చినా కూడా కట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. జీరో అవర్‌ను గంటలు గంటలుగా నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్ని ప్రశ్నలు లేవనెత్తినా సూటిగా సమాధానం ఇవ్వడం లేదని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కాంగ్రెస్ ఏం చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు.

## పాడి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి స్పీకర్‌ను కోరారు. అక్రమాలపై హౌస్ కమిటీ అంశంపై సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బిగ్గరగా అరుస్తూ.. ఇంతకీ ఏ పార్టీలో ఉన్నావ్ అంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆయన వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి నిప్పులు చెరిగారు. బడ్జెట్ డిమాండ్లపై అర్థవంతమైన చర్చ జరుగుతున్న సమయంలో, సభా సమయాన్ని వృధా చేస్తూ అల్లరి చేయడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తండ్రి లాంటి కడియం శ్రీహరి వంటి సీనియర్ నాయకులకు కనీస మర్యాద ఇవ్వకుండా మాట్లాడటం అప్రజాస్వామికమని ఆమె విమర్శించారు. సభలో జరుగుతున్న పరిణామాలను నిన్నటి నుంచి గమనిస్తున్నానని, కొత్త ఎమ్మెల్యేలుగా తాము ఎంతో కొంత నేర్చుకుందామని వస్తే.. బీఆర్ఎస్ సభ్యుల తీరు తమను అయోమయానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తన వల్ల తాము నేర్చుకున్నది కూడా మర్చిపోయే పరిస్థితి వస్తోందని యశస్వినీ రెడ్డి వ్యాఖ్యానించారు. సభను పక్కదారి పట్టిస్తున్న పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని, సభను స్పీకర్ ఆర్డర్‌లో పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. సభా సంప్రదాయాలను గౌరవించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి కోరారు.

## యువత ఫిట్‌గా ఉండాలి

- యువ భారత్ రన్‌లో గవర్నర్ సందేశం
- హైదరాబాద్‌లో ఘనంగా 'యువ భారత్ రన్ 2026'




హైదరాబాద్, మార్చి 29 (జనంసాక్షి) : యువత ఫిట్‌గా ఉండాలని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద ఆదివారం 'యువ భారత్ రన్ 2026' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి స్కూల్స్ సంయుక్త ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య తనయుడు యశస్వి మల్కా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవం దేశంలోనే అతిపెద్ద యువత ఆధారిత ఫిట్‌నెస్ ఉద్యమంగా నిలిచింది. 10,000 మందికి పైగా విద్యార్థులు, కుటుంబ సభ్యులు, యువ ప్రొఫెషనల్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన ఈ రన్‌కు ఫిట్ ఇండియా, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మద్దతు అందించగా, రెడ్ ఎఫ్ఎమ్ అధికారిక రేడియో భాగస్వామిగా వ్యవహరించింది. ఈ రన్‌లో 5 కిలోమీటర్ల "ది ఛాలెంజ్" (టైమ్డ్ రన్), 2 కిలోమీటర్ల "రన్ అండ్ బాండ్" (కుటుంబ సభ్యులు, ప్రారంభికుల కోసం), 500 మీటర్ల "యంగ్ రన్నర్స్" (చిన్నారుల కోసం) వంటి విభాగాలు ఏర్పాటు చేశారు. రన్‌తో పాటు జుంబా, యోగా వార్మప్ సెషన్స్, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, ప్లే జోన్స్, ఫుడ్ స్టాల్స్, గేమ్స్ వంటి వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టైమ్డ్ కేటగిరీల్లో విజేతలకు మొత్తం రూ.1 లక్ష నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా గారు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఐటీ మంత్రి దుదెల శ్రీధర్ బాబు, సినీ నటుడు శర్వానంద్ హాజరయ్యారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు కలిసి జెండా ఊపి 2కే, 5కే రన్‌ను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులను ప్రోత్సహించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ పరుగును జెండా ఊపి ప్రారంభించి, యువతకు దిశానిర్దేశం చేశారు. గవర్నర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత ఆరోగ్యకరమైన అలవాట్లపైనే ఆధారపడి ఉందన్నారు. కేవలం పరుగుగానే కాకుండా, ఇదొక శక్తివంతమైన ప్రజా ఉద్యమం అని ఆయన అభివర్ణించారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు ప్రతి కుటుంబం క్రియాశీల జీవనశైలిని అలవర్చుకో వాలన్నారు. మాదకద్రవ్యాల మహమ్మారిని తరిమి కొట్టి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి అని పిలుపునిచ్చారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కోసం ధ్యానం అవసర మని పేర్కొన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు మాట్లాడుతూ యువతలో విదేశీ అలవాట్లు పెరుగుతున్నా యని, అందరూ తమ మాతృభాషలో మాట్లా డాలని కోరారు. తల్లిదండ్రులతో సమయం గడపడం, ఉదయం త్వరగా లేవడం, వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవ డం వంటి మంచి అలవాట్లు అలవరుచు కోవాలని సూచించారు. ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్ ఆరోగ్యానికి హానికరమని, "ఇన్‌స్టంట్ ఫుడ్ అంటే కాన్స్టంట్ డిసీజ్" అని వ్యాఖ్యానించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370